وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ

బదర్

(Telugu)వార పత్రిక ఖాదియాన్

Weekly **BADAR** Qadian

సంపుటి: 11 | www.akhbarbadr.in | సంచిక: 43-44

సంపాదకులు: హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్,
ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్.

పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

సత్ప్రుర్షుల సహవాసమును పాటించు ఆదేశము

وَاصۡبِرۡ نَفۡسَکَ مَعَ الَّذِیۡنَ یَدۡعُوۡنَ رَبَّہُمۡ بِالۡغَدٰوۃِ وَالۡعَشِیِّ یُرِیۡدُوۡنَ وَجۡہَہٗ وَلَا تَعۡدُ عَیۡنٰکَ عَنۡہُمۡ ۚ تُرِیۡدُ زِیۡنَۃَ الۡحَیٰوۃِ الدُّنۡیَا ۚ

అనువాదం: ఉదయము, సాయంత్రము కూడ తమ ప్రభువు సంతోషమును కోరి అతనిని పిలుచు వారితో నీవు కూడ సహనము పాటించుము. నీవు ప్రపంచ జీవిత ఐశ్వర్యములు కోరు స్థితిలో నీ దృష్టి వారిని మించరాదు. **(కహఫ్ :29)**

తేది: 22-29 అక్టోబర్ 2026 క్రీ, శ. 10-17 జమాదిఉల్ అవ్వల్ 1448 హి,ఖ. 22-29 ఇఖా 1405 హి, శ.



ధార్మిక సమావేశాలలో విశ్వాసాన్ని కాపాడుకోవడం మరియు సత్యాన్ని వ్యక్త పర్చడం.

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాతు వస్సలాం ఇలా ఉపదేశించారు:

"మా అభిమతం ఏమిటనగా, ఒకవేళ మాట్లాడితే, స్పష్టంగా మరియు పూర్తిగా మాట్లాడాలి, లేనిపక్షంలో మౌనంగా ఉండాలి. ఇదే ఒక విశ్వాసి అనుసరించవలసిన పద్ధతి కూడా. ఎప్పుడైన ఏదైనా సభలో అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గురించి హేళన చేయడం, పరిహాసం చేయడం జరుగుతుండగా చూసినచో, అప్పుడు మీరు అక్కడి నుండి వెళ్లిపోవాలి, తద్వారా మీరు కూడా వారిలో ఒకరిగా పరిగణించబడకుండా ఉంటారు. లేదా అక్కడే ఉండి, వారి మాటలకు పూర్తిగా, స్పష్టంగా సమాధానం ఇవ్వాలి. ఇక్కడ రెండు మార్గాలే ఉన్నాయి: ఒకటి సమాధానం ఇవ్వడం, రెండవది మౌనంగా ఉండడం. ఈ రెండింటికి భిన్నంగా మూడవ మార్గాన్ని అనుసరించడం కపటత్వం అనబడుతుంది. అనగా ఆ సభలోనే కూర్చుని ఉండడం, వారు చెప్పే మాటలకు తల ఊపుతూ సమ్మతించడం, ఆపై తన విశ్వాసాన్ని అణకువగా, రహస్యంగా, నెమ్మదించి వ్యక్తపరచడం." **(మల్ఫూజాత్ సంపుటి 5, పేజి 449, బదర్ 14 మార్చి 1908)**

ధార్మిక సమావేశాల ప్రాముఖ్యత

హజ్రత్ మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ అహ్మద్, ఖలీఫతుల్ మసీహుస్సానీ రజియల్లాహ్ అన్హు ఇలా పేర్కొన్నారు:

కొంతమంది స్నేహితులు, వారి సంఖ్య చాలా తక్కువగా ఉన్నప్పటికీ, ఎంత నచ్చజెప్పినా సభ నుండి లేచి వెళ్లిపోతూ, బయట తిరుగుతూ ఉండటం నాకు విచారం కలిగిస్తోంది. ప్రతి జమాఅత్‌లోనూ కేవలం తమను తాము ప్రదర్శించుకోవడానికి వచ్చే కొంతమంది సభ్యులు ఉంటారనడంలో ఎలాంటి సందేహం లేదు. వారు సభలో తమ ఉనికిని ప్రదర్శించుకున్న తర్వాత అక్కడి నుండి వెళ్లిపోతారు. ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి కాలంలోనూ ఇటువంటి ప్రదర్శనాప్రియులు ఉండే వారని పవిత్ర ఖుర్ఆన్‌లో కూడా ప్రస్తావించబడింది. సభ జరిగినప్పుడు వారూ వచ్చేవారు. ప్రసంగం ప్రారంభమయ్యే ముందు అందరి మీదా దృష్టి పడేది. సహాబాలు (రజియల్లాహు అన్హుమ్) వారిని గమనించేవారు. అయితే, కార్యక్రమం ప్రారంభమైన తర్వాత వారు ఎవరి దృష్టికీ చిక్కకుండా మెల్లగా జారుకోవడం మొదలుపెట్టేవారు. అటువంటి వారి గురించి అల్లాహ్ తఆలా ఇలా పేర్కొన్నాడు: **"ఖద్ యఅలముల్లాహుల్లజీన యతసల్లూన మిన్‌కుం లివాజ"** అనగా "మీలో ఇతరుల దృష్టి నుండి తప్పించుకుంటూ, రహస్యంగా జారుకొని వెళ్లిపోయే వారిని అల్లాహ్ తఆలా తప్పకుండా బాగా ఎరుగును." అటువంటి ప్రదర్శనాప్రియ సభ్యులు ఇక్కడ కూడా ఉండవచ్చు. అయితే, చాలామంది ఈ విషయ ప్రాముఖ్యతను అర్థం చేసుకోరు. తాము చేస్తున్న ఈ పని ఎంతటి తప్పో వారికి తెలియదు. హదీసులలో ఇలా వస్తుంది: ఒకసారి ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రసంగిస్తున్నారు. అప్పుడు వారు (స) ఇలా తెలిపారు: అల్లాహ్ తఆలా నాకు ఇలా తెలియ జేశాడు: ఈ సభకు ఒక వ్యక్తి వచ్చాడు. సభ నిండిపోయి ఉండటాన్ని అతడు చూశాడు. అతనికి ప్రసంగం సరిగా వినిపించడం లేదు. అయినప్పటికీ, "ఇక్కడ అల్లాహ్ తఆలా స్మరణ జరుగుతోంది కాబట్టి, ఈ స్థలం నుండి వెళ్లిపో కూడదు" అని భావించి, సిగ్గుతో అక్కడే కూర్చున్నాడు. అప్పుడు అల్లాహ్ తఆలా ఇలా సెలవిచ్చాడు: "అతడు తన పాపాల విషయంలో నా పట్ల సిగ్గుపడ్డాడు కాబట్టి, నేను కూడా అతని పాపాల విషయంలో సిగ్గుపడతాను. అతని పాపాల కారణంగా అతడిని పట్టుకొని శిక్షించను." ఆ తర్వాత మరొక వ్యక్తి వచ్చాడు. అతడు కూడా సభలో కూర్చోవడానికి స్థలం లేదని గమనించాడు. అయినప్పటికీ, అటూ ఇటూ వెతికి, ప్రసంగం వినిపించే ఒక స్థలంలో కూర్చున్నాడు. అల్లాహ్ తఆలా ఇలా సెలవిచ్చాడు: "ఈ వ్యక్తి ప్రయత్నించి ముందుకు వచ్చి కూర్చున్నట్లే, నేను కూడా అతనికి నా సాన్నిత్యంలో ఒక స్థానాన్ని కల్పిస్తాను." ఆ తర్వాత మూడవ వ్యక్తి గురించి అల్లాహ్ తఆలా తెలియ జేశాడు. అతడు సభకు వచ్చాడు. అయితే, తనకు ప్రసంగం వినిపించడం లేదని గమనించి, తిరిగి వెళ్లిపోయాడు. అప్పుడు అల్లాహ్ తఆలా ఇలా సెలవిచ్చాడు: "ఈ వ్యక్తి అల్లాహ్ తఆలా స్మరణ జరిగే సభ నుండి తిరిగి వెళ్లిపోయినట్లే, నేను కూడా అతని నుండి నా ముఖాన్ని తిప్పుకుంటాను. అతని కోసం నా కారుణ్య ద్వారాలను తెరవను."

(ఫజాయిలుల్ ఖుర్ఆన్, పేజీలు 264-265)



ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనాలు:

عَنۡ أَبِي هُرَيۡرَةَ رَضِيَ اللّٰهُ عَنۡهُ قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: مَا اجۡتَمَعَ قَوۡمٌ فِي بَيۡتٍ مِنۡ بُيُوتِ اللّٰهِ، يَتۡلُونَ كِتَابَ اللّٰهِ، وَيَتَدَارَسُونَهُ بَيۡنَهُمۡ، إِلَّا نَزَلَتۡ عَلَيۡهِمُ السَّكِينَةُ، وَغَشِيَتۡهُمُ الرَّحۡمَةُ، وَحَفَّتۡهُمُ الۡمَلَائِكَةُ، وَذَكَرَهُمُ اللّٰهُ فِيمَنۡ عِنۡدَهُ.

అనువాదం: హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) గారు ఇలా ఉల్లేఖించారు: రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వారు ఇలా తెలిపారు:

"ప్రజలు అల్లాహ్ గృహాలలోని ఒక గృహంలో సమావేశమై, అల్లాహ్ గ్రంథాన్ని (ఖుర్ఆన్‌ను) పఠిస్తూ, పరస్పరం దానిని నేర్చుకుంటూ, నేర్పుకుంటూ ఉన్నప్పుడు, వారిపై ప్రశాంతత అవతరిస్తుంది. అల్లాహ్ కారుణ్యం వారిని ఆవరించుకుంటుంది. దైవదూతలు వారిని చుట్టుముట్టి ఉంటారు. అల్లాహ్ తఆలా తన సన్నిధిలో ఉన్నవారి మధ్య వారిని ప్రస్తావిస్తాడు."

(సహీ ముస్లిం కితాబు జ్జికర్ వ ద్దుఆ వ్వ త్తౌబహ్, వ్వ ఇస్తిగ్ఫార్, బాబ్ ఫజలుల్ ఇజ్తిమా అలా తిలావతిల్ ఖుర్ఆన్ వ అలా జికర్, హదీస్ 2699)

(అహ్మదియ్య వార్తలు)

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యద హుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు అల్లాహ్ తాలా కృపతో క్షేమంగా ఉన్నారు. జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ గారి కొరకు ప్రత్యేముగా దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ అన్వర్‌కు ఆరోగ్య వంతమైన, చురుకైన, దీర్ఘాయుష్షును ప్రసాదించు గాకా!. ఉన్నత ఆశయ సాధనాలను సమకూర్చు గాకా!, అనుక్షణం హుజూర్‌ను రక్షించుగాకా!, దేవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! *(ఆమీన్)*

اللّٰهُمَّ اَيِّدۡ اِمَامَنَا بِرُوۡحِ الۡقُدُسۡ
وَبَارِكۡ لَنَا فِيۡ عُمُرِهٖ وَاَمۡرِهٖ۔

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి ఆఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోప్రైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

సంపాదకీయం: لَا إِلٰهَ إِلَّا اللّٰهُ مُحَمَّدٌ رَّسُوْلُ اللّٰهِ

హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ గారు బ్రిటన్ జల్సా సాలానా 2026 సందర్భంగా సభ్యులను ఉద్దేశించి చేసిన విశ్వాసభరిత రెండవ రోజు రెండవ ప్రసంగపు సంక్షిప్త సారాంశం.

తషహుద్, తవుజ్జు మరియు సూరత్ ఫాతిహా పఠనం అనంతరం, హజ్రత్ హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తఆలా గారు ఇలా తెలిపారు:

ఇప్పుడు నేను ఈ సంవత్సరంలో అహ్మదీయ జమాఅత్‌పై అల్లాహ్ తఆలా కురిపించిన అనుగ్రహాల గురించి సంక్షిప్తంగా వివరిస్తాను.

జమాఅత్ విస్తరణ:

ఈ సంవత్సరం, పాకిస్తాన్ మినహా ప్రపంచవ్యాప్తంగా స్థాపించబడిన నూతన జమాఅత్‌ల సంఖ్య 398. ఈ నూతన జమాఅత్‌లతో పాటు, 811 కొత్త ప్రదేశాలలో అహ్మదీయ బీజం మొదటిసారిగా నాటబడింది. ఈ సంవత్సరం బెనిన్‌లో 86 నూతన జమాఅత్‌లు స్థాపించబడగా, ఆ తర్వాత కాంగో బ్రజ్జావిల్లే, లైబీరియా మొదలైన ఇతర దేశాలలో స్థాపించబడ్డాయి.

కొత్త మసీదుల నిర్మాణం:-

అదేవిధంగా, ఈ సంవత్సరంలో నిర్మించిన, జమాఅత్‌కు లభించిన మసీదుల మొత్తం సంఖ్య 172. వాటిలో 133 కొత్త మసీదులు నిర్మించబడ్డాయి మరియు 39 జమాత్‌కు ఇవ్వబడ్డాయి.

మిషన్ హౌస్‌లు మరియు తబ్లీగీ కేంద్రాల పెరుగుదల:-

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ దయవల్ల, ఈ సంవత్సరంలో 41 దేశాలలో 127 మిషన్ హౌస్‌లు నిర్మించబడ్డాయి. కెన్యా మొదటి స్థానంలో ఉండగా, ఆ తర్వాత ఘానా మరియు ఇండోనేషియా రెండవ స్థానంలో ఉన్నాయి. నైజీరియా మూడవ స్థానంలో ఉంది. శ్రమాదానం వల్ల, ఈ సంవత్సరం జమాఅత్ మూడు మిలియన్ల అమెరికన్ డాలర్లను ఆదా చేసింది.

ప్రచురణ మరియు ముద్రణ సంస్థ:-

ప్రచురణ సంస్థ నివేదిక ప్రకారం, ఈ సంవత్సరం 37 భాషలలో 353 రకాల పుస్తకాలు, కరపత్రాలు, ఫోల్డర్‌లు మొదలైనవి 16.89 కోట్లకు పైగా ముద్రించబడ్డాయి.

పవిత్ర ఖురాన్ వ్యాఖ్యానాలలో, గతంలో ఉర్దూలో 8 సంపుటాలుగా ప్రచురించబడిన హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గారి వ్యాఖ్యానం, మొదటిసారిగా పూర్తి అరబిక్ అనువాదంలో ప్రచురించబడింది. అదేవిధంగా, 'ఐదు సంపుటాల వ్యాఖ్యానం' అనే ఆంగ్ల వ్యాఖ్యానం కూడా ప్రచురించబడింది, దాని మొదటి సంపుటం యొక్క అరబిక్ అనువాదం పున: ముద్రణ జరిగింది.

హదీసుల విషయంలో, సహీ బుఖారీపై హజ్రత్ సయ్యద్ జైనుల్ అబిదీన్ వలీవుల్లా షా సాహిబ్ గారి వ్యాఖ్యానం యొక్క మొదటి సంపుటి ఆంగ్ల అనువాదం రెండవసారి ప్రచురించడం జరిగింది. అదే విధముగా రెండవ సంపుటి యొక్క ఆంగ్ల అనువాదం మొదటిసారిగా ప్రచురించబడింది. ఇది గొప్ప విజ్ఞాన నిధి. మిత్రులు దీని నుండి ప్రయోజనం పొందాలి.

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గారి పుస్తకాల అనువాదాలలో, 45 పుస్తకాలు 18 భాషలలోకి అనువదించబడ్డాయి. హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ (అ) గారి 11 పుస్తకాలు 6 భాషలలో ప్రచురించబడ్డాయి. హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్ స్సాలిస్ (రహ్మ) రచించిన "అల్లాహ్ గృహ నిర్మాణంలోని 23 గొప్ప లక్ష్యాలు" అనే పుస్తకం యొక్క అరబిక్ అనువాదం మొదటిసారిగా ప్రచురించబడింది. హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్ ర్రాబేహ్ (రహ్మ) రచించిన "క్రైస్తవ మతం , వాస్తవాల నుండి కల్పనల వరకు ఒక ప్రయాణం" అనే పుస్తకం యొక్క బల్గేరియన్ అనువాదం మరియు "ఇస్లాంపై ఒక ప్రాథమిక అధ్యయనం" యొక్క డానిష్ అనువాదం కూడా మొదటిసారిగా ప్రచురించబడ్డాయి.

అదేవిధంగా, నేను వివిధ సమయాల్లో సమాధానమిచ్చిన ప్రశ్నలకు సమాధానాలు కూడా పుస్తక రూపంలో, మరియు ఆంగ్లంలో కూడా ప్రచురించబడ్డాయి. అదే విధంగా, నేను ఇచ్చిన మరికొన్ని ఉపన్యాసాలు కూడా ఫ్రెంచ్, అరబిక్, జర్మన్, ఇండోనేషియన్ మొదలైన వివిధ భాషలలో ప్రచురించబడ్డాయి.

నజారత్ నషర్ వ ఇషాఅత్ ఖాదియాన్:-

నజారత్ నషర్ వ ఇషాఅత్ ఖాదియాన్ ఇప్పటివరకు భారతదేశంలోని 14 స్థానిక భాషలలో పవిత్ర ఖురాన్ అనువాదాన్ని ప్రచురించింది. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ దయవల్ల, ఈసారి పవిత్ర ఖురాన్ యొక్క 'తౌహీద్ నస్తాలిఖ్' ఫాంట్‌ను ఖాదియాన్ నుండి తయారుచేయడం జరిగింది. అహ్మదీయ జమాఅత్ తయారు చేసిన మొట్టమొదటి నస్తాలిఖ్ ఫాంట్ ఇదే. తఫ్సీర్-ఎ-సఘీర్ యొక్క అరబిక్ పాఠాన్ని 'ఖత్-ఎ-మంజూర్' ఫాంట్‌లో, మరియు ఉర్దూ పాఠాన్ని ఈ కొత్త ఫాంట్‌లో తయారు చేయడం జరిగింది. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వారి గ్రంథాలు భారతదేశంలోని ప్రాంతీయ భాషలలోకి కూడా అనువదించబడ్డాయి.

వకాలతే తస్నీఫ్:-(యూకే పబ్లిషింగ్ సంస్థ)

వకాలతే తస్నీఫ్ యు.కే పవిత్ర ఖురాన్ అనువాదాన్ని లిథువేనియన్ అనే కొత్త భాషలో ప్రచురించింది. ఇప్పుడు అహ్మదీయ జమాఅత్ ద్వారా వివిధ భాషలలో ప్రచురించబడిన పవిత్ర ఖురాన్ అనువాదాల సంఖ్య 79కి చేరుకుంది. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వారి గ్రంథాలైన నజ్మూల్ హుదా, ఖుత్బా-ఎ-ఇల్‌హామియా, కరామతు స్సాదిఖీన్ మరియు మల్ఫూజత్, 5వ సంపుటిల ఆంగ్ల అనువాదాలు ప్రచురించబడ్డాయి. బరాహీనే అహ్మదీయ యొక్క నాలుగు భాగాల ఆంగ్ల అనువాదం ఒకే సంపుటంలో ప్రచురించబడింది. హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ (రజి) వారి గ్రంథాలైన ఇన్కిలాబే హఖీఖీ, ముతాల్బాతే తహ్రీక్-ఎ-జదీద్, ఇర్ఫాన్-ఎ-ఇలాహీ మరియు వకాఆతే ఖిలాఫాతే ఉలువ్వీ ల ఆంగ్ల అనువాదాలు ప్రచురించబడ్డాయి.

జమాఅత్‌లలో ప్రాంతీయ మరియు కేంద్ర గ్రంథాలయాల స్థాపన:-

ఇప్పటివరకు, ప్రపంచంలోని 108 దేశాలలో 732 గ్రంథాలయాలు స్థాపించబడ్డాయి.

ప్రచురణ మరియు పంపిణీ సంస్థ:-

ప్రపంచ వ్యాప్తంగా 22 భాషలలో 116 మ్యాగజైన్‌లు, సంచికలు మరియు వార్తాపత్రికలు ప్రచురించబడుతున్నాయి.

ప్రదర్శనల నిర్వాహణ:-

ప్రపంచ వ్యాప్తముగా నిర్వహించిన 3,688 ప్రదర్శనల ద్వారా ఇస్లాం అహ్మదీయత్ యొక్క సందేశం ప్రపంచ వ్యాప్తంగా 10,07,000 కంటే ఎక్కువ మందికి చేరింది.

రకీమ్ ప్రెస్:-

రకీమ్ ప్రెస్ ప్రచురించిన పుస్తకాల సంఖ్య 1,57,240. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ దయతో రకీమ్ ప్రెస్ ఇక్కడ చాలా పని చేస్తోంది. ఆఫ్రికాలోని ఏడు దేశాలలో మనకు ప్రెస్‌లు ఉన్నాయి, అక్కడ 7,60,000 పుస్తకాలు, మరియు 8.2 మిలియన్లకు పైగా వార్తాపత్రికలు, కరపత్రాలు మరియు సంచికలు, ఇంకా సువార్త మరియు విద్యా సంబంధిత సాహిత్యం ప్రచురించబడ్డాయి.

వకాలతే తఅమీల్ వ తన్‌ఫీజ్ భారత్ నివేధికల ప్రకారం, హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్ అవ్వల్ (రజి) వారి ఇంటి ఆవరణలో అల్లాహ్ ఉనికికి నిదర్శనం అనే ఆంశంపై "అల్-ముజిబ్" అనే పేరుతో ఒక ప్రదర్శనను కొనసాగిస్తున్నారు. ఖాదియాన్‌లో ఒక కేంద్ర పరిశోధన సెల్ బోర్డు (మర్కజీ రిసర్చ్ సెల్ బోర్డు) కూడ స్థాపించబడింది.

అరబిక్ డెస్క్ ఆధ్వర్యంలో ప్రచురించబడిన పుస్తకాల సంఖ్య ఇప్పటివరకు 200కి చేరుకుంది. వీటిలో రుహాని ఖజాయిన్‌కు చెందిన పూర్తి ఉర్దూ పుస్తకాలు, మల్ఫూజత్ పూర్తి సంకలనం, హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ (రజి) వారి తఫ్సీర్ కబీర్ పది సంపుటాల సంకలనం మరియు మరో 34 పుస్తకాల అనువాదాలు ఉన్నాయి. ఈ సంవత్సరంలో ముజ్మూఅ ఇష్తిహారాత్ (ప్రకటనల సంకలనం) యొక్క మూడు సంపుటాలు, దావతుల్-అమిర్ యొక్క అరబిక్ అనువాదం మరియు మరికొన్ని అనువాదాలు కూడా ప్రచురించబడ్డాయి.

బంగ్లా విభాగం, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వారి 6 పుస్తకాల అనువాదాలను ప్రచురించింది. వారు నా ప్రసంగాలను కూడా ప్రచురించారు.

ఫ్రెంచ్ విభాగం 'లెక్చర్ లాహోర్' యొక్క ఫ్రెంచ్ అనువాదాన్ని ప్రచురించింది.

టర్కిష్ భాషలో కూడా కొన్ని అనువాద పనులు జరుగుతున్నాయి. స్పానిష్ విభాగం ఈ సంవత్సరంలో ఆరు పుస్తకాల అనువాదాలను పూర్తి చేసింది. చైనీస్ విభాగం హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ (రజి) వారి 1924 మత సదస్సు ఉపన్యాసాలను అనువదించింది.

కరపత్రాలు మరియు ప్లేయర్‌ల పంపిణీ:-

ఈ సంవత్సరం 120 దేశాలలో మొత్తం 78 లక్షల 66 వేలకు పైగా కరపత్రాలు పంపిణీ చేయబడ్డాయి. దీని ద్వారా 3 కోట్ల 92 లక్షల కంటే ఎక్కువ మందికి సందేశం చేరవేయబడింది.

వక్ఫ్-ఎ-నౌ కార్యక్రమంలో పాల్గొన్న బాలుర సంఖ్య 50,981 కాగా, బాలికల సంఖ్య 36,686. ఈ సంవత్సరం, 74 దేశాలకు చెందిన 3,116 మంది తల్లిదండ్రులు తమ భవిష్యత్ పిల్లలను వక్ఫ్-ఎ-నౌకు సమర్పించారు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వారు ప్రారంభించిన 'రివ్యూ ఆఫ్ రెలిజియన్స్' పత్రిక ఇప్పుడు తన 124వ సంవత్సరంలోకి అడుగుపెట్టింది. ఇది ఇంగ్లీష్, జర్మన్, స్పానిష్ మరియు ఫ్రెంచ్ భాషలలోని వివిధ వేదికల ద్వారా లక్షలాది మంది ప్రజలకు చేరువవుతోంది. ఈ సంవత్సరంలో దీని డిజిటల్ ఎడిషన్ కూడా ప్రారంభించ బడింది.

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ దయవల్ల, అల్-ఫజల్ ఇంటర్నేషనల్ ఇప్పుడు చాలా పెద్ద సంఖ్యలో ప్రచురించబడుతోంది.

ఎమ్‌టిఎ ఇంటర్నేషనల్‌కు 16 శాఖలు ఉన్నాయి, మొత్తం 568 మంది సేవకులు రేయింబవళ్లు సేవలందిస్తున్నారు.

(7వ పేజీలో చదవగలరు)



జుమా ప్రసంగము

అతిథి సత్కార బాధ్యతలను నెరవేర్చినప్పుడే ఈ గౌరవం నిజంగా సార్థకమ వుతుందని వారందరూ ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి. వారు ప్రతి అతిథినీ గౌరవ మర్యాదలతో చూడాలి, దయ మరియు మంచి ప్రవర్తనతో వ్యవహరించాలి, అలాగే ప్రతి అతిథి యొక్క భావాలను మరియు మనోభావాలను దృష్టిలో ఉంచుకోవాలి.

అల్లాహ్ మీకు ఈ జల్సా నుండి ఆధ్యాత్మికంగా, విశ్వాసం పరంగా మరియు జ్ఞానం పరంగా అన్ని విధాలా ప్రయోజనం చేకూర్చుగాకా!. మరియు ఈ జల్సా యొక్క ఆశీర్వాదాలు మీ జీవితాల్లోనూ, మీ తదుపరి తరాల జీవితాల్లోనూ శాశ్వత భాగంగా ఉండుగాకా!. అలాగే, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఏ ఉద్దేశంతో పంపబడ్డారో, ఆ ఉద్దేశాన్ని నెరవేర్చే వారిలో మీరు ఉందురు గాకా!.

సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 24 జులై 2026 (24 వఫా 1404 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهُ لَا شَرِيكَ لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُولُهُ

أَمَّا بَعْدُ فَأَعُوذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيمِ- بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيمِ-

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ○

اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ ۙ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ దయవల్ల, యూకే జల్సా సాలానా ఈ రోజు ప్రారంభమవుతోంది. దేశంలోని నలుమూలల నుండి మరియు ప్రపంచంలోని వివిధ దేశాల నుండి అతిథులు ఈ జల్సాలో పాల్గొనడానికి వస్తున్నారు, వచ్చారు లేదా రాబోతున్నారు. వారందరూ హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వారి అతిథులు, ఒక ప్రత్యేకమైన ధార్మిక ప్రయోజనం కోసం ఇక్కడికి వచ్చారు. అందువల్ల, ఈ అతిథులకు సేవ చేయడమే గొప్ప గౌరవప్రదమైన విషయం.

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ దయవల్ల, ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ జల్సా సాలానా జరిగినా, పిల్లలు, యువకులు, పురుషులు మరియు స్త్రీలు అనే తేడా లేకుండా అందరూ జల్సా అతిథులకు సేవ చేయవలసిన తమ బాధ్యతను గుర్తిస్తారు. ఈ స్ఫూర్తితో, వారు ఈ సేవ కోసం స్వచ్ఛందంగా ముందుకు వస్తారు. ప్రపంచ ప్రాధాన్యతలు మారినప్పటికీ, జమాఅత్‌లోని నిష్కపటమైన సభ్యులు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వారి అతిథులకు సేవ చేయడానికి తమను తాము సమర్పించు కుంటూనే ఉన్నారు. నేను చెప్పినట్లుగా, పిల్లల నుండి వృద్ధుల వరకు మరియు వివిధ ప్రాపంచిక వృత్తులలో నిమగ్నమైన వారు కూడా, ఈ సేవకు తమను తాము అంకితం చేసుకోవడానికి ఈ రోజులలో తమ పనుల నుండి సెలవు తీసుకుంటారు.

తమ అతిథులను గౌరవించాలని, మర్యాద చేయాలని సర్వశక్తిమంతుడైన అల్లాహ్ విశ్వాసులకు ఆజ్ఞాపించాడని నిజంగా గ్రహించిన వారు వీరే. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన ఆచరణాత్మక ఉదాహరణ మరియు సూక్తుల ద్వారా, ఈ బాధ్యతను నెరవేర్చమని తన అనుచరులను పదేపదే ప్రోత్సహించారు. అదే విధంగా, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) కూడా ఈ విషయంపై పదేపదే దృష్టిని ఆకర్షించారు.

ప్రయాణికునికి చెందవలసిన హక్కును నెరవేర్చమని సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మనకు ఆజ్ఞాపిస్తున్నాడు. (బనీ ఇస్రాయీల్:27) అదేవిధంగా, పవిత్ర ఖురాన్ ప్రవక్త ఇబ్రాహీం (అలైహిస్సలాం) వారి ఉదాహరణను నమోదు చేస్తుంది; ఆయన వద్దకు అతిథులు వచ్చినప్పుడు, వారు భోజనం చేయాలనుకుంటున్నారా అని ఆయన మొదట అడగలేదు. బదులుగా, ఆయన వెంటనే ఒక దూడను వధించి, దానిని కాల్చి, ఆపై తన అతిథుల ముందు ఉంచేవారు. (హూద్ :70)

అదేవిధంగా, ఒక హదీసులో దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలిపారు: "ఎవరైతే అల్లాహ్‌ను మరియు అంతిమ దినాన్ని విశ్వసిస్తారో, వారు తమ అతిథిని గౌరవించాలి మరియు వారికి చెందవలసిన హక్కులను నెరవేర్చాలి." "అతిథికి ఉండవలసిన హక్కు ఏమిటి?" అని అడగబడింది. అందుకు ప్రవక్త (స) ఇలా అన్నారు: "అతిథి సత్కారం అనేది ఒక రోజు మరియు ఒక రాత్రి పాటు చేయాలి." మరొక కథనంలో, అతిథికి మూడు రోజుల పాటు ఆతిథ్యం ఇవ్వాలని ప్రవక్త (స) సూచించారు. **(సహీ బుఖారీ, కితాబుల్-అదాబ్, బాబ్ ఇక్రమి జ్జైఫ్ వ ఖిద్మతిహి ఇయ్యాహు బి-నఫ్సిహి హదీస్ 6135)**

ఈ సూచన ఇళ్లకు వచ్చి కొన్ని రోజులు గడిపే ప్రత్యేక అతిథులకు వర్తిస్తుంది. కానీ సాధారణంగా, ఎవరైనా అతిథిగా వచ్చినప్పుడు వారికి ఆతిథ్యం ఇవ్వాలని ముస్లింలకు ఆదేశం ఉంది. అయితే, ఈ 'జల్సా' (వార్షిక సమ్మేళనం) రోజుల్లో వచ్చే అతిథులు సుదూర ప్రయాణాలు చేసి వస్తారు. వారు దూర దేశాల నుండి ప్రయాణించి వస్తారు మరియు వారిలో చాలా మంది మూడు రోజుల కంటే ఎక్కువ కాలం ఇక్కడే ఉంటారు. జమాఅత్ ఏర్పాట్ల ప్రకారం, వారు ఎంతకాలం ఉన్నా అది రెండు, మూడు వారాలు లేదా నాలుగు వారాలైనా సరే వారికి ఆతిథ్యం అందించ బడుతుంది. ఈ అతిథులకు సేవ చేయడానికి ఇంత పెద్ద సంఖ్యలో సేవకులు అందుబాటులో ఉండటం అనేది సర్వశక్తిమంతుడైన అల్లాహ్ జమాఅత్‌పై చూపిన గొప్ప అనుగ్రహం. వీరు జీతం తీసుకునే ఉద్యోగులు కాదు. వాస్తవానికి, స్వచ్ఛంద సేవకులు మూడు లేదా నాలుగు వారాల పాటు ఈ సేవ కోసం తమను తాము స్వచ్ఛందంగా అంకితం చేసుకుంటారు. వాస్తవానికి, యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఆతిథ్య ఏర్పాట్లు ఇప్పుడు ఎంత విస్తృతంగా మారాయంటే, 'మసీహ్ మౌవూద్' (అ) వారి 'లంగర్' (సామూహిక వంటశాల) ఏడాది పొడవునా పనిచేస్తూనే ఉంటుంది. సొంత వ్యాపారాలు ఉన్న అనేక మంది వ్యక్తులు – కొందరు రెస్టారెంట్లు నడిపేవారు, మరికొందరు క్యాటరింగ్ సేవలు నిర్వహించేవారు – ఏడాది పొడవునా తమ సమయంలో కొంత భాగాన్ని అతిథులకు సేవ చేయడానికి క్రమం తప్పకుండా కేటాయిస్తారు. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని జమాఅత్‌కు ఈ ప్రత్యేక గౌరవం లభించడానికి కారణం ఇక్కడ ఖిలాఫత్ ప్రధాన కార్యాలయం ఉండటమే. వర్తమాన ఖలీఫా ఇక్కడ ఉండటం వల్ల, సందర్శకుల రాకపోకలు నిరంతరం కొనసాగుతూనే ఉంటాయి, తద్వారా అతిథి సత్కారం అనేది ఒక నిరంతర బాధ్యతగా మారుతుంది. అందువల్ల, సాధారణ ఆతిథ్య కార్యక్రమాలు ఏడాది పొడవునా కొనసాగుతాయి. అల్లాహ్ అనుగ్రహంతో, జమాఅత్ సభ్యులు ఈ బాధ్యతను అత్యుత్తమ రీతిలో నిర్వర్తిస్తారు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వారందరికీ ప్రతిఫలాన్ని ప్రసాదించుగాకా!.

కార్యకర్తలే కాకుండా, నేను ఇంతకు ముందే చెప్పినట్లుగా, అనేక మంది ఇతరులు కూడా స్వచ్ఛంద సేవకులుగా విలువైన సేవలను అందిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ, ఇవి 'జల్సా' (సమ్మేళనం) రోజులు. ఈ సమయంలో మనం అతిథుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి వారిని చూసుకోవాలి. దైవ ప్రవక్త (స) ఆదేశించినట్లుగా, ప్రతి అతిథినీ పూర్తి గౌరవ మర్యాదలతో చూడాలి. ఇది అత్యంత ఆవశ్యకం, ఎందుకంటే ఇది మన విశ్వాసంలో ఒక భాగం. అల్లాహ్ మరియు అంతిమ దినంపై నిజమైన విశ్వాసం ఉంచడంలో ఇదొక ముఖ్యమైన ఆవశ్యకత.

వాస్తవానికి, ఒక విశ్వాసి అతిథి సత్కారం చేయడం, ఉన్నతమైన నైతిక విలువలు కలిగి ఉండటం మరియు అతిథులతో దయ, మర్యాదలతో వ్యవహరించడం అనేది విశ్వాసపు ఆవశ్యకతలలో ఒకటి. కాబట్టి, సేవ చేసే అవకాశం లభించిన వేలాది మంది వాలంటీర్లకు ఇందులో స్త్రీలు, పురుషులు, వృద్ధులు మరియు యువకులు అందరూ ఉన్నారు. ఈ రోజులు ఒక గొప్ప గౌరవాన్ని కల్పిస్తున్నాయి.

అతిథి సత్కార బాధ్యతలను నెరవేర్చినప్పుడే ఈ గౌరవం నిజంగా సార్థకమ వుతుందని వారందరూ ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి. వారు ప్రతి అతిథినీ గౌరవ మర్యాదలతో చూడాలి, దయ మరియు మంచి ప్రవర్తనతో వ్యవహరించాలి, అలాగే ప్రతి అతిథి యొక్క భావాలను మరియు మనోభావాలను దృష్టిలో ఉంచుకోవాలి.

అతిథి మనోభావాలు అత్యంత సున్నితమైనవని, కాబట్టి వాటిని ఎల్లప్పుడూ పరిగణనలోకి తీసుకోవాలని హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) పేర్కొన్నారు.

(మల్ఫూజాత్ సంపుటి 5, పేజీ 111, ప్రచురణ 2020)

కాబట్టి, అతిథులకు సాధ్యమైన అన్ని విధాలుగా సేవ చేయడం మన బాధ్యత అని మనం ఎప్పటికీ మర్చిపోకూడదు. ఈ సేవ కోసం మనం ముందుకు వచ్చినట్లయితే, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క ప్రసన్నతను పొందే లక్ష్యంతోనే ఈ బాధ్యతను నెరవేర్చడానికి మన శక్తిమేర కృషి చేయాలి. తద్వారా ఈ సేవకు ప్రతిఫలంగా అల్లాహ్ మన పట్ల సంతోషించాలి మరియు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) అతిథులకు సేవ చేసే బాధ్యతలను మనం మన శక్తిమేర నెరవేర్చాలి.

మన కార్యకర్తలు అందించే ఆతిథ్యం మరియు 'జల్సా' (సమ్మేళనం) కోసం చేసిన మొత్తం ఏర్పాట్లు అహ్మదీయేతరులపై మరియు ముస్లిమేతరులపై గాఢమైన ముద్ర వేస్తాయి. వేలాది మంది ప్రజల కోసం పూర్తిగా స్వచ్ఛంద సేవకుల ద్వారా ఆహారం తయారు చేయబడటం చూసి వారు ఆశ్చర్యపోతారు. అలాగే, ఒక చక్కని వ్యవస్థ ద్వారా సమర్థవంతంగా భోజనం వడ్డించడం మరియు అతిథుల సంరక్షణ కోసం అన్ని రకాలుగా ప్రయత్నం చేయడం వంటి వాటిని కూడా వారు గమనిస్తారు. అంతేకాకుండా, 'జల్సా' అంతటా పనిచేసే సమగ్ర స్వచ్ఛంద సేవా వ్యవస్థను వారు చూస్తారు. ట్రాఫిక్ నిర్వహణ, ఆహార పంపిణీ, పరిశుభ్రత, వంట, నీటి సరఫరా మరియు అనేక ఇతర విభాగాలకు సంబంధించిన ఏర్పాట్లు ఉంటాయి. అల్లాహ్

అనుగ్రహంతో, జమాఅత్ యొక్క స్వచ్ఛంద సేవకులు ఈ అన్ని రంగాలలోనూ సేవలంది స్తున్నారు. వారు కేవలం సేవ చేయడమే కాకుండా, అల్లాహ్ దయతో ఆదర్శవంతమైన రీతిలో ఆ సేవను చేస్తున్నారు. జమాఅత్ బయటి వ్యక్తులు తాము చూస్తున్న వాటిని చూసి ఎంతగానో ప్రభావితమవుతారు. ఇది కూడా 'తబ్లీగ్' (సందేశ ప్రచారం)కు ఒక సాధనంగా పనిచేస్తుంది.

కాబట్టి, సేవ చేయడానికి వచ్చిన ప్రతి కార్యకర్త – వారు అనుభవజ్ఞులైనా లేదా మొదటిసారి సేవ చేస్తున్నవారైనా సరే – తాము హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) అతిథులకు సేవ చేయడానికి వచ్చామని గుర్తుంచుకోవాలి. అందువల్ల, వారు ఈ బాధ్యతను సాధ్యమైనంత ఉత్తమ రీతిలో నెరవేర్చడానికి మరియు అతిథుల హక్కులను తీర్చడానికి అన్ని విధాలా ప్రయత్నించాలి. ఇది ఒకరి విశ్వాసంలో ఒక ముఖ్యమైన భాగం.

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) అతిథులకు ఏ స్థాయిలో సేవ చేసేవారో లేదా వారి బాగోగులు చూసుకునేవారో తెలియజేసే ఒక కథనం ఉంది. ఒక కథనంలో ఇలా గలదు: హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) అతిథుల పట్ల అసాధారణమైన ఆతిథ్యాన్ని చూపేవారు. లంగర్ వద్ద అతిథుల బాగోగులు చూసుకోవడానికి హాఫిజ్ హమీద్ అలీ సాహిబ్‌ను నియమించారు. సాధారణ రోజులలో, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) అతిథుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని మరియు వారి అతిథి హోదాకు తగినట్లుగా వారికి సేవ చేయాలని ఆయన దృష్టిని ఆకర్షించేవారు.

(జిక్రే హబీబ్, హజ్రత్ ముఫ్తీ ముహమ్మద్ సాదిఖ్ సాహెబ్ రజి పే. 153)

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ దయవల్ల, జమాఅత్ సభ్యులు సంవత్సరం పొడవునా సందర్శిస్తారు, మరియు జమాఅత్ తన స్థోమతకు తగినట్లుగా వారికి సేవ చేస్తుంది. అయితే, జల్సా రోజులలో వారిని అదే స్థాయిలో చూసుకోవడం సాధ్యం కాదు, ఎందుకంటే ఆ సమయంలో ఆతిథ్యం విషయంలో ఒక సాధారణ ప్రమాణం ఉంటుంది. అందువల్ల, ఈ విషయంలో చాలా శ్రద్ధ మరియు జాగ్రత్త అవసరం.

ఒక సహచరుడు (రజి) ఇలా తెలిపారు, "సుమారు 1902వ సంవత్సరంలో నేను ఎమినాబాద్ నుండి ఖాదియాన్‌కు ప్రయాణం చేపట్టాను. నేను ఖాదియాన్ వెళ్ళడానికి లాహోర్ స్టేషన్‌లో వేచి ఉన్నప్పుడు, అక్కడ నాకు ఒక స్నేహితుడు కలిశాడు, మరియు మేమిద్దరం ఖాదియాన్ వైపు బయలుదేరాము. మా మార్గమధ్యంలో భారీ వర్షం కురిసింది, మరియు మేము బటాలా చేరుకున్నప్పుడు వర్షం కుండపోతగా మారింది. మేము బటాలాలో దిగి, ఒక బండిని అద్దెకు తీసుకుని ఖాదియాన్ వైపు బయలుదేరాము. మేము ఖాదియాన్ సమీపానికి చేరుకున్నప్పుడు, వర్షం ఆగిపోయింది." మరల ఇలా తెలిపారు. "మేము ఖాదియాన్ చేరుకున్నాము, మరియు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఆదేశం మేరకు మా ఇద్దరికీ వెంటనే ఒక గది ఇవ్వబడింది, అది ఈ రోజుల్లో (వారు ఈ సంఘటనను వివరిస్తున్న సమయంలో) పుస్తకాల దుకాణంగా ఉపయోగపడుతుంది." మరల ఇలా తెలిపారు: "మరుసటి రోజు ఉదయం మాకు అద్భుతమైన అల్పాహారం అందించబడింది, ఆ మెనూ చాలా విస్తృతంగా (అనేక రకాల వంటకాలతో) ఉండేది.హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) గారు, తనతో పాటు వచ్చిన మరో అతిథి అయిన షా సాహిబ్‌కు ఏవైనా ఇబ్బందులు లేదా అసౌకర్యం కలిగితే తెలియ జేయమని పదే పదే అడిగేవారు. ఇతర అతిథులను కూడా హుజూర్ (అ) ఇదే విధంగా అడిగేవారు." ఈ విధంగా, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) గారు తమ అతిథులను అత్యున్నత స్థాయిలో గౌరవించేవారు.

(రివాయత్ అస్‌హాబే అహ్మద్, సంపుటి 2, పేజీ 155)

అదేవిధంగా, భేరాకు చెందిన మంజూర్ అహ్మద్ సాహిబ్ ఇలా రాశారు: "నా గౌరవనీయులైన తండ్రి చాలా కాలంగా అహ్మదీగా ఉండేవారు. ఆయన, ఆయన తల్లి 1894లో మొదటిసారిగా హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్ అవ్వల్ (రజి) గారిని కలవడానికి ఖాదియాన్ వెళ్లారు. అప్పుడే ఆయన తన తల్లితో కలిసి అహ్మదీయత్‌ను స్వీకరించారు." మరల ఇలా తెలిపారు: "నా తాతగారు చిన్నతనంలో మొదటి ఖలీఫా (రజి) గారికి విద్యాబోధన చేసేవారు, అలాగే నా తాతగారి మూడవ భార్య హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్ అవ్వల్ (రజి) గారికి దత్తత తీసుకున్న సోదరి (దత్త సోదరి) అవుతారు." మరల ఇలా తెలిపారు: "నేను మా గౌరవనీయ తండ్రిగారిని, వారు ఖాదియాన్‌కు వెళ్ళినప్పటి నుండి ఏదైనా సంఘటన గుర్తుందా అని అడిగాను. వారు ఇలా వివరించారు, 'ఒక రోజు, మాలో ఎనిమిది మందిమి హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) తో కలిసి భోజనం చేయడానికి ముబారక్ మసీదుకు వెళ్ళాము, అది ఆ సమయంలో దాని అసలు స్థితిలో ఉండేది. మేము మసీదులోనే భోజనం చేశాము. ఆ సమయంలో అది ఒక చిన్న మసీదు. అతిథులు కూర్చోవడానికి ఎక్కడా చోటు ఉండేది కాదు, అందువల్ల హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) వారిని మసీదులోనే కూర్చోబెట్టేవారు. ఒక వరుసలో ఎనిమిది నుండి పది మంది సరిపోయేవారు. హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్ అవ్వల్ (రజి) కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.'"మరల ఇలా తెలిపారు: "ఇంటి నుండి వండి తెచ్చిన రెండు రకాల కూరలు ఉండేవి. రెండింటిలోనూ మాంసం ఉండేది. అప్పుడప్పుడు, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) తన పళ్ళెంలోని కూర నుండి మాంసం ముక్కలను తీసి, ఇతరులు తింటున్న కూరలో వేస్తూ ఉండేవారు." హుజూర్ (అ) తన పళ్ళెంలో మాంసం ముక్కను చూసినప్పుడల్లా అలా చేసేవారు. 'దీనిని గమనించిన హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్ అవ్వల్ (రజి) అతిథుల కోసం అదే విధంగా చేసేవారు." కొన్నిసార్లు అతిథులు ఏదైనా కావాలని తమ కోరికను వ్యక్తపరిచేవారు. ఒకసారి, భోజనం చేస్తున్నప్పుడు ఒక అతిథి మామిడి పండ్లు తినాలని తన కోరికను వ్యక్తపరిచాడు. భోజనంతో పాటు మామిడి పండ్లు తినడం నిజంగా అతను ఆలోచించిన ఒక మంచి ఆలోచన అని హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) వ్యాఖ్యానించారు. అక్కడ కూర్చున్న వారిలో, అతిథులలో గానీ లేదా స్థానికులలో గానీ ఎవరో ఒకరు, తాను సంతకు వెళ్లి కొన్ని మామిడి పండ్లు తీసుకురావాలా అని అడిగారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) వద్దు అని చెప్పి, అతడిని అక్కడే కూర్చోమని చెప్పారు. కొద్దిసేపటి తర్వాత, ఎవరో పంపిన ఎనిమిది మామిడి పండ్లతో ఒక పొట్లం వచ్చింది. అక్కడ ఎనిమిది మంది పురుషులు ఉన్నారు, మరియు ఆ పొట్లంలో ఎనిమిది మామిడి పండ్లు ఉన్నాయి. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) వారిలో ప్రతి ఒక్కరికీ ఒక మామిడి పండు ఇచ్చారు. హుజూర్ (అ) తన మామిడి పండును తీసుకుని, దానిని ముక్కలుగా కోసి, ప్రజలకు పంచిపెడుతూ, వారికి ఆతిథ్యం ఇవ్వడం కొనసాగించారు.

(రివాయత్ అస్‌హాబే అహ్మద్, సంపుటి 2, పేజీలు 204-205)

అదేవిధంగా, మాలేర్‌కోట్లకు చెందిన హజ్రత్ బద్రుద్దీన్ సాహిబ్ ఇలా తెలిపారు: "ఒక రోజు, నేను నా తండ్రితో కలిసి బోర్డింగ్ (వసతి గృహం) వద్ద ఉన్న బావి నుండి నీళ్లు తోడుతున్నాను. అప్పుడు రాత్రి తొమ్మిది గంటల సమయం, 'ఇషా' నమాజ్ (రాత్రిపూట ప్రార్థన) అప్పటికే పూర్తయ్యింది. అప్పుడుహజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) గారు చేతిలో పాలు మరియు రొట్టె ఉన్న ఒక పాత్రను పట్టుకుని బావి దగ్గరకు వచ్చి, నా తండ్రితో 'అయ్యా, ఆకలితో ఉన్న అతిథి ఎవరైనా ఉన్నారా?' అని అడిగారు. దానికి నా తండ్రి, 'హుజూర్ !, మియాన్ నజ్ముద్దీన్ వెళ్లి కనుక్కున్నారు, అందరూ భోజనం చేసేశారు' అని సమాధానమిచ్చారు. అప్పుడు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) 'సరే, అయితే నాతో రండి' అని అన్నారు. దాంతో మేమిద్దరం వారితో కలిసి వెళ్లాము. అతిథి గృహానికి చేరుకుని అక్కడ అడిగి తెలుసుకోగా, ఆకలితో ఉన్నవారు ఎవరూ కనిపించలేదు, ఎందుకంటే వారందరూ అప్పటికే భోజనం చేసేశారు." మరల ఇలా తెలిపారు: "అక్కడ షేర్ ముహమ్మద్‌కు చెందిన ఒక దుకాణం అప్పటికి తెరిచి ఉంది, కాబట్టి మేము అక్కడికి వెళ్లాము. అక్కడ ఒక వ్యక్తి కనిపించగా అతను, 'హుజూర్, నాకు కొంచెం పాలు మరియు రొట్టె కావాలి' అని కోరాడు. అప్పుడు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) గారు ఆ పాత్రను అతనికి అందించారు."

(రివాయత్ అస్‌హాబే అహ్మద్, సంపుటి 3, పేజీ 285)

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ అతనికి హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) చేతుల మీదుగా ఆహారం అందించాలని సంకల్పించాడు, అలాగే అతనికి ఆ అవసరం కూడా ఉంది. అతిథులకు ఆహారం అందించేలా అల్లాహ్ హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) గారి హృదయంలో ప్రేరణ కలిగించాడు, దాంతో హుజూర్ (అ) ఆ అతిథికి సేవ చేయడానికి వెళ్లారు.

సాధారణ సమయాల్లో కూడా హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) చూపిన ఆతిథ్యానికి నిదర్శనంగా నిలిచే ఇలాంటి సంఘటనలు వారి జీవితంలో ఎన్నో ఉన్నాయి. అతిథులను గౌరవ మర్యాదలతో చూడటం, ఆకలితో ఉన్నవారికి మరియు అవసరంలో ఉన్నవారికి ఆహారం అందించడం వంటి అల్లాహ్ ఆదేశాలకు అనుగుణంగా హుజూర్ (అ) ఇలా వ్యవహరించేవారు. అదేవిధంగా, హజ్రత్ డాక్టర్ హష్మతుల్లా సాహిబ్ తన అనుభవాన్ని ఇలా వివరించారు:

"జల్సా (వార్షిక సమ్మేళనం) సందర్భంలో, జమాఅత్ కార్యదర్శిగా ఉన్నందున, ఒక రాత్రి నేను 'సదర్ అంజుమన్' సమావేశానికి హాజరు కావాల్సి వచ్చింది. జల్సా కార్యక్రమాలు మరియు మగ్రిబ్, ఇషా నమాజ్‌ల తర్వాత ఈ సమావేశం జరగాల్సి ఉంది." ఈ సమావేశం కేవలం జమాఅత్ బాధ్యుల కోసం మాత్రమే ఏర్పాటు చేయబడింది. మరల ఇలా తెలిపారు: "మగ్రిబ్ మరియు ఇషా నమాజ్‌ల తర్వాత ముబారక్ మసీదులో సమావేశం జరగాల్సి ఉంది. సమయం తక్కువగా ఉండటంతో, సమావేశం తర్వాత భోజనం చేయాలని అనుకున్నాను. నిజానికి అప్పటికే నాకు చాలా ఆకలిగా ఉంది, ఉదయం ఎనిమిది గంటల నుండి నేను ఏమీ తినలేదు. కానీ జమాఅత్ పట్ల నాకున్న బాధ్యత దృష్ట్యా, కాస్త ఆలస్యంగా తిందామని నిర్ణయించుకున్నాను." "సమావేశం ముగిసేసరికి చాలా ఆలస్యమైంది. రాత్రి 11 గంటల సమయంలో నేను 'లంగర్' (సామూహిక భోజనశాల) వద్దకు చేరుకున్నాను, అప్పటికి నాకు విపరీతమైన ఆకలిగా ఉంది. నేను నా జమాఅత్ సభ్యుల వద్దకు వెళ్లి భోజనం గురించి అడిగినప్పుడు, భోజనం అప్పటికే అయిపోయిందని తెలిసింది. ఒక మిత్రుడు వంటగది బల్ల నుండి ఒక రొట్టె ముక్కను తెచ్చి, లంగర్ మూసివేయబడినందున, ఆ రొట్టె ముక్కనే తిని ఆకలి తీర్చుకోమని నాకు ఇచ్చాడు.అప్పుడు నేను ఆ రొట్టెను తినడం ప్రారంభించాను. అది పూర్తిగా తినకముందే, మా గది తలుపుపై గట్టిగా తట్టిన శబ్దం వినిపించింది. ఎవరో గట్టిగా తడుతూ ఇలా అన్నారు: 'ఆకలితో ఉండి

ఇంకా భోజనం చేయని అతిథి ఎవరైనా ఉంటే, వారు భోజనం కోసం లంగర్‌కు వెళ్లాలి.' నా తోటివారు నన్ను వెళ్ళమని ప్రోత్సహించారు. లంగర్‌కు చేరుకున్నాక, అక్కడ లభించిన ఆహారాన్ని కృతజ్ఞతాభావంతో తిన్నాను. "మరుసటి రోజు ఉదయం 10 గంటలకు, ముబారక్ మసీదులోని చిన్న మెట్ల దారి ద్వారం వద్ద హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) నిలబడి ఉండటాన్ని నేను చూశాను; సందులో ఉన్న పనివారందరూ వారి వైపు ముఖం తిప్పి ఉండగా, హుజూర్ (అ) వారితో మాట్లాడుతుండేవారు. అక్కడ హజ్రత్ మౌల్వీ నూరొద్దీన్ (రజియల్లాహు అన్హు) కూడా ఉన్నారు. అతిథుల కోసం ఏర్పాటు చేసే భోజనం నాణ్యమైనదిగా ఉండాలని హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఎంతో ఆసక్తితో సూచిస్తున్నారు. ఎందుకంటే అంతకు ముందు రాత్రి, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వారికి ఈ క్రింది విధంగా తెలియజేశారు: **యా అయ్యుహన్నబియ్యూ అత్ఇముల్ జాఇఅ వల్ ము అతర్ర** అనగా "ఓ ప్రవక్తా! ఆకలితో ఉన్నవారికి మరియు దీనస్థితిలో ఉన్నవారికి ఆహారం పెట్టండి.' కాబట్టి, అర్ధరాత్రి వేళ తలుపు తట్టడం మరియు ఎవరో ఆహారాన్ని తీసుకురావడం వల్ల నేను నిద్రలేవడానికి గల కారణం ఆ దైవిక సందేశమేనని నాకు తెలిసింది. ఆ సందేశం ద్వారా సర్వశక్తిమంతుడైన అల్లాహ్ హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం)కు సమాచారం అందించారు, తత్ఫలితంగానే హుజూర్ (అ) ఆహారాన్ని పంపారు." **(రివాయత్ అస్‌హాబే అహ్మద్, సంపుటి 4, పేజీలు 155-156. తజ్కిరా, పేజీ 631 నుండి గ్రహించబడింది)**

వీరు అటువంటి ధర్మనిష్ఠ గల వ్యక్తులు, వారి ఆకలి బాధను సర్వశక్తిమంతుడైన అల్లాహ్ గమనించి, ఆ విషయాన్ని తన ప్రవక్తకు తెలియజేశాడు. ఆ సమయంలో, ఏర్పాట్లు చేయడానికి వారికి తగిన వనరులు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ, మన జల్సా (సమ్మేళనం) నిర్వాహకులు ఒక విషయాన్ని తప్పక గుర్తుంచుకోవాలి. దూర ప్రాంతాల నుండి ప్రయాణించి ఆలస్యంగా వచ్చే అతిథుల కోసం. ఉదాహరణకు ఐరోపా నుండి వచ్చేవారి ఫ్లెర్రీ లేదా విమానం ఆలస్యం కావడం, లేదా దారిలో ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడం వంటి కారణాల వల్ల ఆలస్యమయ్యే వారి కోసం ఆహార ఏర్పాట్లు ఉండాలి. అయితే, ఆహారం మంచి స్థితిలో ఉండేలా జాగ్రత్త వహించాలి. ఉష్ణోగ్రతల కారణంగా పాడైపోయిన ఆహారంను వడ్డించడం వల్ల ఎవరైనా అనారోగ్యానికి గురయ్యే పరిస్థితి రావచ్చును. కావున అలా చేయకూడదు. అతిథుల ఆతిథ్యం విషయంలో ఇలాంటి జాగ్రత్తలు కూడా తీసుకోవాలి. వారిని బాగా చూసుకోవాలి మరియు వారికి అత్యుత్తమ నాణ్యత గల ఆహారాన్ని అందించేలా చూడాలి.

ఒకసారి, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) అతిథులందరికీ ఒకే రకమైన ఆహారాన్ని అందించాలని అన్నారు. అంటే, జల్సాకు హాజరైన వారందరికీ ఎటువంటి వివక్ష లేకుండా ఒకే రకమైన ఆహారాన్ని వడ్డించాలి. దీనిపై ఖ్వాజా సాహెబ్ లేదా మరొకరు ఇలా అన్నారు: హాజరైన వారిలో కొందరు పేదవారు ఉన్నారు, వారు తమ ఇళ్లలో కనీసం పప్పు కూడా తినరు, కేవలం రొట్టె మరియు చట్నీతోనే సరిపెట్టుకుంటారు. కాబట్టి, జల్సాలో వారికి పప్పు వడ్డించడం ఏమాత్రం అనుచితం కాదు, వారికి మాంసం కూర వండాల్సిన అవసరం లేదు. వారికి పప్పు తినిపించడం వల్ల ఎటువంటి హానీ ఉండదు మరియు మాంసం కూర సిద్ధం చేయాల్సిన అవసరం లేదు. అప్పుడు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఇలా అన్నారు: "వారి ఇళ్లలో పప్పు లేకపోయినప్పటికీ, ఇతరులు మాంసం లేదా పులావ్ తినడం చూసినప్పుడు, వారు కూడా దానిని తినాలని కోరుకుంటారు; అది వారికి లభించనప్పుడు వారి మనోభావాలు దెబ్బతింటాయి." కొందరు అతిథులు ఒక పక్కన కూర్చుని మాంసం తింటుండగా, మరికొందరికి పప్పు (దాల్) తినమని చెప్పడం చూస్తే నిరాశ కలుగుతుంది. ఇలా జరగకూడదు. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఇలా అన్నారు: "పేదవారైనా లేదా ధనవంతులైనా, నా అనుచరులందరితోనూ నాకు ఒకే విధమైన అనుబంధం ఉంది."

(రివాయత్ అస్‌హాబే అహ్మద్, సంపుటి 4, పేజీ 65)

కాబట్టి, ఒకే రకమైన ఆహారాన్ని సిద్ధం చేయండి. ఒకవేళ మాంసం లేదా పులావ్ వండితే, అది అందరికీ వడ్డించాలి. ఒకవేళ పప్పు వండితే, అది కూడా అందరికీ వడ్డించాలి. ఒకవేళ తగిన వనరులు లేక పప్పు మాత్రమే వడ్డించాల్సి వస్తే, కొందరికి మాంసం మరియు మరికొందరికి పప్పు ఇవ్వడానికి బదులుగా, అందరికీ పప్పే వడ్డించాలి.

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం)వారి ప్రవర్తన, పద్ధతులు, ఉపదేశించే శైలి మరియు ఆతిథ్య విధానాలు ఇలాగే ఉండేవి.

హజ్రత్ చౌదరి అబ్దుర్ రహీమ్ సాహిబ్ కూడా ఇలాగే ఒక సంఘటనను వివరించారు: ఒక సందర్భంలో హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) నాకు ఐదు వందల రూపాయలు ఇచ్చి ఇలా అన్నారు: "జల్సా (సమ్మేళనం) ఏర్పాట్లు నీ చేతుల్లో ఉన్నాయి, కానీ ఒక విషయం గుర్తుంచుకో – అతిథులందరినీ ఒకేలా చూడాలి మరియు అందరికీ ఒకే రకమైన భోజనాన్ని సిద్ధం చేయాలి." సాధారణ పరిస్థితుల్లో రకరకాల వంటకాలు వండేవారు (నేను చెప్పినట్లుగా), కానీ ఆ రోజుల్లో మాత్రం ఒకే వంటకం సిద్ధం చేయాలని హుజూర్ (అ) చెప్పారు. కొందరు వ్యక్తులు హకీమ్ ఫజల్ దిన్ సాహిబ్ ఎక్కువ అనుభవం ఉన్నవారని, ఆ బాధ్యతను ఆయనకు అప్పగిస్తే బాగా నిర్వహిస్తారని సూచించారు. కానీ హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) దీనికి ఏమీ సమాధానం చెప్పకుండా, చౌదరి అబ్దుల్ రహీమ్ సాహిబ్‌నే ఏర్పాట్లు కొనసాగించమని చెప్పారు. ఆ సమయంలో ఖ్వాజా కమాలుద్దీన్ సాహిబ్ నా దగ్గరకు వచ్చి ఇలా అన్నారు: "నా కోసం అన్నం సిద్ధం చేయించండి, ఎందుకంటే హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఆహార బాధ్యతను మీకు అప్పగించారు కదా." అప్పుడు నేను ఆయనతో ఇలా అన్నాను: "అందరికీ ఒకే రకమైన భోజనం సిద్ధం చేయాలని హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) నాకు ఆదేశం ఇచ్చారు. కాబట్టి, మీరు అన్నం తినాలనుకుంటే, మీరు అనుమతి తీసుకోవాలి." దానికి ఖ్వాజా సాహిబ్ ఇలా బదులిచ్చారు: "అన్నం కోసం అనుమతి తీసుకోవడం అంటే ఏమిటి?" నేను ఇలా అన్నాను: "అయితే, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) అనుమతి లేకుండా నేను మీకు కనీసం ఒక బియ్యపు గింజను కూడా ఇవ్వలేను." దీనికి ఆయన ఎంతో అసంతృప్తి చెందారు. అంతేకాక, ఖ్వాజా సాహెబ్ అక్కడ ఉన్నంత కాలం తన పట్ల అసహనంతోనే ఉన్నారు.

(రివాయత్ అస్‌హాబే అహ్మద్, సంపుటి 2, పేజీ 333)

ఏది ఏమైనప్పటికీ, అతిథులు కూడా ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి: లంగర్ (సామూహిక భోజన) ఏర్పాట్ల కింద వడ్డించే ఆహారాన్ని సహనం మరియు కృతజ్ఞతా భావంతో స్వీకరించాలి. మీరు హజ్రత్ 'మసీహ్ మౌవూద్' (అలైహిస్సలాం) పిలుపు మేరకు ఇక్కడికి వచ్చారు మరియు ఆధ్యాత్మిక పోషణను పొందే ఉద్దేశంతో వచ్చారు కాబట్టి, మీ దృష్టి ప్రధానంగా ఆ ఆధ్యాత్మిక పోషణ వైపే ఉండాలి. ఒకవేళ ఆహారం విషయంలో ఏదైనా కొరత ఏర్పడితే, ఎటువంటి డిమాండ్లు చేయకుండా దానిని సంతోషంగా స్వీకరించాలి.

కొంతమంది, అతిగా డిమాండ్లు చేయకపోయినప్పటికీ, బయట ఉన్న దుకాణాల (బజార్) వద్దకు వెళ్లి తినడానికి ప్రయత్నిస్తుంటారు. దీనివల్ల ఆ దుకాణాలు అర్ధరాత్రి వరకు తెరిచి ఉంచాల్సి వస్తుంది, తద్వారా నిర్వాహకులకు ఇబ్బందులు కలుగుతాయి. ప్రస్తుత పరిస్థితులు, ముఖ్యంగా పొడి వాతావరణం దృష్ట్యా, అర్ధరాత్రి వేళ బయట వంట చేయడం ప్రమాదకరంగా మారవచ్చు. ఎందుకంటే ఆ సమయానికి కొన్ని పరిపాలనా విభాగాలు తమ పనిని ముగించి ఉంటాయి మరియు పూర్తి పర్యవేక్షణ అందుబాటులో ఉండదు. కాబట్టి అతిథులు ఈ విషయాన్ని గమనించాలి. ఈ మూడు రోజుల పాటు, ఆహారం పట్ల అసహనం వ్యక్తం చేయకుండా లేదా తినడానికి నిరాకరించకుండా, అందుబాటులో ఉన్న దానిని సహనం మరియు కృతజ్ఞతతో స్వీకరించాలి.

దీంతో పాటు, ఆహారాన్ని ఎప్పుడూ వృథా చేయకూడదని కూడా నేను చెప్పదలుచుకున్నాను. మీరు ఎంత తినగలరో అంతే తీసుకోవాలి. నేను చెప్పినట్లుగా, మనం జల్సాకు వచ్చిన అసలు ఉద్దేశ్యం ఆధ్యాత్మిక పోషణే. కాబట్టి మన దృష్టి ప్రధానంగా మన ఆధ్యాత్మిక జీవితాల మెరుగుదల వైపే ఉండాలి. అల్లాహ్ దయతో ఆహారం ఎలాగూ లభిస్తుంది. మూడు రోజుల పాటు, తక్కువ ఆహారం ఉన్నా, సాధారణ ఆహారం ఉన్నా లేదా పూర్తిగా తమ రుచికి తగ్గట్టుగా లేని ఆహారం ఉన్నా సరే, మనిషి సహనం మరియు కృతజ్ఞతా భావంతో దానిని చక్కగా స్వీకరించగలడు.

అదేవిధంగా, షేక్ జైనుల్ ఆబిదీన్ సాహెబ్ ఇలా తెలిపారు: 'హజ్రత్ మసీహ్ మౌవూద్' (అలైహిస్సలాం) కాలంలో అతిథులకు ఆహారం అందించడంలో ప్రత్యేక శ్రద్ధ వహించేవారు. సాధారణ పరిస్థితుల్లో కూడా హుజూర్ (అ) సందర్శకుల సౌకర్యం మరియు ఆతిథ్యం పట్ల ఎల్లప్పుడూ ప్రత్యేక శ్రద్ధ చూపే వారు. మరల ఇలా తెలిపారు: నా సోదరుడు హాఫిజ్ హమీద్ అలీ ఒక సంఘటనను వివరించారు. బహుశా అది 'జల్సా సలానా' సమయం కావచ్చు. అప్పుడు అన్నం కోసం నాలుగు పెద్ద పాత్రలు వండారు; ఆ రోజుల్లో నాలుగు పాత్రల వంటకం కూడా చాలా పెద్ద మొత్తంగా పరిగణించబడేది. వాటిలో రెండు పాత్రలు జర్దా (తీపి అన్నం వంటకం) మరియు రెండు పాత్రలు పులావ్ (అన్నం మరియు మాంసంతో కూడిన వంటకం)తో నిండి ఉన్నాయి. ఒక రోజు ఉదయాన్నే, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) వంట గదికి వెళ్లి, అన్నాన్ని పరిశీలించాలనే ఉద్దేశంతో వంటవాడిని మూత తీయమని చెప్పారు. మూత తీసినప్పుడు, దాని వాసన హుజూర్ (అ)కు సరిగ్గా అనిపించలేదు. దాని నుండి ఒక రకమైన కుళ్ళిన వాసన వస్తోంది. అప్పుడు హుజూర్ (అ) మిగిలిన పాత్రలను కూడా పరిశీలించి ఇలా అన్నారు: "తీపి అన్నం ఉన్న ఆ రెండు పాత్రలు తినడానికి పనికిరావు. వాటిని చెరువులో పారేయండి. అవి మనుషులు తినడానికి తగినవి కావు." అప్పుడు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఇలా అన్నారు: "ఆ వాసన నాకు నచ్చకపోతే మరియు రుచి కూడా బాగోలేదనిపిస్తే -- అంటే రుచి మరియు వాసన రెండూ భరించలేని విధంగా ఉంటే -- ఇక అతిథులకు అది ఎలా నచ్చుతుంది? నేను స్వయంగా తినని పదార్థాన్ని అతిథులకు పెట్టడం జరగకూడని పని. దాన్ని చెరువులో పారేసి ఆ వ్యవహారాన్ని ముగించండి. అక్కడ జంతువులు దాన్ని తింటాయి." **(రివాయత్ అస్‌హాబే అహ్మద్, సంపుటి 1, పేజీ 103)**

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఈ విషయంలో ఇంతటి శ్రద్ధ మరియు అప్రమత్తత తీసుకునేవారు. కాబట్టి, ఆహారాన్ని సిద్ధం చేసే బాధ్యత కలిగిన కార్యకర్తలు కూడా అంతే అప్రమత్తంగా ఉండాలి, ముఖ్యంగా వేసవి కాలం కాబట్టి

ఈ రోజుల్లో మరింత జాగ్రత్త అవసరం. నేను ఇంతకు ముందే చెప్పినట్లుగా, ఆహారాన్ని సరిగ్గా భద్రపరచాలి మరియు ఎక్కువ సేపు బయట ఉంచకూడదు. ముఖ్యంగా పప్పులు మరియు త్వరగా పాడైపోయే ఇతర వంటకాలను గంటల తరబడి ఉంచి, ఆ తర్వాత అతిథులకు వడ్డించకూడదు. ఈ విషయాన్ని గుర్తుంచుకోండి మరియు అతిథులకు వడ్డించే ముందు ఎల్లప్పుడూ ఆహారాన్ని క్షుణ్ణంగా పరిశీలించండి.

ఇతర విభాగాలన్నింటికీ కూడా ఇదే వర్తిస్తుంది. ప్రతి విభాగంలోని కార్యకర్తలు అతిథుల సౌకర్యం కోసం తమ శాయశక్తులా కృషి చేయాలి. అది బాత్రూమ్‌ల పరిశుభ్రత మరియు శుభ్రపరచడం కావచ్చు, ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్ లేదా భద్రత కావచ్చు. భద్రత అనేది అత్యవసరం, కానీ అది శ్రద్ధ, మర్యాద మరియు గౌరవంతో నిర్వహించబడాలి. అతిథికి అసౌకర్యం కలిగించేలా లేదా కఠినంగా మాట్లాడినట్లు అనిపించేలా ప్రవర్తించడం భద్రతా సిబ్బంది పని కాదు. మనం ఈ విషయాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి. అలాగే, 'జల్సా' ప్రాంగణం లోపల క్రమశిక్షణను నిర్వహించే బాధ్యత కలిగిన వారు, ముఖ్యంగా మహిళల విభాగంలో తమ వ్యవహారశైలిలో తగిన జాగ్రత్త మరియు సంయమనాన్ని పాటించాలి.

అదేవిధంగా, ఇక్కడ సమావేశమైన అతిథులను ఉద్దేశించి నేను కొన్ని విషయాలు చెప్పదలచుకున్నాను. ప్రయాణంలో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించి ఇక్కడికి చేరుకోవడంలో ఒక ప్రత్యేక ఉద్దేశ్యం ఉందని మనం గ్రహించాలి. నిజమే, పూర్వపు రోజులతో పోలిస్తే నేడు ప్రయాణ కష్టాలు తగ్గినప్పటికీ, ప్రయాణం అంటే ప్రయాణమే కదా. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) కోరికను గౌరవించి మరియు ఈ 'జల్సా' (సమ్మేళనం) యొక్క ఉద్దేశ్యాన్ని నెరవేర్చడానికే తాము ఇక్కడికి వచ్చామన్న విషయాన్ని వచ్చిన వారందరూ గుర్తుంచుకోవాలి.

ఈ మూడు రోజుల పాటు ఇక్కడ సమావేశమైనప్పుడు, జల్సా కార్యక్రమాలను శ్రద్ధగా వినాలని గుర్తుంచుకోండి. ఈ మూడు రోజులను వృథాగా కబుర్లు చెప్పుకుంటూనో లేదా అటూఇటూ తిరుగుతూనో గడపకూడదు. ఏదైనా కార్యక్రమం ప్రారంభమైనప్పుడు, వెంటనే ప్రధాన జల్సా ప్రాంగణంలోకి లేదా పురుషులు, స్త్రీలు, పిల్లలు మరియు అదనపు రద్దీ కోసం కేటాయించిన ప్రత్యేక ప్రాంతాలకు వచ్చి, అక్కడ కూర్చుని తగిన శ్రద్ధ మరియు గౌరవంతో వినాలి.

అదేవిధంగా, చిన్న పిల్లలు ఉన్న తల్లుల కోసం కేటాయించిన ప్రాంతంలో, ఆ తల్లులు తమ పిల్లలతో నిశ్శబ్దంగా కూర్చుని జల్సా కార్యక్రమాలను వినాలి. పిల్లల కోసం కేటాయించిన ప్రాంతంలో కూర్చున్నంత మాత్రాన తల్లులు తమలో తాము మాట్లాడుకోవడం మొదలుపెట్టకూడదు. పిల్లలను శాంతపరచడానికి లేదా వారిని ఏదైనా పనిలో నిమగ్నం చేయడానికి మాత్రమే మాట్లాడటానికి ప్రయత్నించాలి. చిన్న పిల్లలు ఏడుస్తుంటే, వారిని శాంతపరచడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలి. అయితే, తల్లులు తమలో తాము మాట్లాడుకోవడం వల్ల సాధారణ కోలాహలం ఏర్పడుతుంది. ఇలా జరగకూడదు, ఎందుకంటే ఇది చుట్టూ ఉన్న ఇతరులకు అంతరాయం కలిగిస్తుంది. పిల్లలు తక్కువగా అల్లరి చేస్తున్నప్పటికీ, తల్లులే తమలో తాము మాట్లాడుకోవడం వల్ల సమస్య వస్తోందన్న ఫిర్యాదులు కూడా అందుతున్నాయి. పిల్లల కోసం కేటాయించిన ప్రాంగణంలో ఉన్నందున మాట్లాడుకోవడం అనుమతించ బడుతుందని కొందరు భావిస్తుంటారు, కానీ అది సరైనది కాదు. చిన్న పిల్లలు లేనివారు జల్సా కార్యక్రమాలను సులభంగా వినడానికి మరియు తల్లులు కూడా సౌకర్యవంతంగా కూర్చుని వినడానికి వీలుగానే ఈ ప్రత్యేక ఏర్పాట్లు చేయబడ్డాయి. కాబట్టి, సాధ్యమైనంత తక్కువగా సంభాషించుటకు ప్రయత్నించండి.

అదేవిధంగా, జల్సా కార్యక్రమాలు జరుగుతున్నప్పుడు బజార్లు (అంగళ్ళు) మూసివేయబడినప్పటికీ, అవి తెరిచి ఉన్న సమయాల్లో కూడా అతిథులు క్రమశిక్షణను పాటించాలి, అప్రమత్తంగా ఉండాలి మరియు అక్కడి వాతావరణానికి భంగం కలిగించేలా ఏమీ జరగకుండా జాగ్రత్త వహించాలి. కొనుగోళ్లు ఓర్పుతో, సంయమనంతో చేయాలి. కొన్నిసార్లు ఒకే దుకాణం వద్ద పొడవైన క్యూలు ఉంటాయి, వేచి ఉండటం తప్పనిసరి అవుతుంది, అయినప్పటికీ ప్రజలు ఓర్పు, సంయమనం మరియు సహనం పాటించాలి. అప్పుడే మీరు జల్సా యొక్క అసలు ఉద్దేశ్యాన్ని నిజంగా నెరవేర్చినట్లు అవుతుంది. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) తాను చూడాలనుకున్న అహ్మదీయుల గురించి వివరిస్తూ ఇలా అన్నారు: "ధర్మాన్ని స్వీకరించి, సద్గుణాలను ఆచరించే వారిగా మారండి, ఎందుకంటే ధర్మనిష్టాపరత లేకుండా అల్లాహ్ సంతోషించడు."

(మల్ఫూజాత్, సంపుటి 6, పుటలు 298-299)

కాబట్టి, మీరు ఇక్కడ ఉండటంలోని మీ నిజమైన ఉద్దేశ్యం ఇదే అయి ఉండాలి. స్త్రీ పురుష భేదం లేకుండా, నిశ్శబ్దంగా కూర్చుని జల్సాను శ్రద్ధగా వినడం ద్వారా ధర్మనిష్టాపరతను సాధించగలం. ఈ ఉద్దేశ్యం నెరవేరినప్పుడు, జల్సాలో చెప్పే మాటల నుండి మరియు అది ఏ లక్ష్యంతో నిర్వహించబడుతుందో ఆ అసలు ఉద్దేశ్యం నుండి మీరు నిజమైన ప్రయోజనాన్ని పొందగలుగుతారు.

ఆ లక్ష్యాన్ని సాధించడానికి, ఇక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరూ ఒకరినొకరు ప్రేమతో, ఆప్యాయతతో కలుసుకోవాలి. సలాములు తెలుపుకోవడాన్ని అలవాటు చేసుకోండి. జల్సా యొక్క వాతావరణం మొత్తం అన్ని దిశల నుండి 'అస్సలాము అలైకుమ్' మీకు శాంతి కలుగుగాకా! అనే పలకరింపులతో నిండి ఉండాలి. కార్యక్రమాలు ముగిసిన తర్వాత మీరు ఒకరినొకరు కలుసుకున్నప్పుడు, ఆప్యాయతతో, ప్రేమతో కలవండి. ఎవరితోనైనా పాత మనస్పర్థలు ఉంటే, వాటిని పక్కన పెట్టండి. వాతావరణాన్ని పాడుచేసే ఎలాంటి చర్యకైనా దూరంగా ఉండేందుకు అన్ని విధాలా ప్రయత్నించండి.

కొంతమందికి సహనం తక్కువగా ఉంటుంది, మరియు ఇక్కడికి వచ్చే వారందరూ సహజంగా సమచిత్తంతో ఉండరు. సహనం, కొంతమందికి సంయమనం పాటించే సామర్థ్యం చాలా తక్కువగా ఉంటుంది. కానీ వారు ఈ రోజుల్లో, సత్కర్మల ద్వారా ఆ సహనాన్ని పెంపొందించుకోవడానికి కృషి చేయాలి, అల్లాహ్ అనుగ్రహాన్ని కోరాలి, వ్యక్తిగత మనస్పర్థలను పరిష్కరించుకోవాలి, లేదా కనీసం, వ్యక్తిగత మనస్పర్థలు ఈ వాతావరణంలో ఘర్షణకు మూలంగా గానీ లేదా పరిపాలనపై భారంగా గానీ మారకుండా చూసుకోవాలి. ఎల్లప్పుడూ గుర్తుంచుకోండి: మీరు ఒక ఉన్నతమైన ఉద్దేశ్యంతో ఇక్కడికి వచ్చారు, మరియు దానిని మీరు తప్పక నెరవేర్చాలి. ఆ ఉద్దేశ్యం నెరవేరకపోతే, మరేదీ ఏమాత్రం ఉపయోగపడదు.

ఇక్కడ నమాజ్‌లకు ఏర్పాట్లు చేయబడ్డాయి, కానీ జమాఅత్ ఏర్పాటు చేసిన వసతిలో ఎక్కువ కాలం బస చేసేవారు, జల్సా కార్యక్రమాల తర్వాత క్రమం తప్పకుండా నమాజ్‌లలో పాల్గొనాలి మరియు సాధ్యమైనంతవరకు సామూహికంగా (జమాఅత్‌తో) నమాజ్‌లు చేయడానికి ప్రయత్నించాలి. ఈ రోజుల్లో టెంట్లు లేదా షామియానాలలో బస చేసేవారు ఒక విషయం గుర్తుంచుకోవాలి. ఈ సమయంలో ఇక్కడ 'తహజ్జుద్' (అర్ధరాత్రి లేదా తెల్లవారుజామున చేసే స్వచ్ఛంద ప్రార్థన) కూడా నిర్వహించబడుతుంది. తహజ్జుద్ కోసం నిద్రలేపినప్పుడు, వారు తప్పక నిద్రలేవాలి. దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించండి. సాధారణ ప్రార్థనల విషయం ఎలాగూ ఉంది, కానీ ముఖ్యంగా తహజ్జుద్ కోసం మీరు ప్రయత్నించాలి, ఎందుకంటే మీరు ఇక్కడికి రావడానికి గల ప్రధాన ఉద్దేశ్యం ఇదే. దీనిని సాధించినప్పుడు, మీరు మీ జీవితాలను మరియు మీ తర్వాతి తరాల జీవితాలను సంస్కరించు కునేవారిగా మారుతారు.

వాహనాల పార్కింగ్‌కు సంబంధించిన విషయాలపై కూడా మీ దృష్టిని ఆకర్షించాలను కుంటున్నాను. వాహనాలను పార్క్ చేసేటప్పుడు నిర్వాహకుల సూచనలను పాటించండి. వాహన తనిఖీ కేంద్రాల వద్ద పొడవైన క్యూ ఉంటే, ఓపికగా మరియు ప్రశాంతంగా మీ వంతు కోసం వేచి ఉండండి, మీ వాహనాన్ని తనిఖీ చేయించుకుని, ఆపై ముందుకు సాగండి. తొందర పడకండి. అతిథులు ఆతిథ్యం ఇచ్చేవారికి లేదా నిర్వాహకులకు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తించకూడదు.

దేశంలోని ప్రస్తుత పరిస్థితులు మరియు ముస్లింల పట్ల కొంతమంది ముస్లిమేతరులలో అప్పుడప్పుడు కనిపించే శత్రుభావం లేదా అసహనాన్ని దృష్టిలో ఉంచుకుని, అతిథులు మరియు విధుల్లో ఉన్నవారు తమ పరిసరాలపై నిఘా ఉంచాలి. ఏదైనా వస్తువు లేదా ఎవరైనా అనుమానాస్పదంగా అనిపిస్తే, వెంటనే నిర్వాహకులను సంప్రదించండి. అలాగే జల్సాలో కూర్చున్నప్పుడు, ఒకరిపై ఒకరు నిఘా ఉంచండి.

ముఖ్యంగా ఈ రోజుల్లో, వాతావరణం చాలా పొడిగా ఉండటం వల్ల (నేను ఇంతకు ముందే చెప్పినట్లుగా), అగ్ని ప్రమాదాల ముప్పు కూడా ఉంది. మీ వ్యక్తిగత లేదా ఉమ్మడి వసతి గృహాలలో ఎలాంటి మంటను వెలిగించవద్దు, కనీసం అగ్గిపుల్ల కూడా గీయవద్దు. అవసరమైతే, నిర్వాహకులను సంప్రదించి, మంట వెలిగించడానికి సురక్షితమైన నిర్దేశిత ప్రాంతానికి వెళ్లండి. కానీ ఇతర ప్రదేశాలలో ఎలాంటి నిప్పురవ్వ కూడా పడకుండా చూసుకోండి మరియు చాలా జాగ్రత్తగా

అహ్మదీస్ బోధనలు

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు:
"ఒక సమాజానికి ప్రారంభములో నేను, అదే సమాజానికి చివరిలో ఈసా ఇబ్నే మరియం ఉన్నచో ఆ సమాజం ఎన్నడు నాశనం కాదు."
(కంజూలుల్ ఆమాల్, హర్ఫ్ అల్ ఖాఫ్, కితాబుల్ ఖియామతు, బాబ్ ఖరూజుల్ మహ్ది, 38671)

దుఆ ఆశించువారు: *Muhammad Nazeer Ahmad sb, warangal, (Telangana)*

అహ్మదీస్ బోధనలు

"ఒక మునల్మానుడి విశిష్ట లక్షణమేమనగా, తన మునల్మాను సోదరుడిని చూసినప్పుడు అతని కోసం దగ్గరిగా కూర్చోవలెను." అనగా అతనికి కూడ కూర్చోవడానికి చోటును ఇవ్వవలెను.
(మిష్కాతుల్ మసాబిహ్, కితాబుల్ అదబ్, బాబుల్‌ఖియామ్, ఫసలుస్సాలిస్)

దుఆ ఆశించువారు: *Muhammad Vazeer Ahmad sb*

ఉండండి, ఎందుకంటే దీనివల్ల తీవ్రమైన ప్రమాదం జరగవచ్చు.

నిన్న కార్యకర్తలతో చెప్పినట్లుగానే, పాత వాహనాలు ఉన్నవారు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. చాలా మంది అతిథుల వద్ద పాత కార్లు ఉంటాయి, వాటి ఇంజన్లు వేడెక్కవచ్చు. ఒకవేళ వాటిని గడ్డిపై పార్క్ చేస్తే, అగ్ని ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అలాగే, కొన్ని పాత వాహనాల నుండి ఆయిల్ లీక్ అయ్యే సమస్య కూడా ఉండవచ్చు. అటువంటి అతిథులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వాహనాన్ని పార్క్ చేసేటప్పుడు, ఆ సమస్య గురించి నిర్వాహకులకు తెలియజేయాలి, తద్వారా వారి వాహనాన్ని సురక్షితమైన ప్రదేశానికి మళ్లించే వీలుంటుంది.

మీరు పరిశుభ్రతను కూడా పాటించాలి. మరుగుదొడ్లు మరియు ఇతర సౌకర్యాలను శుభ్రంగా ఉంచడానికి నిర్వాహకులు తమ వంతు కృషి చేస్తున్నప్పటికీ, అతిథులు కూడా వాటిని ఉపయోగించిన తర్వాత శుభ్రంగా ఉంచాలి. నేలమీద నీరు పారేలా వదిలేయడం లేదా అస్తవ్యస్తంగా ఉంచడం వంటివి చేయకూడదు. 'శుభ్రత విశ్వాసంలో ఒక భాగం' అనే హదీసును అనుసరించి, అతిథులు పరిశుభ్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఎందుకంటే మన విశ్వాసాన్ని బలపరుచుకోవడానికే మనం ఇక్కడికి వచ్చాము. కాబట్టి, పరిశుభ్రతను విస్మరించకూడదు. ఈ రోజుల్లో, ఇక్కడ ఉన్న ప్రతి ఒక్కరూ తమను తాము ఒక సేవకునిగా భావించి, పరిసరాలు ఆరోగ్యకరంగా ఉండేలా పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

మీ విశ్వాస స్థాయిని పెంచుకోవడంపై దృష్టి సారించండి. ఈ రోజుల్లో, అల్లాహ్‌ను స్మరించడంపై ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వండి. ఖాళీ సమయాల్లో, మీరు ఎక్కడ కూర్చున్నా సరే, మీ దృష్టిని దరూద్ షరీఫ్ , దుఆలు (ప్రార్థనలు) మరియు క్షమాపణ కోరడం వైపు మళ్లించండి. అనవసరమైన సంభాషణలకు బదులుగా, అల్లాహ్‌ను స్మరించడంలో లేదా మతపరమైన చర్చలలో నిమగ్నమవ్వండి. ఈ రోజుల్లో అనేక ప్రదర్శనలు కూడా ఏర్పాటు చేయబడ్డాయి. మీరందరూ వాటిని సందర్శించి, ఆసక్తితో మరియు ఆలోచనాత్మక దృక్పథంతో వాటిని పరిశీలించాలి. ఈ ప్రదర్శనలు మీకు జ్ఞానం మరియు విశ్వాసం – రెండింటి పరంగానూ ప్రయోజనం చేకూరుస్తాయి. వీటన్నింటినీ పాటిస్తే, అల్లాహ్ అనుగ్రహంతో, మీరు ఈ జల్సా నుండి పూర్తి ప్రయోజనం పొందే వారిగా ఉంటారు.

అల్లాహ్ మీకు ఈ జల్సా నుండి ఆధ్యాత్మికంగా, విశ్వాసం పరంగా మరియు జ్ఞానం పరంగా అన్ని విధాలా ప్రయోజనం చేకూర్చుగాకా!. మరియు ఈ జల్సా యొక్క ఆశీర్వాదాలు మీ జీవితాల్లోనూ, మీ తదుపరి తరాల జీవితాల్లోనూ శాశ్వత భాగంగా ఉండుగాకా!. అలాగే, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఏ ఉద్దేశంతో పంపబడ్డారో, ఆ ఉద్దేశాన్ని నెరవేర్చే వారిలో మీరు ఉందురు గాకా!.

ఈ సాయంత్రం, ఇన్షా-అల్లాహ్, జల్సా అధికారికంగా ప్రారంభమవుతుంది. ప్రారంభ ప్రసంగాన్ని మరియు ఇతర వక్తలందరి ప్రసంగాలను పూర్తి శ్రద్ధతో, ఆలోచనాత్మకంగా వినండి. అలాగే, విన్న విషయాలను ఆచరణలో పెట్టడానికి శాయశక్తులా ప్రయత్నించండి. అల్లాహ్ అందరికీ అలా చేసే సామర్థ్యాన్ని ప్రసాదించుగాకా!.

(2వ పేజి తరువాత)

ఈ సంవత్సరం, ఎమ్‌టిఎ ఆఫ్రికా పది సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ పదేళ్లలో, ఏడు వేలకు పైగా కార్యక్రమాలు రూపొందించబడ్డాయి, వాటి ద్వారా వేలాది మంది ఇస్లాం అహ్మదీయత్‌లోకి ప్రవేశించారు. ఆఫ్రికాలో మన జమాఅత్‌కు 26 రేడియో స్టేషన్లు ఉన్నాయి.

యూకేలోని వాయిస్ ఆఫ్ ఇస్లాం రేడియో కూడా పదేళ్లు పూర్తి చేసుకుంది. ప్రస్తుతం, ఈ రేడియో ప్రసారం యూకేలోని 13 నగరాల్లో ప్రత్యక్ష ప్రసారం అవుతోంది. ఆన్‌లైన్ ప్రసారాలను ప్రపంచవ్యాప్తంగా కూడా వినవచ్చు.

ఇస్లాం వెబ్‌సైట్‌లో వాదీన్ సెర్చ్ ఇంజిన్ మరియు యాప్ ప్రారంభించబడ్డాయి. ఖురాన్ సెర్చ్ ఇంజిన్ కూడా మెరుగుపరచబడింది.

అల్ వసియ్యత్ మరియు బైఅత్ యొక్క పది షరతుల కోసం యాప్‌లు జోడించబడ్డాయి. 36 కొత్త ఆంగ్ల ఈ-పుస్తకాల చేరికతో, మొత్తం సంఖ్య 260కి చేరుకుంది. అల్ ఇస్లాం బృందం కూడా దాదాపు పూర్తిగా స్వచ్ఛంద సేవకులతోనే కూడి ఉంది మరియు గొప్పగా పని చేస్తోంది.

ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ అహ్మదీయ ఆర్కిటెక్ట్స్ అండ్ ఇంజనీర్స్ (ఐఏఏఏఈ) ఈ సంవత్సరం 65 కుళాయిలను ఏర్పాటు చేసింది, దీనివల్ల 2,00,000 మంది ప్రజలు లబ్ధి పొందారు. అదేవిధంగా, ఆదర్శ గ్రామాలు స్థాపించబడ్డాయి, సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయబడ్డాయి.

మజ్లిస్ నుస్రత్ జహాన్ ఆధ్వర్యంలో, ఆఫ్రికాలోని 54 దేశాలలో 41 క్లినిక్‌లు మరియు ఆసుపత్రులు స్థాపించబడ్డాయి. గత సంవత్సరం, ఐదు లక్షలకు పైగా రోగులకు చికిత్సా సౌకర్యాలు కల్పించబడ్డాయి. మన జమాఅత్‌కు చెందిన 620 ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలలు మరియు 80 సెకండరీ పాఠశాలలు 13 ఆఫ్రికన్ దేశాలలో విద్యా సేవలను అందిస్తున్నాయి.

హ్యూమానిటీ ఫస్ట్ మొత్తం 25 లక్షలకు పైగా ప్రజలకు సేవ చేయగలిగింది.

నూతన అహ్మదీయులతో సంబంధాలు:

ఈ సంవత్సరం 95 దేశాలలో 54,485 మంది దూరమైన నూతన అహ్మదీయులతో సంబంధాలు పునరుద్ధరించబడ్డాయి.

ఈ సంవత్సరం కొత్తగా జమాఅత్‌ను స్వీకరించిన వారి సంఖ్య 2,67,596. అల్హమ్దులిల్లాహ్, 132 దేశాలలోని 670కి పైగా జాతులు అహ్మదీయత్‌లో చేరాయి.

వాటిలో మొదటిది నైజీరియా. ఆ తర్వాత కాంగో బ్రజ్జావిల్లే. ఆ తర్వాత గనీ బసావు. ఆ తర్వాత కామెరూన్. గని కొనాక్రీ, లైబీరియా. కాంగో కిన్షాసా, గాంబియా, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్, సెనెగల్, సియెరలియోన్, టాంజానియా, ఐవరీ కోస్ట్, నైజీరియా, బెనిన్, టోగో, కెన్యా, ఘనా, ఉగాండా, మలావి, మాలి, బుర్కినా ఫాసో, మడగాస్కర్, చాడ్, జాంబియా, రువాండా, బురుండి, ఇథియోపియా మరియు సావోతోమ్ ఇందులో చేర్చబడ్డాయి. ఇతర ఆఫ్రికన్ దేశాలలో సోమాలియా మరియు జింబాబ్వే, మయోట్టే ఆయిలాండ్(ద్వీపం), ఈజిప్ట్, స్వాజిలాండ్, లెసోతో, అంగోలా, కేప్ వెర్డే, దక్షిణాఫ్రికా, నమీబియా మొదలైనవి ఉన్నాయి.

ఆసియాలో, ఇండోనేషియాలో అత్యధిక బైఅత్‌లు ఉన్నాయి. ఆ తర్వాత భారతదేశం, ఆ తర్వాత బంగ్లాదేశ్ మరియు ఫిలిప్పీన్స్ ఉన్నాయి. అదనంగా, మలేషియా, థాయిలాండ్, కజకిస్తాన్, శ్రీలంక, కంబోడియా, జపాన్, సింగపూర్ మొదలైనవి చేర్చబడ్డాయి.

యూరప్‌లో, జర్మనీ మొదటి స్థానంలో ఉంది, ఆ తర్వాత ఫ్రాన్స్, ఆ తర్వాత నెదర్లాండ్స్, బెల్జియం, స్పెయిన్, నార్వే, సెర్బియా ఉన్నాయి. ఇది కాకుండా, స్విట్జర్లాండ్, అల్బేనియా, ఆస్ట్రియా, ఫిన్లాండ్, రష్యా, చెక్ రిపబ్లిక్ మరియు మాల్టా మొదలైన దేశాలలో కూడా కొద్ది సంఖ్యలో బైఅత్‌లు జరిగాయి.

అమెరికన్ కూటమిలో, కెనడాలో అత్యధికంగా బైఅత్ చేయబడ్డాయి. దాని తర్వాత యునైటెడ్ స్టేట్స్. పరాగ్వే, మెక్సికో, బెలిజ్, హైతీ, గయానా, ప్యూర్టో రికో, బ్రెజిల్, ఎల్ సాల్వడార్, సురినామ్, పనామా, చిలీ, వెనిజులా మొదలైన దేశాలు కూడా ఇందులో ఉన్నాయి.

ఆస్ట్రేలియా ఖండంలో, ఆస్ట్రేలియా మొదటి స్థానంలో ఉంది, ఆ తర్వాత ఫిజీ, తర్వాత న్యూజిలాండ్, సోలమన్ దీవులు మొదలైనవి ఉన్నాయి.

అరబ్ దేశాలలో కూడా బైఅత్‌లు జరిగాయి.

బైఅత్‌కు సంబంధించి కొన్ని సంఘటనలు ఉన్నాయని, ఈ సంఘటనలు ప్రజలకు మరింత ఆసక్తిని కలిగిస్తాయని, కాబట్టి నేను కొన్ని సంఘటనలను వివరిస్తానని హజ్రత్ అన్వర్ తెలిపారు. **(తదుపరి సంచికలో)**

ప్రపంచ అహ్మదీయ్య జమాఅత్ సభ్యులకు ఒక ముఖ్య ప్రకటన:

మన ప్రియతమ ఖలీఫా, అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారి శుభప్రదమైన సూచన మేరకు తమను తాము ఆధ్యాత్మికపరమైన పటిష్టమైన కోటలో చేర్చుకొనుటకు ఈ రోజు మీరు ఈ క్రింది దుఆలను పఠించారా?.

(1) سُبْحَانَ اللّٰهِ وَبِحَمْدِهٖ سُبْحَانَ اللّٰهِ الْعَظِيْمِ اَللّٰهُمَّ صَلِّ عَلٰى مُحَمَّدٍ وَّاٰلِ مُحَمَّدٍ

సుబ్‌హానల్లాహి వబిహమ్‌దిహీ సుబ్‌హానల్లాహిల్ అజీమ్ అల్లాహుమ్మ సల్లెఅలా ముహమ్మదిన్ వ్వ అలే ముహమ్మద్. (200 సార్లు పఠించవలెను)

(2) اَسْتَغْفِرُ اللّٰهَ رَبِّيْ مِنْ كُلِّ ذَنْبٍ وَّاَتُوْبُ اِلَيْهِ

అస్తఘ్‌ఫిరుల్లాహ రబ్బి మిన్‌కుల్లి జన్‌బిన్ వ్వఅతూబు ఇలైహి.

100 సార్లు పఠించవలెను.

(3) رَبِّ كُلُّ شَيْءٍ خَادِمُكَ رَبِّ فَاحْفَظْنِيْ وَانْصُرْنِيْ وَارْحَمْنِيْ

రబ్బికుల్లి షైయిన్ ఖాదిముక రబ్బి ఫాహ్‌ఫజ్‌నీ వన్‌సుర్‌నీ వర్‌హమ్‌నీ.

100 సార్లు పఠించవలెను.

(25 సం॥పైబడిన వారు పైన పేర్కొనబడినట్లుగా పఠించవలెను. 15 నుండి 25 సం॥ల వారు 100సార్లు, 15సం॥ల కంటే తక్కువ వయస్సు గలవారు 33 సార్లు, చిన్న పిల్లల తరుపున వారి తల్లిదండ్రులు 3నుండి 4 సార్లు పఠిస్తూ, పిల్లలతో కూడ పఠింపజేయవలెను.)

వర్తమాన ఖలీఫా వాఖ్యములు

"అల్లాహ్ మరియు అతని ప్రవక్త పట్ల సంపూర్ణ ప్రేమాభిమానాలు లేనంత వరకు ప్రాపంచిక ప్రేమ తగ్గదు, అదే విధముగా మరణించు సమయంలో మానవునికి మనశ్శాంతి లభించదు, మరణ సమయంలో కల్గె ఆందోళన కూడ దూరం కాదు. "

(జుమా ప్రసంగం 14 సెప్టెంబర్ 2018)

దుఆ ఆశించువారు: *Darga sb, jamat AhmadiyyaVizag (A.P)*



జుమా ప్రసంగము

కార్యకర్తల ప్రభావం అహ్మదీయేతర అతిథులపై పడుతుంది, వారికి జమాఅత్ మరియు ఇస్లాం రెండింటి యొక్క నిజ స్వరూపాన్ని చూపిస్తుంది, వారు ఎంతగానో ప్రభావితులైపోతారు. వారు లెక్కలేనన్ని భావాలను పంపుతారు మరియు తమ కృతజ్ఞతను కూడా వ్యక్తపరుస్తారు.

అతిథుల సంరక్షణ చూసుకునే అహ్మదీ వాలంటీర్లు మరియు కార్యకర్తలు, ప్రజల విశ్వాసాన్ని బలపరిచే సాధనాలుగా కూడా మారుతారు.

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఈ ప్రజలకు మార్గదర్శకత్వం వహించి, వారిని సత్య ఇస్లాం అయిన అహ్మదీయత్ వైపు మొగ్గు చూపేలా చేయుగాకా!. అలాగే ఈ జల్సా యొక్క శుభప్రదమైన ప్రభావాలు జమాఅత్‌లోని సభ్యులందరిపై శాశ్వతంగా నిలిచి ఉండేలా ఆయన చూసుగాకా!. ఆమీన్.

సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 31 జులై 2026 (31 వఫా 1404 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهُ لَا شَرِيكَ لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُولُهُ

أَمَّا بَعْدُ فَأَعُوذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيمِ- بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيمِ-

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ○

اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ ۙ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ దయవల్ల, మూడు రోజుల జల్సా సలానా యూకే గత ఆదివారం విజయవంతంగా ముగిసి, అల్లాహ్ ఆశీస్సులను పొందింది. జల్సాకు సన్నాహాలు జరగడానికి నెలల సమయం పడుతుంది. నిజానికి, జల్సా ముగిసిన వెంటనే అవి ప్రారంభమవుతాయి. జల్సాకు కొన్ని వారాల ముందు నుంచే సన్నాహాల తీవ్రత పెరుగుతుంది, మరియు జల్సాకు ఒకటి లేదా రెండు వారాల ముందు అది తీవ్రస్థాయికి చేరుకుంటుంది. జల్సా జరిగే రోజులలో, వేలాది మంది స్వచ్ఛంద సేవకులు, బాలికలు, మహిళలు, పిల్లలు, పురుషులు, పెద్దలు మరియు యువకులు తమ శాయశక్తులా, అత్యంత చిత్తశుద్ధితో అవిశ్రాంతంగా సేవ చేస్తారు. వారు అహ్మదీ అతిథులకు సౌకర్యాన్ని కల్పించడమే కాకుండా, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న దేశాల నుండి హాజరయ్యే అహ్మదీయేతర మరియు ముస్లిమేతర అతిథుల అవసరాలను కూడా తీరుస్తూ, ఇస్లాం యొక్క నిజ స్వరూపాన్ని ప్రదర్శిస్తారు. అలా చేయడం ద్వారా, వారు ఒకరకమైన నిశ్శబ్ద ప్రచారంలో నిమగ్నమవుతారు. అందువల్ల, జల్సాలోని ఏ విభాగంలోనైనా సేవ చేసే ప్రతి స్వచ్ఛంద సేవకుడు మన కృతజ్ఞతకు అర్హులు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వారి సేవకు ఉత్తమ ప్రతిఫలాన్ని ప్రసాదించుగాకా!.

అదేవిధంగా, జల్సాలో నేరుగా సేవ చేసిన వాలంటీర్లతో పాటు, ఎంటిఏ కార్యకర్తలు కూడా ఉన్నారు, వీరిలో చాలామంది వాలంటీర్లే. జల్సా కార్యక్రమాలను ప్రపంచంలోని ప్రతి మూలకు అత్యద్భుతంగా ప్రసారం చేయడానికి వారు సాధ్యమైన అన్ని ప్రయత్నాలు చేసినందున, వారు కూడా మన కృతజ్ఞతకు అర్హులు. ఇది కూడా తబ్లీగ్ (ఇస్లాం సందేశాన్ని వ్యాప్తి చేయడం) కు ఒక శక్తివంతమైన సాధనం.

అదేవిధంగా, జల్సా గురించిన వార్తలను వ్యాప్తి చేయడంలో పత్రికా మరియు మీడియా విభాగాలు తమ పాత్రను పోషించాయి. ఇందులో సెంట్రల్ ప్రెస్ డిపార్ట్‌మెంట్ మరియు యూకే ప్రెస్ డిపార్ట్‌మెంట్ రెండూ ఉన్నాయి. ఇది లక్షలాది మంది ప్రజలకు చేరగలిగింది. దీనికి స్త్రీపురుషులు అనే తేడా లేకుండా అందరూ సహకరించారు.

గత సంవత్సరాల మాదిరిగానే, కెనడాలోని మజ్లిస్ ఖుద్దమ్-ఉల్-అహ్మదీయ్యా నుండి చాలా మంది వాలంటీర్లు కార్యకర్తలకు సహాయం చేయడానికి వచ్చారు, వారు జల్సా ముగిసిన తర్వాత ప్రాంగణాలన్నింటిని విప్పివేయడానికి, ఆ ప్రాంతాలను ఖాళిచేసి, యధావిధిగా మార్చడానికి సహాయపడ్డారు. ఇప్పుడు, ఆస్ట్రేలియా నుండి కూడా వాలంటీర్లు రావడం ప్రారంభించారు. వారు ఎంతో శ్రద్ధతో పనిచేస్తున్నారు, మరియు వారు కూడా మన కృతజ్ఞతకు అర్హులు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వారికి కూడా ప్రతిఫలం ఇచ్చుగాకా!.

కార్యకర్తల ప్రభావం అహ్మదీయేతర అతిథులపై పడుతుంది, వారికి జమాఅత్ మరియు ఇస్లాం రెండింటి యొక్క నిజ స్వరూపాన్ని చూపిస్తుంది, వారు ఎంతగానో ప్రభావితులైపోతారు. వారు లెక్కలేనన్ని భావాలను పంపుతారు మరియు తమ కృతజ్ఞతను కూడా వ్యక్తపరుస్తారు. ప్రస్తుతం, నేను ఎంచుకున్న వాటి నుండి ఆ భావాలలో కొన్నింటిని ప్రస్తావిస్తున్నాను. వాటన్నింటినీ ప్రస్తావించడం సాధ్యం కాకపోవచ్చు. అయినప్పటికీ, నేను కనీసం వాటిలో కొన్నింటినైనా ప్రస్తావించుతాను.

అదేవిధంగా, ఇంతటి నిస్వార్థ సేవను అందించిన పురుష మరియు మహిళా వాలంటీర్లందరికీ కూడా నేను వ్యక్తిగతంగా నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేయాలను కుంటున్నాను. అదే సమయంలో, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వారి అతిథులకు సేవ చేసే అవకాశం మరియు సామర్థ్యాన్ని వారందరికీ ప్రసాదించినందుకు, వారు కూడా సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు కృతజ్ఞతతో ఉండాలని గుర్తుంచుకోవాలి. ఇతరుల నుండి మీరు పొందే కృతజ్ఞతా భావాలు మిమ్మల్ని మరింత వినయ వంతులుగా, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ముందు మరింతగా విధేయులుగా ఉండేలా మరియు ఆయనకు కృతజ్ఞతతో ఉండేలా చేయాలి. అలా చేయడానికి సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మీకు శక్తిని ప్రసాదించుగాకా!.

నేను చెప్పినట్లుగా, అతిథులు పంచుకున్న కొన్ని అభిప్రాయాలను నేను ప్రస్తావించుతాను. ప్రస్తుతం నా ముందు ఉన్న వారిలో మొదటి వ్యక్తి, గాంబియా కమ్యూనికేషన్స్ మరియు డిజిటల్ ఎకానమీ మంత్రి అయిన శ్రీ లామిన్ జాబ్బి సాహిబ్ గారిది. ఆయన ఇలా తెలిపారు:

"జల్సా సాలానాను చూసిన తర్వాత, నా కళ్లెదుట ఉన్న గంభీరమైన వాస్తవికతకు నేను ఎంతగానో ఆశ్చర్యపోయాను. ఇది నిస్వార్థ సేవ మరియు నిశ్శబ్దమైన, స్థిరమైన త్యాగం అనే స్ఫూర్తిపై ఆధారపడిన ఒక గొప్ప ప్రపంచ కార్యక్రమం. ఇంత పెద్ద సమావేశం ఖాదియాన్‌లో కేవలం 75 మందితో ప్రారంభమైందని, మరియు దాని నిర్వహణ పరంగా ఇది ఒక అద్భుతమైన ఘనకార్యంగా రూపుదిద్దుకుందని తెలుసుకోవడం చాలా హృదయస్పర్శిగా ఉంది. దీనిని ప్రపంచవ్యాప్తంగా 200 దేశాలకు శాటిలైట్ ద్వారా ప్రసారం చేస్తున్నారు. ఏర్పాట్ల కోసం పోలీసుల అవసరం లేదనే విషయం కూడా నన్ను ఆశ్చర్యపరిచింది. ఇందులో ఎలాంటి భౌతిక ఆకాంక్ష లేదు. "కార్పొరేట్ అధికారులు, వైద్యులు మరియు యువకులు తమ ప్రాపంచిక పదవులను పక్కనపెట్టి, స్వచ్ఛందంగా నేలను శుభ్రం చేశారు, నిప్పుల మీద వంటలు వండారు మరియు ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఆ తర్వాత, ప్రార్థనకు పిలుపునివ్వగానే, వివిధ దేశాలకు చెందిన ప్రజలతో నిండిన ఆ ఉత్సాహ భరితమైన సమూహం వెంటనే సంపూర్ణ నిశ్శబ్దంలోకి జారిపోయింది. ఎంతగా అంటే, సూది పడితే వినిపించే శబ్దం కూడా వినపడనంతగా. ఇంతటి అపారమైన క్రమశిక్షణ, ఆధ్యాత్మికతతో కూడిన ఈ సజీవ వాస్తవికతను నేటి భౌతిక వాద ప్రపంచంలో చూడటం చాలా అరుదు."

ఆయన మరల ఇలా తెలిపారు, "తీవ్రమైన భావోద్వేగాలతో నిండిన వేలాది మంది ప్రజలు ఒక గొలుసులా ఏర్పడి తమ ఇమామ్‌తో అనుసంధానమైన అంతర్జాతీయ బైఅత్‌లో పాల్గొనడం, ఇంతటి విశిష్టమైన బంధాన్ని ఒక నమ్మశక్యం కాని వాస్తవికతగా మార్చింది. "జమాత్ యొక్క గొప్ప ప్రపంచ వ్యాప్త ప్రభావం భౌతిక సంపద వల్ల గానీ లేదా ఏవైనా రాజకీయ కారణాల వల్ల గానీ కలిగింది కాదు అనేది నాపై చెరగని ముద్ర వేసింది. దానికి బదులుగా, అది పరిపూర్ణమైన ధర్మం పట్ల నిబద్ధతకు మరియు శాంతికి సంబంధించిన నిష్కపటమైన, ఆచరణాత్మక సందేశానికి ఫలమే."

నైజీరియా నుండి, ఒక రాష్ట్రంలో దాదాపు సగం భాగాన్ని పరిపాలించే ఔబా కెహిండే బాడెవోలే అనే రాజు ఇలా అన్నారు: "నేను జల్సా సాలానా యూకేలో పాల్గొనడానికి బయలుదేరినప్పుడు, నా జీవితంపై ఇంత గాఢమైన ముద్ర వేసే ఇంతటి అద్భుతమైన, వ్యవస్థీకృతమైన మరియు ఆధ్యాత్మిక సమావేశంలో నేను భాగం కాబోతున్నానని నాకు అస్సలు తెలియదు. "ఇక్కడికి వచ్చిన తర్వాత, నేను క్రమశిక్షణ, సోదరభావం మరియు మానవ సేవకు ఒక అసాధారణమైన ఉదాహరణను చూడటమే కాకుండా, ప్రేమ, గౌరవం మరియు సోదరభావంతో ఏకమైన వివిధ దేశాలు మరియు జాతీయతలకు చెందిన ప్రజలను కూడా చూశాను. వారు మాకు అసాధారణమైన హృదయపూర్వక ఆతిథ్యం ఇచ్చారు, అది మా జ్ఞాపకాలలో ఎప్పటికీ ఒక మధురమైన భాగంగా నిలిచిపోతుంది. "ఇక్కడ నాకు చాలా విషయాలు నేర్చుకునే అవకాశం లభించింది, కానీ అత్యంత చిరస్మరణీయమైన క్షణం జమాఅత్ ఇమామ్‌ను కలవడం మరియు వారి ప్రసంగాలను వినడం. వాటి నుండి నేను ఎన్నో పాఠాలు నేర్చుకున్నాను. అహ్మదీయ ముస్లిం జమాఅత్ ప్రపంచ వ్యాప్తంగా సాధిస్తున్న పురోగతి గురించి కూడా నేను ఒక నివేదిక విన్నాను, అది నిజంగా ఆశ్చర్యపరిచింది."

మరల ఇలా అన్నారు: "మీ నినాదం, 'అందరిని ప్రేమించుము – ఎవ్వరిని ద్వేషించకుము' కేవలం ఒక నినాదం మాత్రమే కాదు. అది అహ్మదీయ ముస్లిం జమాఅత్ యొక్క ఆచరణాత్మక గుర్తింపు. ప్రపంచం ఈ ప్రేమ, సహనం మరియు మానవత్వం పట్ల గౌరవం అనే స్ఫూర్తిని అలవర్చుకుంటే, నిస్సందేహంగా ప్రపంచం శాంతికి నిలయంగా మారగలదు." మరల ఇలా అన్నారు: "ప్రపంచ వ్యాప్తంగా వివిధ భాషలలో ప్రసారమవుతున్న ప్రత్యక్ష కార్యక్రమాలు కూడా నన్ను ఎంతగానో ఆశ్చర్యపరిచాయి."

అదే విధముగా యువరాణి అయిన ఆయన భార్య కూడా ఇలాంటి భావాలనే వ్యక్తం చేశారు. ఆమె ఇలా అన్నారు: "నన్ను అత్యంత ఆశ్చర్యపరిచి, సంతోషపరిచిన విషయాలు ఏమిటంటే, మహిళల కోసం చేసిన అద్భుతమైన ఏర్పాట్లు మరియు వారికి కల్పించిన గౌరవం, స్వేచ్ఛ, హుందా అయిన వాతావరణం. వేలాది మంది మహిళలు ఇంత క్రమబద్ధంగా రావడం, వెళ్లడం మరియు పూర్తి హుందాతో జల్సాలో పాల్గొనడం చూడటం, ఇస్లాం పట్ల నాకున్న అనేక అభిప్రాయాలను మార్చింది. "అహ్మదీయ ముస్లిం జమాఅత్, ఇస్లామిక్ బోధనలకు అనుగుణంగా మరియు ఆచరణాత్మక రూపంలో, మహిళలకు ఇవ్వాల్సిన గౌరవాన్ని మరియు వారి హక్కులను కల్పించదని నేను భావించాను."

సెనెగల్ నుండి ఒక అతిథి వచ్చారు, ఆయన సెయింట్-లూయిస్ మాజీ గవర్నర్ అయిన శ్రీ అలియోన్ బదారా సాంబ్. ఆయన ఇలా తెలిపారు: "నన్ను ఎక్కువగా ఆకట్టుకున్న విషయం ఏమిటంటే, అద్భుతమైన నిర్వహణ. పాల్గొన్న వారి సంఖ్య చాలా ఎక్కువగా ఉన్నప్పటికీ, జల్సాను అత్యంత సమర్థవంతంగా నిర్వహించారని స్పష్టంగా తెలుస్తోంది. రవాణా వ్యవస్థ కూడా అద్భుతంగా ఉంది. స్వచ్ఛంద సేవకులు మర్యాదగా ఉన్నారు మరియు ఎల్లప్పుడూ అందుబాటులో ఉన్నారు. నేను అన్ని ప్రసంగాలను శ్రద్ధగా విన్నాను." ఇప్పుడు అహ్మదీయేతర అతిథులు కూడా ప్రసంగాలను కేవలం కూర్చుని వినడమే కాకుండా, వాటిని శ్రద్ధగా విన్నామని చెబుతున్నారు. "వివిధ భాషల కోసం చేసిన ఏర్పాట్లు కూడా అద్భుతంగా ఉన్నాయి, దీనివల్ల మేము అన్ని ప్రసంగాలను, సందేశాలను స్పష్టంగా అర్థం చేసుకోగలిగాము. జల్సా అంతటా పదేపదే, ముఖ్యముగా కనిపించిన సందేశం ప్రేమ, శాంతి మరియు సోదరభావం."

అదేవిధంగా, లక్సెంబర్గ్‌కు చెందిన న్యాయవాది మరియు బారిస్టర్ అయిన శ్రీ రాడు దుతా, తన కుమారుడితో కలిసి మొదటిసారిగా జల్సాకు హాజరయ్యారు. ఆయన ఇలా తెలిపారు: "జల్సా జరిగిన ఆ మూడు రోజులు నా జీవితంలో అత్యంత ముఖ్యమైన రోజులుగా నిలిచాయి. ఇంత పెద్ద, వ్యవస్థీకృతమైన మరియు గౌరవ ప్రదమైన ఇస్లామిక్ సమావేశాన్ని నేను మొదటిసారిగా చూశాను. ఇంత భారీ సంఖ్యలో ప్రజలు ఉన్నప్పటికీ, ఈ కార్యక్రమం మొత్తాన్ని వాలంటీర్లు అత్యంత సమర్థవంతంగా నిర్వహించారు. "వివిధ దేశాల నుండి వచ్చిన ప్రజలందరూ ఒకే కుటుంబ సభ్యుల్లా నాకు అనిపించింది. ప్రతి వాలంటీర్ చిరునవ్వుతో అతిథులకు సేవ చేయడంలో నిమగ్నమై ఉన్నారు. విధుల్లో ఉన్న ప్రతి కార్యకర్త, అక్కడున్న ప్రతి అతిథిని అత్యంత ముఖ్యమైన మరియు గౌరవనీయమైన వ్యక్తిగా భావించి, ఎంతో ప్రేమ, గౌరవం మరియు శ్రద్ధతో చూసుకున్నారు." ప్రపంచ వ్యాప్త 'బైఅత్' కార్యక్రమాన్ని వీక్షించడం సాధారణంగా అతిథులపై గాఢమైన ప్రభావాన్ని చూపుతుంది." మరల ఇలా తెలిపారు: "అంతర్జాతీయ బైఅత్ దృశ్యం నాకు ఎంతో హృదయానికి హత్తుకునేలా మరియు చిరస్మరణీయంగా నిలిచిపోయింది. వివిధ దేశాల నుండి వచ్చిన వేలాది మంది ప్రజలు ఒకే ఇమామ్ చేతిలో బైఅత్ చేయడం, సర్వశక్తి మంతుడైన అల్లాహ్ ముందు అత్యంత వినమ్రతతో ప్రార్థించడం చూడటం అనేది నా హృదయంపై చెరగని ముద్ర వేసిన, విశ్వాసాన్ని పెంపొందించే ఒక ఆధ్యాత్మిక అనుభవం." మరల ఇలా తెలిపారు: "నాకు జమాఅత్ ఇమామ్‌ను కలిసే అవకాశం కూడా లభించింది. మొదట్లో నేను కాస్త ఆందోళన చెందాను, కానీ వారిని కలిసిన తర్వాత ఆ ఆందోళన తొలగిపోయింది. నా మనసులో కొన్ని ఆలోచనలు, భావనలు ఉండేవి, వాటి గురించి వారిని అడగాలనుకున్నాను. అయితే నేను అడగకముందే, వారే స్వయంగా ఆ విషయాలను ప్రస్తావించి నాకు వివరించారు."

ఇస్లాంను కొత్తగా స్వీకరించిన ఎలిజా గబోరెల్ అనే వ్యక్తి కూడా ఇలా తెలిపారు: "ఇస్లాంను స్వీకరించడానికి ముందు నేను క్రైస్తవుడిని. విశ్వాసం అనేది సంగీతంతో ముడిపడి ఉంటుందని మాకు ఎప్పుడూ బోధించేవారు (నేడు ప్రపంచంలో సంగీతం అత్యవసరం అనే భావన విస్తృతంగా వ్యాపించింది), కానీ ఆ విధానం ద్వారా నేను ఎప్పుడూ నిజమైన ఆధ్యాత్మిక శాంతిని లేదా దేవుని సామీప్యాన్ని పొందలేక పోయాను. ముస్లిం అయిన తర్వాత కూడా నేను ప్రార్థనలు చేసేవాడిని, కానీ హృదయాంతరాల నుండి కన్నీళ్లతో వేడుకునే స్థితి నాకు ఎప్పుడూ కలగలేదు. కానీ 'జల్సా సాలానా'లో బైఅత్ చేసే అవకాశం వచ్చినప్పుడు, మాటల్లో చెప్పలేని ఒక ఆధ్యాత్మిక స్థితి నాలో ఆవరించింది. నా పాపాల పట్ల పశ్చాత్తాపంతో, విరామం లేకుండా క్షమాపణ కోరుతూనే ఉన్నాను. నేను ప్రార్థనలు చేస్తూనే ఉన్నాను, నా కళ్ళ నుండి కన్నీళ్లు అదుపు లేకుండా ప్రవహించాయి. ఖిలాఫత్‌తో ఒక ఆధ్యాత్మిక అనుబంధం ఏర్పడింది, అలాగే సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌తో కూడా ఆధ్యాత్మిక అనుబంధం ఏర్పడింది. ఆ తర్వాత నమాజ్ సమయం వచ్చింది, ఆ నమాజ్ మొత్తం అట్టి ఆధ్యాత్మిక స్థితితోనే నిండిపోయింది. అదే స్థితిలో నేను 'జల్సా గాహ్' (సమావేశ ప్రాంగణం) నుండి బయటకు నడిచాను, చెప్పులు వేసుకోవడం మర్చిపోయిన విషయాన్ని కూడా నేను గమనించలేదు. అదే స్థితిలో వాష్‌రూమ్‌ల వైపు నడిచాను, అక్కడ నిలబడి ఉన్న ఒక వాలంటీర్ నేను చెప్పులు లేకుండా ఉండటం గమనించాడు. అతను తన చెప్పులను తీసి నాకు ఇస్తూ ఇలా అన్నాడు: "దయచేసి వీటిని ధరించండి, చెప్పులు లేకుండా లోపలికి వెళ్తే మీకు గాయాలయ్యే అవకాశం ఉంది." ఆ చిన్న సంఘటన నా విశ్వాసాన్ని మరింత బలపరిచింది. ఇది నిజంగా దైవికంగా స్థాపించ బడిన జమాఅత్, ఇక్కడ ఒక వ్యక్తి తన తోటి సోదరుడికి సహాయం చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాడు.

ఈ విధంగా అతిథుల సంరక్షణ చూసుకునే అహ్మదీ వాలంటీర్లు మరియు కార్యకర్తలు, ప్రజల విశ్వాసాన్ని బలపరిచే సాధనాలుగా కూడా మారుతారు.

చెక్ రిపబ్లిక్‌కు చెందిన ప్రొఫెసర్ జరోస్లావ్ ఫ్రాంక్, మరొక ప్రొఫెసర్ మారెక్ సెజ్కా సాహిబ్‌తో కలిసి ఈ జల్సాకు హాజరయ్యారు. వారు ఇలా అన్నారు: "జల్సా సాలానా మమ్మల్ని ఎంతగానో కదిలించింది, మా భావాలను మాటల్లో సరిగ్గా చెప్పలేము. చెక్ రిపబ్లిక్‌కు తిరిగి వెళ్ళిన తర్వాత, మా విద్యార్థులకు మరియు తోటి ప్రొఫెసర్లకు మేము చెప్పగలిగే ఏకైక విషయం ఏమిటంటే, వారు స్వయంగా ఇక్కడికి వచ్చి ఈ అద్భుతమైన సమావేశాన్ని వీక్షించాలి. ఇది ఆధ్యాత్మికతతో నిండి ఉండి, అత్యుత్తమ ఏర్పాట్లతో నిర్వహించబడింది." వారు మరల ఇలా అన్నారు: "ప్రపంచంలోని నలుమూలల నుండి ప్రజలు ప్రేమ, శాంతి మరియు సోదర భావంతో ఒకే చోట చేరారు. ప్రార్థనల తర్వాత ప్రజలను కలవడం చాలా ఆహ్లాద కరమైన మరియు హృదయానికి హత్తుకునే అనుభవం. ఒకే విశ్వాసం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజలను ప్రేమ, శాంతి మరియు ఐక్యత అనే బంధంతో ఎలా కలుపుతుందో చూడటం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. వర్తమాన ఖలీఫా ప్రసంగం ద్వారా, మేము ఇస్లాం మరియు తక్వా (ధర్మనిష్ఠ) గురించి నిజమైన అవగాహన పొందాము. ఆ విషయంలో మాకు లోతైన అవగాహన మరియు జ్ఞానం లభించింది." ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన ఎంటిఏ ప్రసారాలు కూడా అంతే అద్భుతంగా ఉన్నాయని వారు పేర్కొన్నారు.

కజకిస్తాన్ నుండి సౌలే సాహిబా ఈ జల్సాకు హాజరయ్యారు. ఆమె ఇలా తెలిపారు: "ఇది ఆధ్యాత్మికంగా ఉత్తేజపరిచే మరియు చిరస్మరణీయమైన జల్సా, ఇది నా హృదయంలో ఎంతో ఆహ్లాదకరమైన మరియు చెరగని ముద్ర వేసింది. జమాఅత్ నాయకుడు మరియు ఇతర వక్తలు విశ్వాసం, ఉన్నత నైతిక విలువలు, శాంతి, పరస్పర సామరస్యం, కుటుంబ విలువలు, యువత పెంపకం మరియు సమాజ సేవ వంటి ముఖ్యమైన అంశాలపై వెలుగునిచ్చారు. వివిధ దేశాల ప్రజల మధ్య ఉన్న సోదరభావ వాతావరణం మరియు శాంతి, సద్భావనల చుట్టూ సాగిన సంభాషణలు నన్ను ఎంతగానో కదిలించాయి.

అమెరికాకు చెందిన న్యాయశాస్త్ర ప్రొఫెసర్ డాక్టర్ బ్రెట్ షార్ఫ్ కూడా హాజరయ్యారు. ఆయన ఇలా అన్నారు: "ప్రపంచవ్యాప్తంగా వివిధ అంతర్జాతీయ సమావేశాలు, సదస్సులకు హాజరయ్యే అవకాశం నాకు లభించింది, కానీ వాటన్నిటిలో జల్సా సాలానా యూకే అనుభవం ప్రత్యేకమైనది. వందకు పైగా దేశాల నుండి, విభిన్న మతాలు, జాతీయతలు, మరియు వివిధ రంగాలకు చెందిన అతిథులను కలిసే అవకాశం నాకు లభించింది. వారందరూ ఒకే అభిప్రాయాన్ని పంచుకున్నారు: ఇక్కడ కనిపించే ప్రేమ, గౌరవం, శాంతి, మరియు పరస్పర సోదరభావం యొక్క వాతావరణం నిజంగా అసాధారణమైనది. 'మానవత్వమే ప్రథమం' (హ్యూమానిటి ఫస్ట్) మరియు వివిధ విద్యా, చారిత్రక ప్రదర్శనలు నాపై గాఢమైన ముద్ర వేశాయి. జమాఅత్ తన సొంత వనరులతో, మతం లేదా జాతితో సంబంధం లేకుండా ప్రపంచ వ్యాప్తంగా అవసరంలో ఉన్నవారికి సేవ చేయడాన్ని చూడటం హృదయానికి హత్తుకుంది. అత్యంత అర్హత కలిగిన వ్యక్తులు, వైద్యులు, ఇంజనీర్లు, న్యాయవాదులు మరియు ఇతర నిపుణులు అద్భుతమైన వినయంతో స్వచ్ఛంద సేవ చేస్తున్నారు, మరియు అది నాపై చెరగని ముద్ర వేసింది."

బ్రెజిల్‌కు చెందిన టెలివిజన్ రిపోర్టర్ ఎరిక్ పోర్టెల్లా ఇలా అన్నారు: " ఇంతభారి స్థాయిలో, విస్తృతిలో ఈ కార్యక్రమాన్ని చూసి నేను నివ్వెరపోయాను. ముఖ్యంగా లంగర్ ఖానా (సామూహిక వంటశాల) పరిమాణం, ఆహారాన్ని తయారు చేసే ప్రదేశాలన్నీ ఆధునికంగా, విశాలంగా, క్రమబద్ధంగా, అత్యంత పరిశుభ్రంగా ఉన్నాయి. ప్రతి వాలంటీర్ యొక్క అంకితభావం, నైపుణ్యం, నిబద్ధతను చూడటం నా హృదయాన్ని శాంతి, ఆనందంతో నింపే ఒక అద్భుతమైన అనుభవం."

ప్రొఫెసర్ యూసుఫ్ మొరాలెస్ తన భార్య ప్రొఫెసర్ షెరిమా మొరాలెస్‌తో కలిసి ఫిలిప్పీన్స్ నుండి వచ్చారు. గతంలో క్రైస్తవుడిగా ఉన్న ఆయన ఇస్లాంను స్వీకరించారు. ఆయన నేషనల్ కమిషన్ ఆఫ్ ముస్లిం ఫిలిపినోస్ ఛైర్మన్‌గా కూడా పనిచేశారు. ఆయన ఇంకా అహ్మదీ కాలేదు. ఆయన ఇలా అన్నారు:

"అధికారికంగా హాజరైన వారి సంఖ్య సుమారు 50,000 అని చెప్పినప్పటికీ,

'జల్సా' (సమ్మేళనం) జరిగే స్థలం యొక్క విస్తృతిని మరియు ఏర్పాట్ల స్థాయిని చూసినప్పుడు, ఈ సమావేశం అంతకంటే చాలా పెద్దదని నాకు అనిపించింది. వేలాది మంది వాలంటీర్లు తమ సమయాన్ని మరియు సేవలను వెచ్చించి, ఒక తాత్కాలిక నగరాన్నే నిర్మించడం చూసి నేను ఎంతగానో ఆశ్చర్యపోయాను. అక్కడ వేలాది మంది ప్రజలకు వసతి, ఆహారం, రవాణా, పరిశుభ్రత మరియు ఇతర సౌకర్యాలు కల్పించబడ్డాయి. "ఆర్థికంగా మంచి స్థితిలో ఉన్నప్పటికీ, వాలంటీర్లు ఎంతో వినమ్రతతో సాధారణమైన మరియు శారీరక శ్రమతో కూడిన పనుల్లో సేవలు అందిస్తున్నారు. శాంతి యుతమైన మరియు సామరస్య పూర్వకమైన సమాజాన్ని నిర్మించగల గుణాలు ఇవే. చిన్న పిల్లలు నీరు అందించడం నేను చూశాను. అలాగే, ఆహార పంపిణీ విధుల్లో సుమారు 14 లేదా 15 ఏళ్ల వయసున్న ఇద్దరు బాలురు ఉన్నారు. వారు ఎంతో బాధ్యతాయుతంగా అటు ఇటు తిరుగుతూ 300 మందికి ఆహారం వడ్డించడం ఆశ్చర్యకరంగా అనిపించింది. "ఇక్కడికి వచ్చాక, సర్ ముహమ్మద్ జఫ్రుల్లా ఖాన్ సాహిబ్ ఒక అహ్మదీ అని కూడా తెలుసుకున్నాను. డాక్టర్ అబ్దుస్స లామ్ సాహిబ్ సాధించిన విజయాల గురించి కూడా మరింత తెలుసుకున్నాను. అలాగే, జమాఅత్ యొక్క ఇమామ్ చేసిన ప్రసంగాలు నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. తక్కువ సమయంలోనే వారు అనేక అంశాలను ప్రస్తావించారు మరియు ప్రతి అంశాన్ని వివరంగా, అదే సమయంలో సరళంగా, సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించారు."

సెంట్రల్ అమెరికన్ పార్లమెంట్‌లో ఎల్ సాల్వడార్ ప్రతినిధిగా ఉన్న సౌల్ ఎడ్గార్డో అనే అతిథి కూడా జల్సాకు హాజరయ్యారు. ఆయన ఇలా అన్నారు: "ఇది నేను హాజరైన మొదటి 'జల్సా సాలానా యు.కే'. ఇలా అహ్మదీయా ముస్లిం జమాఅత్‌ను దగ్గరగా చూసే అవకాశాన్ని నాకు కల్పించింది. మన దైనందిన జీవితాన్ని ఎలా గడపాలనేది నేను తెలుసుకున్న అత్యంత ముఖ్యమైన విషయం. దీనిలోని ప్రధాన సందేశం ఏమిటంటే, చెట్టు నుండి విడిపోయిన కొమ్మ, చెట్టు నుండే జీవశక్తిని పొందుతుంది కాబట్టి విడిపోగానే ఎండిపోతుంది. అదే విధంగా, మనం సర్వశక్తి మంతుడైన అల్లాహ్‌కు దూరమైతే, అది మన ఆధ్యాత్మిక మరణానికి దారితీస్తుంది. "కష్టాల్లో ఉన్నప్పుడు మాత్రమే దేవుడిని వెతకడం గురించి ఖలీఫా (జమాత్ ఇమామ్) చెప్పిన మాటలు అక్షరాలా నిజం." అదేవిధంగా, భార్యాభర్తల మధ్య సంబంధం గురించి వారు ఇచ్చిన మార్గదర్శకత్వం ఎంతో విలువైనది. దానిని ఆచరిస్తూ, మనం చూపును అదుపులో ఉంచుకునే అలవాటు చేసుకుంటే, అనేక వైవాహిక సమస్యలను నివారించవచ్చు." కాబట్టి, అహ్మదీలు కానివారు ఈ సందేశాన్ని అర్థం చేసుకోగలిగితే, అహ్మదీలు దీనిని ఇంకా లోతుగా అర్థం చేసుకోవడానికి కృషి చేయాలి. మరల ఇలా అన్నారు: "అక్కడ చేసిన అద్భుతమైన ఏర్పాట్లు నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ జమాఅత్ యొక్క ఇమామ్‌తో నా సమావేశం చాలా క్లుప్తంగా జరిగింది, నాకు ఇంకాస్త సమయం దొరికితే బాగుండేదనిపించింది. అయినప్పటికీ, ఆ తక్కువ సమయంలోనే వారు ప్రతి విషయాన్ని గమనించి నాతో మాట్లాడారు. ఆ సమావేశం తర్వాత, వర్తమాన ఖలీఫాకు తన జమాఅత్ గురించి మరియు వివిధ ప్రాంతాలలో దాని స్థితిగతుల గురించి లోతైన అవగాహన ఉందని నాకు స్పష్టమైంది. ఆ విషయాలన్నింటి పట్ల వారికి ఎంతో ఆసక్తి ఉండేది."

బెలిజ్‌కు చెందిన నూతన అహ్మదీయురాలు మోసిక్ మారియానో సాహిబా ఇలా అన్నారు: "మేము చాలా చిన్న దేశానికి చెందినవాళ్ళం. మా పట్టణ జనాభా కేవలం 50,000 మాత్రమే. అక్కడ వంద మంది జనం గుమిగూడినా సరే గొడవలు జరుగుతుంటాయి, కానీ ఈ జల్సా (సమ్మేళనం) అంతటా అద్భుతమైన ప్రశాంతత నెలకొంది మరియు ప్రజలు ఒకరినొకరు ఎంతో ఆప్యాయంగా కలుసుకున్నారు. "నా భావాలను మాటల్లో చెప్పడం సాధ్యం కాదు. నన్ను నేను అహ్మదీ ముస్లిం అని చెప్పుకోవడంలో ఇప్పుడు ఎంతో ఆనందాన్ని పొందుతున్నాను. గత ఏడాది నా భర్తకు 'జల్సా సాలానా'కు హాజరయ్యే అవకాశం లభించింది. అప్పుడు వర్తమాన ఖలీఫా గారు, అహ్మదీయత్ సందేశాన్ని తన భార్యకు కూడా తెలియజేయమని ఆయనకు సూచించారు. అల్లాహ్ దయవల్ల, నేడు నేను అహ్మదీ ముస్లింని అని పూర్తి నిశ్చయంతో మరియు గర్వంతో చెప్పగలుగుతున్నాను."

బల్గేరియాకు చెందిన, కార్మిక మరియు సామాజిక విధానాల మంత్రిత్వ శాఖ సెక్రటరీ జనరల్ అయిన స్వెలెన్ పెన్‌కోవ్ ఇలా అన్నారు: "నేను జర్మనీలోని వివిధ నగరాల్లో జరిగిన జల్సా సాలానాలకు అనేకసార్లు హాజరయ్యాను, కానీ యూకే జల్సా సాలానా అనుభవం దాని విస్తృతి, నిర్వహణ మరియు ఉన్నత ప్రమాణాల పరంగా అత్యద్వితీయమైనది మరియు సాటిలేనిది. జల్సా ప్రాంగణం యొక్క అపారమైన విస్తీర్ణం మరియు అక్కడ ఏర్పాటు చేసిన తాత్కాలిక నగరం నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అక్కడ అన్ని ప్రాథమిక సౌకర్యాలు అద్భుతంగా కల్పించ బడ్డాయి మరియు 50,000 మందికి పైగా ప్రజలు అక్కడ సమావేశమయ్యారు. "జల్సాలో చేసిన ప్రసంగాలు ఎంతో సమాచారయుతంగా, పాండిత్యంతో కూడినవిగా మరియు ఉన్నత ప్రమాణాలతో ఉన్నాయి. వక్తలు మతపరమైన మరియు శాస్త్రీయ అంశాలను అద్భుతంగా వివరించారు, తద్వారా శ్రోతల విజ్ఞానం మరియు అవగాహన పెరిగింది. అక్కడి వివిధ ప్రదర్శనలు నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆధునిక ప్రమాణాలకు అనుగుణంగా అవి అత్యంత వృత్తిపరమైన రీతిలో ఏర్పాటు చేయబడ్డాయి. పిల్లల కోసం విద్యాపరమైన కార్యక్రమాలు మరియు ప్రదర్శనలు కూడా ఉన్నాయి. ఇలాంటి కార్యక్రమాలు భావి తరాల శిక్షణకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి."

సెనెగల్‌కు చెందిన, తిజానియా వర్గాన్ని అనుసరించే మరియు తన ప్రాంతంలో మత పెద్దగా ఉన్న అహ్మదూ బా సాహిబ్ ఇలా అన్నారు: "ఈ జల్సా (సమావేశం) యొక్క అద్భుతమైన నిర్వహణ మరియు ఏర్పాట్లు నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమం జరిగిన తీరు, అద్భుతమైన భద్రతా ఏర్పాట్లు, హాజరైన వారి ఉన్నత నైతిక విలువలు, వారి వివేకం, సత్ప్రవర్తన మరియు ముఖ్యంగా అహ్మదీయా జమాఅత్ సభ్యుల గొప్ప వ్యక్తిత్వం నా హృదయంపై చెరగని ముద్ర వేశాయి. "గతంలో నేను అహ్మదీయా జమాఅత్ గురించి కేవలం విన్నాను మాత్రమే. కానీ ఈ రోజు, ఇంత క్రమశిక్షణతో, చిత్తశుద్ధితో మరియు తమ ఖలీఫా మార్గదర్శకత్వానికి సంపూర్ణంగా విధేయత చూపే జమాఅత్‌ను స్వయంగా చూడటం నాకు ఎంతో ఆనందాన్ని కలిగించింది. "విరాళాలు, నీటి బావులు, మసీదులు, ఆసుపత్రులు, సహాయక చర్యలు మరియు ఇతర సంక్షేమ ప్రాజెక్టుల ద్వారా మీరు మానవాళికి ఎంతో సేవ చేస్తున్నారని నాకు అప్పటికే తెలుసు. కానీ ఈ రోజు, మానవ విలువలు మరియు మానవ పురోగతి కోసం మీరు చేస్తున్న కృషిని, మీ వివేకాన్ని, ప్రాథమిక విద్యను ప్రోత్సహించడాన్ని మరియు మీ విద్యా సంస్థలను, ముఖ్యంగా ప్రదర్శనల ద్వారా చూసిన తర్వాత, నేను మరింతగా ప్రభావితమయ్యాను. నా హృదయాంతరాల నుండి మీకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను." జమాఅత్ యొక్క ఇమామ్‌తో జరిగిన సమావేశం, జమాఅత్‌ను అర్థం చేసుకోవడానికి తనకు గొప్ప అవకాశాన్ని కల్పించిందని కూడా ఆయన పేర్కొన్నారు.

అదేవిధంగా, సెనెగల్‌కు చెందిన పార్లమెంటు సభ్యులు మౌర్మానే కబా జాఖతే సాహిబ్ ఇలా అన్నారు: "ప్రజా సేవ, గౌరవం, ధైర్యం మరియు దృఢ సంకల్పం మీ ముఖ్య లక్షణాలని నేను స్వయంగా చూశాను. మాటలకు అతీతంగా, సేవ ద్వారా ఇస్లాం ఆచరణలో ఉండటాన్ని నేను చూశాను. ఇచ్చే చేతులను, క్షమించే హృదయాలను మరియు ఇతరుల కోసం ఎల్లప్పుడూ తెరిచి ఉండే ద్వారాలను నేను చూశాను."

కొసోవోకు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ హలీల్ ఇబ్రహీమి సాహిబ్ ఒక ప్రముఖ విద్యావేత్త, పరిశోధకుడు మరియు విశ్వవిద్యాలయ ప్రొఫెసర్. ఆయన తన పాండిత్యం మరియు పరిశోధనల కారణంగా కొసోవోలో ఎంతో గౌరవాన్ని పొందుతున్నారు. ఆయన ఇలా అన్నారు: "ప్రతి విభాగంలో నేను చూసిన క్రమశిక్షణ, సహకారం మరియు త్యాగం యొక్క ఆచరణాత్మక స్వరూపం నిజంగా అసూయ పడదగినది. దీనితో పాటు, ప్రతి వ్యక్తి నుండి నేను పొందిన ప్రేమ, చిత్తశుద్ధి, గౌరవం మరియు ఉదారమైన ఆతిథ్యం ఈ అనుభవాన్ని నాకు మరపురానిదిగా చేశాయి. "ఈ రోజులలో, నాకు వివిధ ప్రసంగాలను, ముఖ్యంగా జమాఅత్ ఇమామ్ గారి ప్రసంగాన్ని వినే అవకాశం లభించింది. నేను వారితో సమావేశ మయ్యాను కూడా. శాంతి, మత సామరస్యం, మానవ సమానత్వం, పరస్పర గౌరవం మరియు సమాజంలోని ప్రతి సభ్యుడిని కలుపుకొని పోవాలనే భావనపై వారు నిరంతరం మరియు అసాధారణంగా ఇచ్చిన ప్రాధాన్యత నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో మతపరమైన అపార్థాలు, తీవ్రవాదం మరియు అసహనం తీవ్రమైన సవాళ్లుగా మారిన మన కాలంలో, ఈ సందేశాలు అత్యంత సమయోచితంగా, ఆశాజనకంగా మరియు మానవాళికి మార్గనిర్దేశం చేయగలవిగా అనిపించాయి.

స్పెయిన్‌కు చెందిన పెడ్రోబాద్ మేయర్, జువాన్ ఆంటోనియో రేయెస్ ఇలా అన్నారు: "ఈ సమావేశం కేవలం ఒక భావజాల వేదుక మాత్రమే కాదని, శాంతి, గౌరవం, సోదరభావం అనే ఉమ్మడి విలువలతో ఏకమైన విభిన్న దేశాలు, సంస్కృతులు, జీవిత రంగాలకు చెందిన ప్రజల మధ్య సహజీవనానికి ఇది ఒక అసాధారణ నిదర్శనమని ప్రత్యక్షంగా చూసే అవకాశాన్ని జల్సా సాలానా మాకు కల్పించింది. వివిధ ప్రదర్శనలు మరియు సమాచార కార్యక్రమాల ద్వారా, అహ్మదీయ ముస్లిం జమాఅత్ వివిధ రంగాలలో అందిస్తున్న సేవల గురించి కూడా నేను తెలుసు కున్నాను."

ఆస్ట్రేలియా నుండి ఇద్దరు అతిథి న్యాయవాదులు, కెరోలిన్ సాహిబా మరియు హన్నా సాహిబా, ఈ జల్సాకు హాజరయ్యారు. వారు ఇలా అన్నారు: "జల్సా సాలానాకు హాజరవ్వడం మా అదృష్టంగా భావిస్తున్నాము. ఇక్కడి ఏర్పాట్లు మమ్మల్ని ఆశ్చర్య పరిచాయి. ప్రతిచోటా ప్రశాంతమైన వాతావరణం నెలకొని ఉంది. నేను జల్సా ప్రాంగణం లోపల, బయట చుట్టూ చూశాను, ఎక్కడా గొడవలు గానీ, గోల గానీ లేవు. ఇంత శాంతి యుతంగా, ప్రశాంతంగా ఉండే ప్రజలు ప్రపంచంలో మరెక్కడా కనిపించరు. ప్రతి ఒక్కరూ ఒకరికొకరు సహాయం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. పిల్లలు ప్రజలకు నీళ్లు ఇవ్వడాన్ని చూడటం చాలా ఆనందంగా అనిపించింది, మరియు నేను మానవ హక్కుల సమావేశానికి హాజరయ్యాను. ప్రపంచవ్యాప్తంగా శాంతిని వ్యాప్తి చేయడానికి, అహ్మదీయుల హక్కులనే కాకుండా

ప్రతి అణచివేతకు గురైన వ్యక్తి హక్కులను పరిరక్షించడానికి, అన్యాయానికి గురైన వారందరి పక్షాన గళం విప్పడానికి జమాఅత్ చూపిస్తున్న నిబద్ధత అద్భుతమైనది, మరియు అది నన్ను ఎంతగానో కదిలించింది."

నిజానికి, ఆమె ఎంతగా ప్రభావితమై పోయిందంటే, వచ్చే సంవత్సరం మళ్లీ జల్సాకు తనను తీసుకు రావాలని తన మిషనరీ నుండి వాగ్దానం తీసుకుంది.

బొలీవియాకు చెందిన జర్నలిస్ట్ గైడర్ గిల్లెన్ ఈ జల్సాకు హాజరయ్యారు. ఆయన ఇలా అన్నారు: "అహ్మదీయ ముస్లిం జమాఅత్ యొక్క జల్సా సాలానాకు హాజరవడం నాకు ఒక అద్భుతమైన అనుభవం. ప్రసంగాలు, ముఖ్యంగా జమాఅత్ అధిపతి గారి ప్రసంగం నన్ను ఎంతగానో కదిలించాయి. అది మన జీవితాలపై శాశ్వతంగా ముద్రవేసే ఒక సమావేశం. అది మన ప్రభువుకు మరింత చేరువ య్యేందుకు, ఆయన కరుణను పొందేందుకు మనకు మార్గాన్ని చూపిస్తుంది." వారు కూడా ఇస్లాం సందేశాన్ని స్వీకరించేలా అల్లాహ్ అనుగ్రహించుగాకా!. మరల ఇలా తెలిపారు: "ముస్లిం మహిళలు అణచివేతకు గురవుతున్నారని, ఒత్తిడిలో జీవిస్తున్నారని ఏళ్ల తరబడి ప్రచారం జరిగినప్పటికీ, అది పూర్తిగా అబద్ధమని స్వయంగా చూసే అవకాశం నాకు లభించింది. దానికి భిన్నంగా, ఇస్లాంలో మహిళలకు లభించే గౌరవం, రక్షణ మరియు ప్రాముఖ్యత నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి."

కోసోవోకు చెందిన, బాల్డియానిజన్ క్యాబినెట్ చీఫ్ అయిన అవ్నీ జషారీ ఇలా తెలిపారు: "ఈ జమాఅత్ నాయకుని ప్రసంగాన్ని వినే అవకాశం నాకు లభించింది. సభ (జల్సా) ప్రారంభానికి ముందు, అతిథులకు సేవ చేయడాన్ని ఒక గొప్ప బాధ్యతగా భావించాలని, దానిని ప్రేమ, వినయం, చిత్తశుద్ధి మరియు అత్యుత్తమ ప్రవర్తనతో నిర్వహించాలని వారు వాలంటీర్లకు సూచించారు. (ఇది గురువారం సాయంత్రం జరిగింది.) ఆ సమయంలో ఆ సూచన నాకు ఎంతో అభినందనీయంగా అనిపించింది, కానీ మరుసటి రోజే దాని ఆచరణాత్మక రూపాన్ని నా కళ్లారా చూస్తానని నేను ఊహించలేదు. అకస్మాత్తుగా నేను అనారోగ్యానికి గురయ్యాను. నాకు కళ్లు తిరగడం, అస్వస్థతగా అనిపించడం మరియు వాంతులు కావడం మొదలయ్యాయి. వెంటనే ప్రథమ చికిత్స బృందం నాకు సహాయం అందించింది, ఆరుగురు వైద్యులు నా చుట్టూ చేరారు. నిజంగా నా సొంత ఇంట్లో ఉన్నట్లుగా నాకు అనిపించింది. ఖలీఫా ఇచ్చిన ఆదేశాలు కేవలం మాటలు మాత్రమే కాదని, అవి ప్రతి వాలంటీర్ దైనందిన జీవితంలో ఒక సజీవ భాగమని ఆ క్షణంలో నేను గ్రహించాను."

జపాన్‌కు చెందిన హిరోయుకి ఇవామోటో సాహిబ్ ఇలా తెలిపారు: "మాకు ఇది నిజంగా చిరస్మరణీయమైన ప్రయాణం. జల్సా వాతావరణం ప్రేమ మరియు ఆధ్యాత్మికతతో నిండి ఉండటాన్ని మేము గమనించాము. సేవలో నిమగ్నమైన కార్యకర్తల స్ఫూర్తి, పిల్లలు నీరు అందించిన తీరు, ఖిలాఫత్‌తో జమాఅత్‌కు ఉన్న అనుబంధం మరియు మిమ్మల్ని ఖలీఫాను చూడాలనే తపన, ఇవన్నీ నిజంగా ఒక గొప్ప అనుభూతిని కలిగించాయి."

మూలతః లెబనాన్‌కు చెందినవారు మరియు ప్రస్తుతం బెల్జియంలో నివసిస్తున్న మరో అతిథి ఇలా తెలిపారు: "నేను దౌత్యపరమైన విభాగంలో పని చేస్తుండటం వల్ల, ఖతార్, బ్రస్సెల్స్ లేదా ఇతర ప్రధాన నగరాల వంటి ప్రపంచ వ్యాప్తంగా ముఖ్యమైన సమావేశాలు జరిగే అనేక ప్రాంతాలకు ప్రయాణిస్తుంటాను. కానీ, 50,000 మందికి పైగా ప్రజలు హాజరైనప్పటికీ, ఎవరూ ఒకరినొకరు తోసుకోవడం గానీ, కఠినమైన మాటలు అనడం గానీ జరగని ఈ 'జల్సా' (సమావేశం) లాంటి అత్యున్నత స్థాయి మరియు అద్భుతమైన నిర్వహణ కలిగిన కార్యక్రమాన్ని నేను మరెక్కడా చూడలేదు. ప్రతి ఒక్కరూ గౌరవం, మర్యాద మరియు ప్రేమతో ఒకరినొకరు కలుసుకుంటున్నారు. ఇస్లాం బోధించే సోదరభావాన్ని నేను ఇక్కడ ఆచరణలో చూశాను. అలాగే, 'మత విషయంలో ఎటువంటి బలవంతం ఉండ కూడదు' (బఖరా :257) అనే ఖురాన్ బోధన యొక్క ఆచరణాత్మక రూపాన్ని కూడా నేను ఈ సమావేశంలో ప్రత్యక్షంగా చూశాను. ఇతర మతాలకు చెందిన వారు కూడా ఇక్కడ మన మధ్య నివసిస్తున్నారు, వారికి పూర్తి మర్యాద మరియు గౌరవం లభిస్తున్నాయి, మరియు వారు స్వేచ్ఛగా, సంతోషంగా తిరుగుతున్నారు."

అర్జెంటీనాకు చెందిన సెర్జియో రూబిన్ గారు కూడా జల్సాకు హాజరయ్యారు. ఆయన ఆ దేశంలోని అత్యంత ముఖ్యమైన జాతీయ వార్తాపత్రికలలో ఒకటైన 'క్లారిన్' లో మతపరమైన వ్యవహారాల విభాగం ప్రధాన సంపాదకులుగా ఉన్నారు. ఆయన ఇలా అన్నారు: "ఇక్కడికి రావడానికి ముందు, ఈ జల్సాకు హాజరుకావాలనే నా ఉద్దేశాన్ని నా వార్తాపత్రికకు తెలియజేసినప్పుడు, ఇస్లాం పట్ల ఉన్న సాధారణ అపోహల కారణంగా నా నిర్ణయాన్ని పునఃపరిశీలించమని చాలా మంది సహచరులు నాకు సలహా ఇచ్చారు. ఏది ఏమైనప్పటికీ, జల్సా వాతావరణాన్ని స్వయంగా గమనించి నప్పుడు, ఇస్లాం శాంతియుత మతం అనడానికి మీ జమాఅత్ (సంస్థ) మరియు మీ జల్సాలోని ప్రశాంతమైన వాతావరణమే అత్యుత్తమ నిదర్శనమని స్పష్టమైంది. అంత భారీ జనసమూహం ఉన్నప్పటికీ, అక్కడ అంతటా శాంతి మరియు ప్రశాంతత నెలకొని ఉన్నాయి." జల్సా చివరి రోజున, వీక్షకులు కూడా ఈ వాతావరణాన్ని చూసేలా ఆయన 'టీఎన్' టెలివిజన్ ఛానెల్‌లో కార్యక్రమాలను ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఇస్లాం శాంతియుత మతమని ఆయన నొక్కి చెప్పారు మరియు దీనికి జమాఅత్ ఒక సజీవ సాక్ష్యమని పేర్కొన్నారు. ఆయన స్వయంగా క్యాథలిక్ క్రైస్తవుడు. మరల ఇలా అన్నారు: "జల్సాలో ఖలీఫా చేసిన ప్రారంభోపన్యాసం నాకు ఎంతో నచ్చింది. అందులో వారు ప్రతి మతానికి మూలమైన 'ధర్మనిష్ఠత' గురించి ప్రసంగించారు. ఒక క్రైస్తవుడిగా, ఈ విషయంలో నా జ్ఞానాన్ని మరియు అవగాహనను పెంచుకోవడానికి ఇది నాకు గొప్ప అవకాశాన్ని కల్పించింది."

లిథువేనియాకు చెందిన శ్రీమతి స్వెట్లానా మార్కెవిసియెన్ ఇలా అన్నారు:

"జల్సా సాలానాలో, ముస్లింల మధ్య గడపడానికి మరియు వారి ఆచార వ్యవహారాలను దగ్గరి నుండి గమనించడానికి నాకు అవకాశం లభించింది. దీని ద్వారా నాకు కొత్త విషయాలు ఎన్నో తెలిశాయి. "జమాఅత్ నాయకుడు మహిళలను ఉద్దేశించి చేసిన ప్రసంగం విన్న తర్వాత, ఇస్లాంలో మహిళల స్థానం గురించి నాకు ఉన్న అనేక అపోహలు తొలగిపోయాయి. మహిళల గౌరవం, రక్షణ మరియు వారి ప్రాథమిక హక్కుల గురించి ఇస్లాం బోధిస్తుందని తెలుసుకోవడం నాకు ఎంతో సంతోషా న్నిచ్చింది. ఆ ప్రసంగం ఎంతో సమతుల్యంగా, హేతుబద్ధంగా మరియు హృదయానికి హత్తుకునేలా ఉంది. అలాగే ఇస్లాం పట్ల మరింత సానుకూల దృక్పథంతో ఆలోచించే అవకాశాన్ని నాకు కల్పించింది."

స్విట్జర్లాండ్‌కు చెందిన ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సలహాదారు గియులియా ప్రటేసి ఇలా అన్నారు: "ఇది నాకు ఒక ప్రత్యేకమైన అనుభవం. ఈ సమావేశానికి హాజరవడం ద్వారా, నాకు ఇంతకుముందు పరిమిత పరిజ్ఞానం ఉన్న ఒక మత సమాజాన్ని దగ్గరగా పరిశీలించి, అర్థం చేసుకునే అవకాశం లభించింది. స్వచ్ఛంద కార్యకర్తలు మరియు పాల్గొన్నవారి ఆతిథ్యం, ఆప్యాయత, మరియు సహాయక స్వభావం నాపై బలమైన ముద్ర వేశాయి. ప్రతి ఒక్కరూ నన్ను ఉల్లాసంగా, స్నేహపూర్వకంగా పలకరించారు, నా ప్రశ్నలకు సమాధానమిచ్చారు, మరియు నేను అడిగిన దేనికైనా స్పందించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నారు . దీనివల్ల అహ్మదీయ ముస్లిం జమాఅత్ యొక్క చరిత్ర, సంప్రదాయాలు, మరియు మూల విలువలను అర్థం చేసుకోవడానికి నాకు మరింత మంచి అవకాశం లభించింది." ఆమె వివిధ ప్రదర్శనలను కూడా ప్రశంసించారు. అవి చాలా ఆసక్తికరంగా ఉన్నాయని, మరియు అవి చరిత్రను, మానవతా సేవా ప్రాజెక్టులను, మరియు వివిధ రంగాలలో జమాఅత్ చేసిన సేవలను బలమైన, ప్రభావవంతమైన రీతిలో ప్రదర్శించాయని ఆమె అన్నారు. మహిళల పాత్రపై జరిగిన ప్రదర్శన నాకు ప్రత్యేకంగా ఎంతో సమాచారాన్ని అందించింది, ఎందుకంటే ఈ విషయాన్ని జమాఅత్ సొంత దృక్కోణం నుండి అర్థం చేసుకునే అవకాశాన్ని అది నాకు కల్పించింది.

ఇటలీలోని టూరిన్‌కు చెందిన ప్రొఫెసర్ ఫెడెరికా సోనా సాహిబా ఇలా అన్నారు: "జల్సా సాలానాలో నేను విజ్ఞానం మరియు ఆధ్యాత్మికతల యొక్క ఒక అద్భుతమైన సామరస్యాన్ని చూశాను. హేతుబద్ధమైన దృక్కోణం నుండి చూస్తే, ఈ కార్యక్రమం మొత్తం ఎంత అద్భుతమైన సామర్థ్యంతో, ఎంతో హుందాతో నిర్వహించ బడిందో చూసి నేను ఎంతగానో ఆశ్చర్యపోయాను. ప్రతిదీ గాలి సహజంగా ప్రవహించి నట్లుగా, ఎంతో సహజంగా మరియు సజావుగా సాగిపోతున్నట్లు అనిపించింది. "నీళ్లు అందించడానికి నియమించబడిన అతి చిన్న వాలంటీర్ నుండి అత్యంత సీనియర్ కార్యకర్తల వరకు, ప్రతి ఒక్కరూ నిజాయితీ, ఆతిథ్యం, మర్యాద మరియు ఆప్యాయమైన చిరునవ్వు వంటి ఒకే రకమైన గుణాలను పంచుకున్నారు. "భావోద్వేగ పరంగా చెప్పాలంటే, నన్ను ఒక పెద్ద అంతర్జాతీయ కుటుంబంలోకి ఆహ్వానిస్తున్నట్లు నాకు అనిపించింది. ప్రతి అతిథిని నిజమైన ఆనందంతో స్వీకరించి, శ్రద్ధ మరియు ఆప్యాయతతో చూసుకున్నారు." ఆమె మరల ఇలా తెలిపారు: "నేను ఎంతోమంది పురుషులు, స్త్రీలు మరియు పిల్లలను కలిశాను. వారు నన్ను చిరునవ్వుతో పలకరించారు, దారి తెలుసుకోవడంలో సహాయపడ్డారు మరియు తమ జీవిత విశేషాలను పంచుకున్నారు. వాటిలో కొన్ని బాధాకరమైనవి, కొన్ని ఆనందకరమైనవి, మరికొన్ని స్ఫూర్తిదాయకమైనవి మరియు జ్ఞానోదయం కలిగించేవిగా ఉన్నాయి."

నూరుల్ ఇస్లాం శాఖ:

అహ్మదియ్య ముస్లిం జమాఅత్‌ను గూర్చి సరైన వివరాలు తెలుసుకోవడం కోసం మీరు ఈ క్రింది టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించగలరు.
టోల్ ఫ్రీ నెంబర్: 1800 103 2131
సంప్రదించు సమయం: ప్రతిరోజు ఉదయం 08:30 నుండి రాత్రి 10:00 వరకు. (ప్రతి శుక్రవారం సెలువు).



తన అనుభవంలోని ఆధ్యాత్మిక మరియు సూక్ష్మ అంశాలను ప్రస్తావిస్తూ ఆమె ఇలా అన్నారు: "స్పష్టమైన కలల ద్వారా భవిష్యత్తు సంఘటనల గురించి జమాఅత్ సభ్యులు పంచుకున్న అనుభవాలు నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి." ఆమె ఇలా ముగించారు: "ఈ జమాఅత్ భౌగోళిక సరిహద్దులకు అతీతమైన ఒక పెద్ద మరియు ఐక్య కుటుంబం."

రోమ్‌కు చెందిన మత సామాజిక శాస్త్ర పండితుడు సెనాప్ ఐడిన్ సాహిబ్ ఇలా తెలిపారు: "ఒకే చోట అనేక విభిన్న దేశాలు, భాషలు మరియు సంస్కృతుల ప్రజలు సమావేశం కావడం అందరి దృష్టిని ఆకర్షించే ప్రధాన అంశం. జమాఅత్ జెండాతో పాటు వివిధ దేశాల జెండాలను ఎగురవేసే కార్యక్రమం ఈ అంతర్జాతీయ ఐక్యతను అద్భుతంగా చాటిచెబుతుంది. ఇది ఒక చిన్న ప్రపంచం లాంటిది, ఇక్కడ విభిన్న ప్రజలు తమ వ్యక్తిగత గుర్తింపులను కోల్పోకుండా కలిసి జీవిస్తున్నారు." మరల ఇలా అన్నారు: "మత సామాజిక శాస్త్ర విద్యార్థిగా, ఒక మతపరమైన సమాజం స్థానిక గుర్తింపులను మరియు ఉమ్మడి ప్రపంచ ఐక్యతను ఏ విధంగా విజయవంతంగా కాపాడుకోగలదో పరిశీలించే అవకాశాన్ని ఈ 'జల్సా' (సమ్మేళనం) నాకు కల్పించింది." అతిథులకు అందించిన ఆతిథ్యాన్ని ఆయన ఎంతో మెచ్చుకున్నారు మరియు స్వచ్ఛంద సేవకుల అంకితభావాన్ని హృదయపూర్వకంగా ప్రశంసించారు.

కెనడాలోని 'స్టోనీ నకోడా ఫస్ట్ నేషన్'కు చెందిన రెవరెండ్ టోనీ స్నో సాహిబ్ ఇలా తెలిపారు: "ఇంత పెద్ద సమావేశాన్ని చూడటం తనకు ఒక అద్భుతమైన అనుభవం. ఇక్కడ అద్భుతమైన ఏర్పాట్లు చేశారు, మరియు కార్యక్రమం సజావుగా సాగేలా చూసేందుకు ప్రతి ఒక్కరూ తమ శక్తిమేర కృషి చేస్తున్నారు." మరల ఇలా జోడించారు: "ఇంత భారీ స్థాయిలో కార్యక్రమాన్ని నిర్వహించడం ఏమాత్రం సులభమైన పని కాదు, పనులన్నీ నిర్వహించడంలో కనిపించిన అంకితభావం నన్ను ఎంతగానో ఆకట్టుకుంది."

అహ్మదీయేతర అతిథి అయిన టర్కీకి చెందిన ప్రొఫెసర్ మెటిన్ బోజాన్, డిక్లే విశ్వవిద్యాలయంలోని 'ఇస్లామిక్ మతాల చరిత్ర' విభాగంలో ప్రొఫెసర్ మరియు విభాగాధిపతిగా ఉన్నారు. ఆయన పర్యవేక్షణలో విద్యార్థులు అహ్మదీయా ముస్లిం జమాఅత్‌పై పరిశోధనా పత్రాలను (థైసస్) కూడా పూర్తి చేశారు. ఆయన ఇలా అన్నారు, "జల్సా జమాఅత్ యొక్క ప్రతి అంశం మరియు ప్రతి కార్యాచరణ ఆదర్శ ప్రాయమైన క్రమశిక్షణతో నిర్వహించబడింది." ఆయన ఇలా పేర్కొన్నారు, "అల్లాహ్, ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మరియు పరలోకంపై విశ్వాసం ప్రకటించి, విశ్వాసం మరియు ఇస్లాం యొక్క ప్రాథమిక అవసరాలను నెరవేర్చే ఎవరైనా ముస్లిం అనేదే మా సూత్రప్రాయమైన వైఖరి. అందువల్ల, అటువంటి వ్యక్తిని అవిశ్వాసిగా ప్రకటించడం మాకు అనుమతించదగినదిగా అనిపించదు. తదనుగుణంగా, మా దృష్టిలో, అహ్మదీలు కూడా ముస్లింలే." పాకిస్తాన్ ఉలేమాలు (మత పండితులు) కూడా ఈ విషయాన్ని అర్థం చేసుకుంటే ఎంత బాగుంటుంది. ఆయన ఇంకా ఇలా వ్యాఖ్యానించారు, "అంతర్జాతీయ శాంతి మరియు భద్రతను ప్రోత్సహించడానికి జమాఅత్ చేస్తున్న ప్రయత్నాలను నేను ఎంతగానో అభినందిస్తున్నాను." ప్రతి సందర్భంలోనూ పురుషులకు, మహిళలకు వేర్వేరు ఏర్పాట్లు చేయడాన్ని కూడా ఆయన గమనించారు. దీనిని బట్టి, పర్దా (ముసుగు)కు సంబంధించిన ఇస్లామిక్ ఆదేశాలను పాటించడంపై జమాఅత్ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందనే నిర్ధారణకు ఆయన వచ్చారు.

ఫ్రాన్స్‌కు చెందిన, 'మనస్సాక్షి స్వేచ్ఛ కోసం సంఘాలు మరియు వ్యక్తుల సమన్వయ సంస్థ' అధ్యక్షుడు థియరీ వల్లే సాహిబ్ ఇలా అన్నారు, "ఏర్పాట్లు దోషరహితంగా ఉన్నాయి, వాతావరణం ప్రశాంతంగా ఉంది, మరియు ప్రగాఢమైన ప్రశాంత భావన నెలకొంది. అహ్మదీయ ముస్లిం జమాఅత్ అధిపతి గారి ముగింపు ప్రసంగం నిజంగా స్ఫూర్తిదాయకంగా మరియు గొప్ప మార్గదర్శకంగా నిలిచింది. ప్రతి వ్యక్తి పాటించడానికి కృషి చేయాల్సిన ఉన్నత నైతిక ప్రమాణాలను, మరియు ప్రజలందరూ కలిసికట్టుగా నిర్మించాల్సిన శాంతియుత ప్రపంచాన్ని అది మాకు గుర్తు చేసింది." ఆయన ఇంకా ఇలా అన్నారు, "ఈ పర్యటన ద్వారా అహ్మదీయ ముస్లిం జమాఅత్ యొక్క శాంతి, ప్రేమ మరియు సోదరభావం అనే సందేశం ఆచరణలో ఎలా రూపుదిద్దుకుంటుందో ప్రత్యక్షంగా చూసే అవకాశం నాకు లభించింది. అందుకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. 100కు పైగా దేశాల ప్రజలు ఒక అందమైన పూలగుత్తిలా కలిసి ఉండటాన్ని చూడటం, దాని పరిమళాన్ని నేను స్వయంగా అనుభవించేలా చేసింది."

బెల్జియంకు చెందిన ఒక పాత్రికేయుడు ఇలా అన్నారు, "నేను ఇంతకు ముందు కూడా జల్సాకు హాజరయ్యాను. అయితే, ఈ సంవత్సరం లజ్నా (మహిళల) సభలో అహ్మదీయ ముస్లిం జమాఅత్ అధిపతి చేసిన ప్రసంగం నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. తన ప్రసంగంలో వారు, మహిళలు కేవలం మతపరమైన విజ్ఞానాన్ని సంపాదించడమే కాకుండా, లౌకిక విద్యను అభ్యసించాలని, జీవితంలోని ప్రతి రంగంలోనూ శ్రేష్ఠత కోసం కృషి చేయాలని ప్రోత్సహించారు."

అహ్మదీయా ముస్లిం జమాత్ గురించి పరిశోధన చేసి, దానిపై ఒక పుస్తకాన్ని రచించిన జపాన్‌కు చెందిన ప్రొఫెసర్ మినెసాకి హిరోకో సాహిబా కూడా తన అభిప్రాయాలను పంచుకున్నారు. తన పరిశోధనలో భాగంగా ఆమె రబ్వా, ఖాదియాన్ మరియు ఇతర అనేక ప్రాంతాలను సందర్శించి, ఆ జమాఅత్ పట్ల లోతైన అవగాహనను పెంపొందించుకున్నారు. ఆమె ఇలా పేర్కొన్నారు:

జల్సాలో నేను ఒక యువ జర్మన్ వ్యక్తిని కలిశాను, అతను అదే రోజు అంతకు ముందే బైఅత్ చేశాడు. అహ్మదీయ ముస్లిం జమాఅత్‌లో చేరడానికి అతనికి ఏమి ప్రేరణ ఇచ్చిందని నేను అడిగినప్పుడు, జల్సాలోని వాతావరణం, అహ్మదీయుల మధ్య ఉన్న సోదరభావం మరియు పరస్పర ప్రేమ స్ఫూర్తి తనను అహ్మదీయత్‌ను స్వీకరించేలా చేశాయని అతను బదులిచ్చాడు. ఆమె స్వచ్ఛంద కార్యకర్తల పనిని కూడా ఎంతగానో ప్రశంసించారు.

తన గ్రీకు భార్యతో కలిసి గ్రీస్‌లో నివసిస్తున్న ఇండోనేషియా దేశస్థుడు ఆర్చీ సాహిబ్ (ఆమె అహ్మదీయేతర ఇస్లాం మతంలోకి మారిన వ్యక్తి) ఇలా అన్నారు,

"జల్సాకు హాజరు కావడానికి నాకు ఆహ్వానం అందినప్పుడు, అది నన్ను సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు మరింత దగ్గర చేసే ఒక ఆధ్యాత్మిక యాత్రగా నేను భావించాను. ఈ ఆశతోనే, నేను ఈ సమావేశానికి హాజరు కావడానికి గ్రీస్ నుండి ప్రయాణించాను. వర్తమాన ఖలీఫా ప్రసంగాలు నాపై ప్రగాఢమైన ముద్ర వేశాయి, మరియు స్వచ్ఛంద కార్యకర్తలు ప్రదర్శించిన నిస్వార్థ సేవా స్ఫూర్తి నన్ను అంతే కదిలించింది."


లాట్వియాకు చెందిన నార్మండ్స్ బోలుజ్ సాహిబ్ రాజనీతి శాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీని పొందారు. పాకిస్తాన్‌లో అహ్మదీయులు ఎదుర్కొంటున్న హింస మరియు అన్యాయాలపై ఆయన తన అకడమిక్ పరిశోధన గ్రంథాన్ని కేంద్రీకరించారు. ఆయన జల్సాకు హాజరయ్యారు మరియు ఇలా అన్నారు, "ఈ సమావేశం సందర్భంగా ఇస్లాం మరియు అహ్మదీయత్ గురించి నాకు ఉన్న అన్ని ప్రశ్నలకు సమాధానాలు దొరికాయి."

ఆ తర్వాత గ్రీస్ ప్రతినిధి బృందంలో ఒక మహిళ ఉన్నారు. ఆమె ఇలా అన్నారు, "అదొక అద్భుతమైన అనుభవం. వాలంటీర్లలో ప్రతి ఒక్కరూ అతిథులతో చాలా స్నేహపూర్వకంగా మరియు సహాయకరంగా ఉన్నారు. ప్రదర్శనలు అద్భుతంగా ఉన్నాయి, ముఖ్యంగా ఇస్లాం చరిత్రపై 'ది రివ్యూ ఆఫ్ రెలిజియన్స్' ప్రదర్శన. నేను అక్కడ చాలా గంటలు గడపగలిగి ఉంటే బాగుండేదనిపించింది. నాకు పురావస్తు ప్రదర్శనల గురించి కూడా చెప్పారు." ఈ ప్రశంసలను పేర్కొన్న తర్వాత, ఆమెకు నచ్చని ఒక విషయాన్ని ప్రస్తావించారు. ఆమె ఇలా అన్నారు, "నాకు నచ్చని ఒక విషయం ఉంది. కొంతమంది మహిళలు ఇస్లామిక్ వస్త్రధారణ నియమావళి అయిన పర్దాను సరిగ్గా పాటించకపోవడం, మరియు కొంతమంది పురుషులు కూడా తమ చూపులను కిందికి దించడంలో బలహీనతను ప్రదర్శించడం." నేను ఈ విషయంపై ప్రత్యేకంగా దృష్టి సారించినప్పటికీ ఇలా జరిగింది. కాబట్టి, మనం దీని గురించి ఆలోచించాలి మరియు అటువంటి ప్రతికూల వ్యాఖ్యలను మన స్వంత సంస్కరణ కోసం ఉపయోగించుకోవాలి. అందువల్ల, అజాగ్రత్తగా ఉన్నవారు ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. అహ్మదీలు కానివారు మనల్ని చాలా నిశితంగా గమనిస్తుంటారు. ఇస్లాం యొక్క నిజమైన ప్రతిష్టకు భంగం కలిగించే లేదా మచ్చ తెచ్చే ఏ అవకాశాన్నీ మనం వారికి ఇవ్వకూడదు. వాస్తవానికి, జల్సా ప్రసంగాల సమయంలో, నేను 'హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) వారి ఒక ఉపదేశాన్ని కూడా చదివి వినిపించాను. అందులో వారు, ఇతరులు మనల్ని వేలెత్తి చూపే అవకాశం మనం ఇవ్వకూడదని పేర్కొన్నారు.

(మల్ఫూజాత్, సంపుటి 3, పేజీ 143, ప్రచురణ 2022)

పోలాండ్ నుండి ప్రొఫెసర్ వోయిచెక్ లామెంటోవిచ్ వచ్చారు. ఆయన పేరు పలకడం కొంచెం కష్టమే. ఏది ఏమైనప్పటికీ, ఆయన మానవ హక్కుల ప్రొఫెసర్ మరియు యూనివర్సిటీ ఛాన్సలర్‌గా కూడా పనిచేశారు. ఆయన న్యాయ శాస్త్రం బోధిస్తారు. ఆయన ఇలా అన్నారు: "ఇక్కడి ఏర్పాట్లు నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇక జమాఅత్ యొక్క ఇమామ్‌తో నాకున్న సమావేశం

J.K WOOD WORKS Mob.9393727201
Spl.Capboard & Interior 7989385296
#8-125/A, Chandanagar, Hyderabad
దుఆ ఆశించువారు: SK Meera sb, Jagadth giri gutta, Hyderabad, (Telangana)



Love for All Hatred for None
99493-56387
Prop:Muhammad Saleem
MASROOR HOTEL
TEA,TIFFIN,MEALS,CHICKEN-BIRYANI,FAST-FOOD AVAILABLE HERE
Near Naidu Petrol Pump, Khammam Rd. Warangal (Telengana)
Mohammad Saleem (Naib Ameer Zila Jamat Ahmadiyya Warangal (Telengana)

విషయానికొస్తే, నా భావాలను మరియు అనుభూతులను వ్యక్తం చేయడానికి నాకు మాటలు రావడం లేదు.'' వారితో మాట్లాడిన తర్వాత తాను ఎంతో ప్రభావితమయ్యానని కూడా ఆయన చెప్పారు. ఆ తర్వాత ఆయన ఇలా అన్నారు: "ఇక్కడ నేను నేర్చుకున్న విషయాలను నా విద్యార్థులకు తెలియజేస్తాను, తద్వారా వారు ఇస్లాం బోధనల యొక్క నిజమైన అర్థాన్ని గ్రహించగలుగుతారు.''

నేను కొన్ని సంఘటనలను ఎంపిక చేసుకున్నాను, వాటిలో కొన్నింటిని మాత్రమే ఇక్కడ ప్రస్తావించాను.

నేను చెప్పినట్లుగా, ఈ రోజుల్లో పత్రికలు మరియు మీడియా, అలాగే యు.కే పత్రికలు దీనికి విస్తృతమైన ప్రచారాన్ని కల్పించాయి. బ్రిటన్ యొక్క ప్రముఖ వార్తాపత్రికలలో ఒకటైన 'ది టైమ్స్' దీనికి ప్రముఖంగా వార్తా కవరేజీని ఇచ్చింది. ఇతర పత్రికా విభాగాలు కూడా దీనిని కవర్ చేశాయి.

ఈ మీడియా కవరేజీలో 10 మిలియన్ల మంది పాఠకులు కలిగిన 16 ముద్రిత కథనాలు ఉన్నాయి. 35 రేడియో కార్యక్రమాలు ప్రసారమయ్యాయి, ఇది గత ఏడాదితో పోలిస్తే 10 శాతం ఎక్కువ. ఆరు టెలివిజన్ కార్యక్రమాలు వచ్చాయి, వీటిని సుమారు 7.2 మిలియన్ల మంది వీక్షించారు. సోషల్ మీడియాలో 5,30,000 వీక్షణలు నమోదయ్యాయి, మరియు యు.కే విభాగం నివేదిక ప్రకారం ఆ సంఖ్య కోట్లలో (పదుల మిలియన్లలో) ఉంది. మొత్తంగా, పత్రికలు మరియు మీడియా ద్వారా ఈ కవరేజీ 52.8 మిలియన్ల మందికి చేరింది. సుమారు 12 వివిధ వార్తాపత్రికలు మరియు టెలివిజన్ ఛానెల్లు ఈ 'జల్సా' (సమ్మేళనం) గురించి వార్తలు అందించాయి. వీటిలో ప్రసిద్ధ జాతీయ టెలివిజన్ ఛానెల్లు మరియు వార్తాపత్రికలు కూడా ఉన్నాయి. పాత్రికేయుల అభిప్రాయాలను పరిశీలిస్తే, చివరి రోజున జరిగిన 'బైఅత్' కార్యక్రమాన్ని చూసిన ఒక మహిళా పాత్రికేయురాలు ఇలా అన్నారు: "నేను ఎంతో చలించిపోయాను. నా కళ్లు నీళ్లతో నిండిపోయాయి. ప్రపంచంలో ఎక్కడా నేను ఇలాంటి దృశ్యాన్ని చూడలేదు, మరియు ప్రపంచంలో మరెవరూ ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించగలరని లేదా ఇలాంటి అనుభూతిని కలిగించగలరని నేను అనుకోను. అది అద్భుతమైన దృశ్యం, నేను పూర్తిగా దానికి మంత్రముగ్ధురాలినయ్యాను.'' ఇతరుల నుండి కూడా ఇలాంటి అభిప్రాయాలే వ్యక్తమయ్యాయి.

ఎంటిఏ ఆఫ్రికా కూడా అద్భుతమైన పని చేస్తోంది. ఇక్కడ 20 మంది పాత్రికేయులు పాల్గొన్నారు మరియు వారు 157 నివేదికలను పంపారు. వారి నివేదికలు 'జల్సా' వార్తలతో 63 మిలియన్లకు పైగా గృహాలకు చేరాయి. ఆఫ్రికా అంతటా, 'జల్సా సాలానా'కు సంబంధించిన వార్తలు మరియు ప్రసంగాలు 18 కి పైగా ఛానెల్లలో ప్రత్యక్ష ప్రసారం చేయబడ్డాయి, మరియు ఈ ప్రసారాల పరిధి 35 మిలియన్ల మందికి పైగా ప్రజలకు చేరింది.

ఆఫ్రికాలోని అహ్మదీయేతరులైన వీక్షకుల అభిప్రాయాలు ఈ విధంగా ఉన్నాయి:

సెరాలియోన్‌లోని టెంటాఫోర్ గ్రామానికి చెందిన పాస్టర్ జార్జ్ ఇలా అన్నారు, "వృత్తిరీత్యా నేను ఉపాధ్యాయుడిని, సెరాలియోన్‌లోని టెంటాఫోర్ గ్రామంలో నివసిస్తున్నాను. నేను అహ్మదీ ముస్లింను కాను. జల్సా సాలానా యూకే జరిగిన ఆ మూడు రోజుల కార్యక్రమంలో, నన్ను అత్యంతగా ఆకట్టుకున్న విషయం ఏమిటంటే, అహ్మదీ ముస్లింలకు ఖిలాఫత్ పట్ల ఉన్న ప్రగాఢమైన ప్రేమ మరియు వారు ఏ దేశానికి చెందినవారైనా సరే, యావత్ మానవాళి పట్ల శాంతి, ప్రేమ, విధేయత మరియు గౌరవాన్ని వ్యక్తపరిచిన తీరు.'' ఆయన ఇంకా ఇలా అన్నారు, "ఆదివారం నేను చర్చికి వెళ్లాల్సి ఉండగా, దానికి బదులుగా అంతర్జాతీయ బైఅత్ కార్యక్రమాన్ని వీక్షించడానికి మసీదుకు వెళ్లాలని నిర్ణయించుకున్నాను. అక్కడ నేను చూసిన దృశ్యం, నేను ఊహించుకున్న దానికి పూర్తిగా భిన్నంగా ఉంది. అహ్మదీయ ముస్లిం జమాఅత్ ప్రపంచవ్యాప్తంగా ఎందుకంత వేగంగా విస్తరిస్తోందో ఇప్పుడు నాకు అర్థమైంది.''

అదేవిధంగా, అనేక ఇతర పాస్టర్లు మరియు విద్యావంతులు కూడా తమ అభిప్రాయాలను పంపారు.

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఈ ప్రజలకు మార్గదర్శకత్వం వహించి, వారిని సత్య ఇస్లాం అయిన అహ్మదీయత్ వైపు మొగ్గు చూపేలా చేయుగాకా!. అలాగే ఈ జల్సా యొక్క శుభప్రదమైన ప్రభావాలు జమాఅత్‌లోని సభ్యులందరిపై శాశ్వతంగా నిలిచి ఉండేలా ఆయన చూసుగాకా!. ఆమీన్.

(15వ పేజీ తరువాత)

ఇతడిని ప్రతిపక్ష నాయకుడిగా పరిగణించాలి. ఇతను ఖురైష్ తెగలో చాలా ప్రముఖ స్థానాన్ని కలిగి ఉండేవాడు మరియు వారు ఇతడిని అబుల్-హకం అని పిలిచేవారు, అనగా, "జ్ఞానానికి తండ్రి" అని అర్థం. కానీ ముస్లింలు ఇతడికి అబూ జహల్ అని పేరు పెట్టారు. ఇతను బదర్ యుద్ధంలో ఇద్దరు అన్సార్ బాలుర చేతిలో హతమయ్యాడు. రెండవవాడు అబూ లహబ్ బిన్ అబ్దుల్ ముత్తాలిబ్, ఇతను బనూ హాషిమ్ తెగకు చెందినవాడు మరియు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి స్వంత పిన్నాన్న. అబూ లహబ్ వ్యతిరేకత మరియు హింసలో అబూ జహల్‌కు సమానుడు, మరియు పవిత్ర ఖురాన్‌లో పేరు స్పష్టంగా ప్రస్తావించబడిన ఇస్లాం వ్యతిరేకులలో అతను ఒక్కడే అనే ఘనత కూడా అతనికి ఉంది. బదర్ యుద్ధం జరిగిన కొద్దికాలానికే అబూ లహబ్ మక్కాలో అనారోగ్యానికి గురై మరణించాడు. మూడవవాడు ఉఖ్బా బిన్ అబీ ముఆయిత్, ఇతను బనూ ఉమయ్యా వంశానికి చెందినవాడు మరియు అత్యంత దుర్మార్గుడు, చెడు మనస్తత్వం కలవాడు. ఇతను బదర్ యుద్ధంలో పాల్గొని చంపబడ్డాడు. ఆ తర్వాత ఉమయ్యా బిన్ ఖలఫ్, ఇతను బనూ జమహ వంశానికి చెందినవాడు. ఇతను దుర్మార్గం మరియు శత్రుత్వంలో అబుజహల్ లాంటివాడు. ఇతను బదర్ యుద్ధంలో చంపబడ్డాడు. ఉమయ్యా సోదరుడైన ఉబయ్యి బిన్ ఖలఫ్ కూడా అదే స్థాయికి చెందినవాడు. అతను ఉహుద్ యుద్ధంలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) చేతిలో గాయపడ్డాడు మరియు ఆ గాయం ద్వారా తన శిక్షను పొందాడు. తరువాత బనూ అబ్ద్ అల్-దార్ వంశానికి చెందిన నజర్ బిన్ హారిస్ అనే వ్యక్తి ఉండేవాడు. ఇతను దైవ పవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను వేధించేవాడు. ఇతను బదర్ యుద్ధంలో పట్టుబడ్డాడు మరియు ఇతని నేరాలకు శిక్షగా చంపబడ్డాడు. తరువాత అస్వద్ బిన్ అబ్ద్-యఘూస్, హారిస్ బిన్ ఖైస్, అస్వద్ బిన్ ముత్తలిబ్, అబూ ఖైస్ బిన్ ఫఖీద్, మునబ్బిహ్ బిన్ అల్-హజ్జాజ్, నబియ్యిహ్ బిన్ అల్-హజ్జాజ్, మాలిక్ బిన్ తలాతలా, హకం బిన్ అబీ అల్-ఆస్, రుకానా బిన్ యజీద్ మొదలైనవారు కూడా ఎంతో కొంత దుర్మార్గం మరియు శత్రుత్వంలో పాలుపంచుకున్నారు.

వీరు కాకుండా, చాలా శత్రుత్వం కలిగిన మరికొందరు వ్యక్తులు కూడా ఉన్నారు, కానీ వారు తరువాత ముస్లింలుగా మారినందున, వారిని ఇక్కడ ఈ జాబితాలో పేర్కొనడం సరైనది కాకపోవచ్చు, కానీ వారి గురించి ప్రత్యేకంగా ప్రస్తావించ బడుతుంది. **(తదుపరి సంచికలో)**

బదర్ ప్రతులను సంరక్షించండి:-

ఈ వార్తా పత్రిక లౌకిక కలుషితాల నుండి అతీతమైన ఆధ్యాత్మిక మరియు ప్రాపంచిక జ్ఞానానికి ఒక అమూల్యమైన నిధి. ఇది సమాజపు ఆశయాలు మరియు అవసరాలను నెరవేర్చుతుంది. బదర్‌లో ఖుర్‌ఆన్ సూక్తులు, ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి హదీస్‌లు, అలాగే హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) వారి ఉపదేశాలు మరియు రచనలు మాత్రమే కాకుండా, అనేక పవిత్రమైన ఉల్లేఖనాలు కూడా ఉంటాయి. ఈ విషయాలను అధ్యయనం చేయడం, ఇతరులకు చేరవేయడం, వాటిని ఆచరణలో పెట్టడం, అలాగే మన పిల్లల విద్యా మరియు నైతిక శిక్షణ కోసం ఉపయోగించడం మనందరి బాధ్యత.

ఈ లక్ష్యాలన్నింటినీ సాధించడానికి, బదర్ ప్రతులను సంరక్షించి, వాటిని క్రమబద్ధంగా రికార్డులలో భద్రపరచడం ఒక ముఖ్యమైన బాధ్యత.

ధార్మిక పరమైన విద్య మరియు నైతిక శిక్షణకు సంబంధించిన ఈ విషయాలు జమాఅత్ సభ్యులందరి నుండి గౌరవాన్ని కోరుకుంటాయి. ఇతర పాత వార్తాపత్రికలతో కలిసి దీనిని వ్యర్థ కాగితంగా అమ్మడం వంటివి చేసినట్లయితే దాని గౌరవాన్ని అవమానపరచినట్లే అవుతుంది. ఒకవేళ దానిని భద్రపరచడం సాధ్యం కాకపోతే, ఈ పవిత్ర రచనలకు అవమానం జరగకుండా మరియు ఎటువంటి అపవాదులకు లేదా విమర్శలకు కారణం కాకుండా జాగ్రత్తగా నిర్వర్తించాలి.

జమాఅత్ సభ్యులు ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ చూపించి, ఈ ప్రచురణ ద్వారా సంపూర్ణ ప్రయోజనం పొందుతూ, పై సూచనలను ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటారని ఆశిస్తున్నాము.

(సంపాదక మండలి)

ఉపశాఖల వార్షిక సమావేశాలు ఖాదియాన్

సయ్యద్నా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ గారు మజ్లిస్ అన్సారుల్లాహ్, ఖుద్దాముల్ అహ్మదియ్య, అత్ఫాలుల్ అహ్మదియ్య మరియు లజ్నా ఇమాఉల్లాహ్, నాసిరాతుల్ అహ్మదియ్యలకు చెందిన వార్షిక సమావేశాలు ఖాదియాన్ కొరకు 23, 24, 25 అక్టోబర్ 2026 (శుక్రవారం, శనివారము, ఆదివారము) తేదీలను ఆమోదించినారు. కావున నేటి నుండే ఈ పవిత్ర సమావేశాలలో పాల్గొనుటకు సంకల్పించి సన్నాహాలు ప్రారంభించగలరు. ఈ ఆధ్యాత్మిక సమావేశాలతో ప్రయోజనము పొందే అనుగ్రహము అల్లాహ్ మనందరికి కలిగించుగాక! ఈ వార్షిక సమావేశాలు అన్ని విధాలా విజయవంతమగుటకు, దీని ద్వారా సత్యవంతులు మార్గదర్శనము పొందాలని ప్రార్థనలు చేయగలరు. అల్లాహ్ అందరికి ఉత్తమ ప్రతి ఫలములు అందించు గాక! (ఆమీన్)

సీరత్ ఖాతమున్నబియ్యీన్
(సల్లల్లాహు అలైహి వసల్లం):-



రచన: హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ ఎం.ఏ (రజి).

దార్ అర్కంలో మొదటి ప్రచార కేంద్రం:-

బహుశా ఆ రోజుల్లోనే దైవ ప్రవక్త (స)కు మక్కాలో ఒక బోధనా కేంద్రాన్ని స్థాపించాలనే ఆలోచన కలిగి ఉండవచ్చు. అక్కడ ముస్లింలు ఎలాంటి ఆటంకం లేకుండా ప్రార్థనలు చేయుటకు ఏకమవడం, శాంతి, సంతృప్తి మరియు మౌనంతో క్రమం తప్పకుండా ఇస్లాం మతాన్ని ప్రచారం చేయడం వంటివి జరుగవచ్చును. ఇందు కోసం, కేంద్ర బిందువంటి ఇంటి అవసరం ఏర్పడింది. అందువలన, ప్రవక్త (స) ఒక నూతన ముస్లిం అయిన అర్కమ్ బిన్ అబీ అర్కమ్ ఇంటిని ఇష్టపడ్డారు. ఇది సఫా పర్వతం దిగువన ఉంది. ఆ తర్వాత ముస్లింలంతా అక్కడ గుమిగూడేవారు. వారు అక్కడ ప్రార్థనలు చేసేవారు. అక్కడే సత్యాన్వేషకులు వచ్చేవారు మరియు దైవ ప్రవక్త (స) వారికి ఇస్లాం బోధించేవారు. ఈ కారణంగా, ఆ ఇల్లు చరిత్రలో ప్రత్యేక ఖ్యాతిని కలిగి ఉంది మరియు దీనిని 'దార్ అల్-ఇస్లాం' అని పిలుస్తారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సుమారు మూడు సంవత్సరాలు దారే అర్కామ్‌లో ప్రచార, బోధన కార్యక్రమాలను నిర్వహించారు. అనగా, ప్రవక్త (స) నాల్గవ సంవత్సరంలో, దానిని తన కేంద్రంగా చేసుకుని, ఆరవ సంవత్సరం చివరి వరకు, వారు (స) అక్కడే ప్రచార, బోధన కార్యక్రమాలను నిర్వహించారు. దారే అర్కంలో ఇస్లాంను స్వీకరించిన చివరి వ్యక్తి హజ్రత్ ఉమర్ (రజి) అని చరిత్ర కారులు వ్రాసారు. వారు (రజి) ఇస్లాంను స్వీకరించడం వలన ముస్లింలకు చాలా బలం చేకూరింది. కావున వారు (రజి) దారే అర్కంను వీడి నిర్భయముగా ప్రచారం చేయడం, బోధించడం ప్రారంభించారు.

దారే అర్కంలో విశ్వసించిన వారు కూడా అగ్రశ్రేణులలో లెక్కించబడ్డారు. వారిలో అత్యంత ప్రముఖులు ఇలా గలరు: మొదటి వారు, ముసైబ్ బిన్ ఉమైర్ . వీరు అబ్దుల్-దార్ తెగకు చెందిన వారు. చాలా అందంగా మరియు ఆకర్షవంతముగా ఉండేవారు. వారి వంశంలోనే వారు చాలా ప్రియమైన మరియు గౌరవమైన వ్యక్తిగా పరిగణించబడేవారు. హిజ్రత్ కంటే ముందే యుస్రతిబ్‌కు మొదటి ఇస్లామిక్ మిషనరీగా పంపబడిన యువ మహోన్నతుడు మరియు వీరి ద్వారా మదీనాలో ఇస్లాం వ్యాప్తి చెందింది. ఆ తరువాత హజ్రత్ ఉమర్ (రజి) వారి అన్నయ్య అయిన జైద్ బిన్ ఖత్తాబ్. వీరు దైవ ప్రవక్త (స) మృతి చెందిన తరువాత యమామా యుద్ధంలో వీరమరణం పొందారు. హజ్రత్ ఉమర్ (రజి)కు వారి మరణం చాలా దిగ్భ్రాంతిని గురి చేసింది. అందుచేత, వారి ఖలీఫా పాలనలో ఒక వ్యక్తి వారి సోదరుని కీర్తిస్తూ కొన్ని పంక్తులను వారి ముందు పఠిస్తే, "నేను అలాంటి పద్యాలు చెప్పగలిగితే, నేను కూడా నా సోదరుడి కోసం అలాంటి ప్రశంసలు చెబుతాను" అని అన్నారు. అప్పుడు ఆ వ్యక్తి ఇలా బదులిచ్చాడు, ఓ విశ్వాసుల సేనాధిపతి! మీ అన్నకు లభించిన శుభ మరణం నా సోదరునికి లభించి ఉంటే, నేను అతని కోసం ఎన్నడు దుఃఖించేవాడిని కాను, కీర్తించేవాడిని కాదు. హజ్రత్ ఉమర్ (రజి)కు ఆంతర్యాన్ని గ్రహించే సామర్థ్యం ఉన్నందున వారు ఇలా అన్నారు: ఈరోజు ఈ మాటతో నువ్వు నన్ను ఓదార్చినంతగా ఎవ్వరు కూడ నన్ను ఓదార్చలేదు. ఆ తర్వాత తన అన్నయ్య మరణం పట్ల వారు (రజి) ఎన్నడు ఎలాంటి బాధను వ్యక్తం చేయలేదు.

మరల ఆ సమయంలో విశ్వసించిన వారిలో ఒకరు అబ్దుల్లా ఇబ్న్ ఉమ్మే మక్తూమ్ ఒకరు, అతను అంధుడు మరియు హజ్రత్ ఖదీజా (రజి) వారి ప్రియమైన వారిలో ఒకడు. అతనికి సంబంధించిన ఒక ఆసక్తికరమైన కథనం ఉంది, ఒకసారి దైవ ప్రవక్త (స) ఖురైష్‌ల గౌరవనీయ నాయకుడైన వలీద్ బిన్ ముగీరాకు చాలా ఉత్సాహంతో మరియు కార్యాచరణతో ప్రచారం చేస్తున్నారు. ఆ సమయంలలో ఇబ్న్ ఉమ్మే మక్తూమ్ (రజి) హడావిడిగా వచ్చి, ఒక ధార్మిక అంశంను గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)తో విచారించాలనుకున్నాడు. కావున ఆ కుతూహలంతో అక్కడ ఉన్న ప్రజలు ఎవరు? మరియు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఏమి చేస్తున్నారు? మరియు ప్రవక్త (స) వారి సమావేశ ప్రాధాన్యత దృష్ట్యా,అట్టి పరిస్థితుల్లో ఏం చేయాలి? అనే అంశాలను పట్టించుకోకుండా వ్యవహరించారు. కావున అతని ఈ చర్య పట్ల దైవ ప్రవక్త (స) అయిష్టతను వ్యక్తపరిచారు. కావున ప్రవక్త (స)వారి ముఖంలో అసమ్మతి సంకేతాలు కనిపించాయి, కానీ తమ ఉన్నత సుగుణాల కారణంగా ప్రవక్త (స) అతనిని తమ నాలుకతో ఏమీ అనలేదు. పైగా అతనిని పట్టించుకోకుండా వలీద్‌కు ప్రచారం చేయడం కొనసాగించారు. అబ్దుల్లా ఇబ్న్ ఉమ్మే మక్తూమ్ తన తప్పును గుర్తించకపోగా, అతను తన ఉదాసీనతకు బాధపడి, వలీద్ పెద్ద మనిషి కాబట్టి, బహుశా అతనితో పోలిస్తే ప్రవక్త (స) నా గురించి పట్టించుకోడు అని భావించాడు. ఈ ఆలోచన పూర్తిగా తప్పు మరియు నిరాధారమైనప్పటికీ, ఆ సమయంలో పేదలు, ధనవంతులు అనే ప్రశ్న లేదు. నిజానికి ఇలాంటి విషయాలు వినడానికి చాలా తక్కువ అవకాశం ఉన్న వ్యక్తికి బోధించడంలో ప్రవక్త (స) చాలా బిజీగా ఉన్నారు. కాని ఇలాంటి అవకాశం ఇబ్న్-ఐ-ఉమ్మే మక్తూమ్‌కు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుంది, కాబట్టి ప్రవక్త (స) ఈ అవకాశాన్ని కోల్పోవటానికి ఇష్టపడలేదు. అయితే ఇబ్న్ ఉమ్మే మక్తూమ్ ప్రవక్త (స) వారి ప్రసంగానికి అంతరాయం కలిగించడాన్ని తప్పుగా భావించారు. నిజానికి దీనిని సమావేశ గౌరవ మర్యాదలకు భిన్నంగా వ్యవహరించడం అంటారు. కానీ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి దయామయ సుగుణాల కారణంగా, ఇబ్నే ఉమ్ మక్తూమ్ యొక్క హృదయ వేదన గురించి ప్రవక్త (స)కు తెలియ జేయబడినప్పుడు మరియు దాని గురించి ఖురాన్ దైవవాణి కూడా వెలువడినప్పుడు, ప్రవక్త (స) అతనిని ఎంతో ఓదార్చాడు మరియు అరబ్ పద్ధతిలో తన శుభప్రదమైన వస్త్రాన్ని పర్చి దానిపై కూర్చుండబెట్టారు.

మరల ఆ సమయంలో ఇస్లాంను స్వీకరించిన వారిలో హజ్రత్ అలీ (రజి) వారి సొంత సోదరుడు మరియు ప్రవక్త (స) వారి సన్నిహిత మిత్రుడు అయిన జాఫర్ బిన్ అబీ తాలిబ్ ఒకరు. అతను సుగుణాల పరంగా మరియు అలవాట్లు, అభిరుచుల పరంగా దైవ ప్రవక్త (స)ను పోలి ఉంటాడు అని చరిత్రకారులు జాఫర్ గురించి వ్రాశారు. ఆ తరువాత అమ్మర్ బిన్ యాసిర్ విశ్వసించారు. అతను మజ్ హజ్ తెగకు చెందినవాడు మరియు తన తండ్రి యాసిర్ మరియు తల్లి సమియాతో కలిసి మక్కాలో నివసించేవాడు. ఆ తరువాత సుహైబ్ బిన్ సినాన్ విశ్వసించాడు. సాధారణంగా సుహైబ్ రోమనీయుడు అని పిలువబడేవాడు, కానీ వాస్తవానికి అతను రోమనీయుడు కాదు. వాస్తవానికి అతని తండ్రి ఇరాన్ ప్రభుత్వంచే ఒక ప్రదేశానికి అధికారిగా నియమించబడినప్పుడు, అతను రోమనీయులచే బంధించబడ్డాడు మరియు బానిసగా మారిపోయాడు. కొంతకాలం అక్కడ బానిసగా జీవించాడు. చివరగా, మక్కాకు చెందిన నాయకుడైన అబ్దుల్లా బిన్ జదాన్ ఖురాషీ అతనిని కొనుగోలు చేసి విడిపించాడు. సుహైబ్ (రజి) ముస్లిం అయినప్పుడు, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇతను మన మొదటి రోమనీయ ఫలము అని శుభ సూచకంగా చెప్పారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారి హిజ్రత్ తర్వాత సుహైబ్ (రజి) మక్కా నుండి మదీనాకు వలస వెళ్ళడం ప్రారంభించినప్పుడు, అతను పేద బానిసగా మా వద్దకు వచ్చాడు మరియు ఇప్పుడు అతను మా మధ్య ఉంటూ ధనవంతుడు అయ్యాడు కాబట్టి మేము అతనిని వదిలిపెట్టము అని ఖురేషీలు అతనిని ఆపారు. అందుకు సుహైబ్ (రజి) మీరు నా సంపదనంతా తీసుకుని నన్ను వెళ్ళనివ్వండి అని అన్నాడు. అందుకు ఖురైషులు అట్టి షరతుపై వారిని విడిచిపెట్టారు. ఈ సంఘటనకు గూర్చిన వార్త దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కి చేరినప్పుడు, ప్రవక్త (స) సంతోషంగా ఇలా అన్నారు:"సుహైబ్ (రజి) చాలా లాభదాయకమైన వ్యాపారం చేసాడు." హజ్రత్ ఉమర్ (రజి) తన ఖలీఫా పాలనలో తీవ్రంగా గాయ పడినప్పుడు, వారు (రజి) ఆ సమయంలో తన స్థానంలో సుహైబ్‌ను ఇమామ్‌గా నియమించారు. అందువల్ల, హజ్రత్ ఉమర్ (రజి) జనాజను కూడా సుహైబ్ (రజి) చదివించారు. మరల అబూ మూసా అష్రీ (రజి) కూడా ఆ సమయంలో లేదా ఆ సమయానికి అటు ఇటుగా ఇస్లాంను స్వీకరించారు. అబూ మూసా (రజి) యెమెన్ నివాసి మరియు చాలా ఉల్లాసంగా ఉండేవాడు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కూడా అతని గురించి ఒకసారి "అబూ మూసా (రజి) దావూదీ రాగం నుండి వాటా పొందాడు" అని అన్నారు. హజ్రత్ అలీ రజి గారి ఖిలాఫత్ కాలంలో హజ్రత్ అలీ (రజి) మరియు అమీరే ముఆవియాల మధ్య సంధి కుదిర్చిన మహోన్నత వ్యక్తి కూడ ఈ అబూ మూసా అష్రీ (రజి) గారే.

ఖురైష్‌ల వ్యతిరేకత ప్రారంభం మరియు దాని గల కారణాలు:-

పైన చెప్పినట్లుగా, దారే అర్కంలోకి ప్రవేశించే సమయానికి కొంచెం ముందు నుండే బహిరంగ ప్రచారం ప్రారంభమైంది మరియు మక్కా వీధుల్లో ఇస్లాం గురించి చర్చ కొనసాగింది. అప్పటి వరకు ఖురేషులు కొంత వరకు మౌనంగా ఉన్నారు, కానీ ఇప్పుడు వారు కూడా ఎక్కడ ఈ "వ్యాధి" ఎక్కువగా వ్యాపిస్తుందో మరియు ఇస్లాం యొక్క ఈ మొక్క మక్కా భూమిలో ఎక్కడ పాతుకుపోతుందో అని ఆందోళన చెందడం ప్రారంభించారు. అందుకే ఇప్పుడు వారు కూడా దానిపై శ్రద్ధ పెట్టడం ప్రారంభించారు మరియు బలవంతంగా ఇస్లాం వ్యాప్తిని ఆపాలని కోరుకున్నారు. ఈ వ్యతిరేకతకు కారణాలేంటి? ఈ ప్రశ్నకు సమాధానం ఇవ్వడానికి మనం పెద్దగా రాయాల్సిన అవసరం లేదు. ప్రపంచంలో స్థాపించబడిన ప్రతి కొత్త దైవిక వ్యవస్థను ప్రపంచం వ్యతిరేకించాలి, ఎందుకంటే ఆ కాలపు ప్రపంచీకులకు తెలియని విషయాలు ఆ దైవిక వ్యవస్థలో ఉంటాయి. కావున ప్రపంచీకులు తమ ప్రస్తుత అలవాట్లు మరియు ప్రస్తుత నమ్మకాలు మరియు ఆలోచనల కారణంగా వాటిని ఖచ్చితంగా తమ మరణంగా పరిగణిస్తుంటారు. వాస్తవానికి, ప్రపంచ ప్రజలు అల్లాహ్ తఆలా ఆకాంక్షించిన మార్గాన్ని అనుసరించడం విడిచిపెట్టి, వారి ప్రస్తుత తప్పుడు మార్గాన్ని సరైన మార్గంగా పరిగణించే సమయంలో ప్రవక్తలు పంపబడుతారు. కాబట్టి ఎప్పుడైతే ఒక కొత్త ప్రవక్త వచ్చి ప్రపంచాన్ని సరళ మార్గానికి పిలుస్తాడో, ప్రపంచం అతని మాటలను తప్పుగా అర్థం చేసుకుంటుంది మరియు అతనితో పోరాడటానికి సిద్ధమ వుతుంది. కాబట్టి, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ పవిత్ర ఖురాన్‌లో ఇలా చెప్పాడు:

يٰحَسۡرَةً عَلَى الۡعِبَادِ ۚ مَا يَاۡتِيۡهِمۡ مِّنۡ رَّسُوۡلٍ اِلَّا كَانُوۡا بِهٖ يَسۡتَهۡزِءُوۡنَ ○

"అనగా, ప్రజల పట్ల ఎంతటి విచారకరం: వారి వద్దకు ఏ ప్రవక్త వచ్చిన వారు హేళన, అవమానమునకు గురికాకుండా ఉండలేదు. (అన్‌ఆమ్:124)

ఆపై విచిత్రం ఏమిటంటే, గొప్పవారిగా భావించే వారు కూడ వ్యతిరేకతలలో తీవ్రముగా పాల్గొనేవారు. కాబట్టి సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఇలా అన్నాడు:

. وَكَذَٰلِكَ جَعَلْنَا فِي كُلِّ قَرْيَةٍ أَكَابِرَ مُجْرِمِيهَا لِيَمْكُرُوا فِيهَا

"మరో మాటలో చెప్పాలంటే, అనాధిగా కొనసాగుచున్న సాంప్రదాయం మేరకు సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌తో తమ సంబంధాన్ని తెంచుకుని, వివాదాలకు మరియు అల్లర్లకు మూలకారకులయ్యే పెద్ద వ్యక్తులే ఎల్లప్పుడు ప్రవక్తలకు వ్యతిరేకంగా నిలబడుతారు. "

కాబట్టి చూడండి, హజ్రత్ ఇబ్రహీం (అ) పంపబడినప్పుడు, వారి జాతిలోని గొప్ప వ్యక్తులు వారిని పట్టుకుని అగ్నిలో పడేశారు. హజ్రత్ మూసా (అ.) వచ్చినప్పుడు, వారికి కూడా తమ జాతి ప్రజలతో మరియు సంఘర్షణల బాధలను ఎదుర్కొవలసి వచ్చింది. ఏసుక్రీస్తు వచ్చినప్పుడు, వారి జాతి ప్రజలలోని పండితులు మరియు పరిసయ్యులు కలిసి వారిని సిలువకు బలి చేశారు. కృష్ణుడిని భారతదేశానికి పంపినప్పుడు, వారి జాతి ప్రజలు వారిని చంపడానికి కంకణం కట్టుకున్నారు. కావున అలాంటి పరిస్థితులలో ప్రవక్తల నాయకుడు (స) ఈ ప్రవక్తల సాంప్రదాయానికి అతీతుడు కాగలరా?. కాదు, వాస్తవానికి ఎంతగొప్ప లక్ష్యంతో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అవతరించారో, అంతే తీవ్రమైన వ్యతిరేకతను వారు (స) ఎదుర్కొవలసి ఉండెను. ఎందుకంటే వారు (స) అంధాకారం చాలా బలంగా ఉన్న సమయంలో పంపబడ్డారు. కావున కాంతి వచ్చినప్పుడు, చీకటి శక్తులు తమ పూర్తిశక్తితో దానితో పోరాడవలసిన అవసరం ఉంది. కాబట్టి గత ప్రవక్తలందరి కంటే ప్రవక్త (స) వారే అధికమైన వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. పైగా ఆ వ్యతిరేకతకు స్పష్టమైన కారణాలు ఇలా గలవు:

(1) ఖురైష్‌లు ఒక ఉన్నత స్థాయి విగ్రహారాధన చేసే జాతికి చెందినవారు. విగ్రహాల పట్ల గౌరవం మరియు ప్రేమ వారి హృదయాలలో ఎంతటి గాఢమైన ప్రభావాన్ని కల్గించాయనగా, వాటికి వ్యతిరేకంగా వారు ఒక్క మాట కూడా వినడానికి సిద్ధముగా లేరు. కేవలం అల్లాహ్ తాలా ఆరాధన కోసం నిర్మించిన కాబా గృహంలో కూడ ఈ మూర్ఖులు వందలాది విగ్రహాలను ప్రతిష్టించారు. వారి అవసరాలకు ఆ విగ్రహాలపై ఆధారపడేవారు. అలాంటి సమయంలో ఇస్లాం వచ్చింది. దాని ప్రధాన సూత్రం తౌహీద్ (ఏకేశ్వర ఆరాధన). పైగా ఏ వ్యక్తి లేదా చెట్టు లేదా రాయి లేదా నక్షత్రం మొదలైన వాటి ముందు ఎన్నడు మోకరిల్లకూడదనే స్పష్టమైన ఆదేశంతో పాటు **వస్‌జుదూ లిల్లాహిల్లజీ ఖలఖహున్న** అనే ఆదేశం కూడ గలదు. అనగా "వీటి అన్నింటిని సృష్టించిన ఉనికి ముందే మోకరిల్లుము. "

అంతే కాదు, ఖురేషుల విగ్రహాలను వారి దృష్టిలో అవమానకరపు పదాలలో గుర్తుచేయడం జరిగింది. అంతేగాకా వాటిని నరకం యొక్క ఇంధనం అని కూడ పిలిచేవారు. ఉదాహరణకు, అతను ఇలా అన్నాడు:

ఇన్నకుం వమా తఅబుదూన మిన్ దూనిల్లాహి హసబు జహన్నమ

అనగా ఓ ప్రజలారా! మీరు మరియు మీరు పూజించే మీ విగ్రహాలు నరకానికి ఇంధనం.

ఈ మాటలు ఖురేషుల శరీరాల్లో మంటలు రేపాయి మరియు ఇస్లాంను నాశనం చేయడానికి వారు కలిసి నిలబడ్డారు.

(2) విగ్రహారాధన కాకుండా, అరేబ్ ప్రజల అలవాట్లు మరియు నైతిక స్థితిని గూర్చి ఈ పుస్తకం ప్రారంభంలో వివరించబడింది. వ్యభిచారం, మద్యం, జూదం, దోపిడీ, హత్య, వ్యభిచారం వంటి వాటికి మార్కెట్ ఎప్పుడూ వేడిగా ఉండేది, కానీ ఇస్లాం వీటన్నింటిని నిషేధించింది. ఇస్లాం మతాన్ని స్వీకరించినచో వారు కొత్త జీవితాన్ని స్వీకరించవలసి వస్తుంది. ఇందుకు ఖురేషులు సిద్ధంగా లేరు. అదే విధముగా ఆచార సాంప్రదాయాలు కూడ అరబ్బుల మతం మరియు జాతిలో ఒక భాగమై పోయాయి. వాటి పరిస్థితి కూడ ఇలాగే ఉంది. అయితే ఇస్లాం మాత్రం అన్ని రకాల మురికిపట్టిన మరియు నైతిక వ్యతిరేక, మత వ్యతిరేక ఆచారాలను తన పాదాల క్రింద తొక్కేసింది.

(3) తమ పూర్వీకులను గౌరవించడం మరియు అది సరైనది లేదా తప్పు అయినా ప్రతిదానిలో వారిని అనుసరించడం అరబ్బుల మతంలో భాగం. అందుకే వారు ఇలా నొక్కి చెప్పేవారు.

బల్ నత్తబిఉ మా అల్ఫయినా అలైహి ఆబాఅనా

"అనగా, ఏది ఏమైన మా పూర్వీకులు అనుసరించిన మార్గమునే మేము కూడ అనుసరిస్తాము."

కానీ ఇస్లాం సత్యం మరియు అసత్యం మధ్య విజ్ఞానాన్ని నియమంగా ప్రకటించింది మరియు వారి విగ్రహారాధన చేసే పూర్వీకుల గురించి స్పష్టంగా ఇలా చెప్పింది: **అవలౌ కాన ఆబాఉహుం లా యాఖిలూన షైఅన్ వ్వలా యహ్‌తదూన్** అనగా ఒకవేళ "తమ పూర్వీకులు తప్పుదారిని అనుసరించువారైనను, మూర్ఖులు అయినను, వారు తమ పూర్వీకులనే అనుసరిస్తారా?."

(4) ఖురైష్‌లు చాలా గర్వించుకొను జాతి. ఈ ప్రజలు ఎవరినీ తమతో సమానంగా పరిగణించరు. బానిసలను అవమానిస్తూ, తమ చెప్పుచేతుల్లో ఉంచుకోవాలని కోరుకునేవారు. కానీ ఇస్లాం హక్కుల విషయంలో ఈ వ్యత్యాసాల న్నింటినీ తుడిచిపెట్టి, సార్వత్రిక సౌభ్రాతృత్వాన్ని నెలకొల్పుతుంది మరియు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ సన్నిధిలో యజమాని మరియు బానిసను ఒకే వరుసలో నిలబెడుతుంది. కావున ఇది ఖురైష్ నాయకులకు మరణ కప్పు కంటే తక్కువ కాదు.

(5) ఖురైష్‌లో చాలా మంది ప్రభావశీలురు మరియు సంపన్నులు కూడ ఉన్నారు. కానీ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒక ఉన్నత కుటుంబానికి చెందినప్పటికీ ఈ రెండు విషయాలకు దూరంగా ఉన్నారు. అనగా, ప్రవక్త (స) తన ఏకాంత స్వభావం కారణంగా ఖురైష్ నాయకులలో ఒకరు కాదు, లేదా సంపద పరంగా వారికి ఎలాంటి ప్రత్యేక హోదా లేదు. అటువంటి పరిస్థితిలో, మక్కా నాయకులు వారిని అనుసరించడం అంటే వారు గొప్ప త్యాగం చేయడమనే అర్థం. దీనికి ఆ ప్రజలు అస్సలు సిద్ధంగా లేరు. అందుకే వారు ఇలా అన్నారు:

లౌలా నుజ్జిల హాజల్ ఖుర్‌ఆన్ అలా రజులిన్ మినల్ ఖర్‌యతైని అజీమ్.

"ఈ ఖురాన్ మక్కా లేదా తైఫ్‌లకు చెందిన ఎవరైన గొప్ప వ్యక్తిపై ఎందుకు అవతరింప బడలేదు?"

(6) ఈ కారణాలే కాకుండా, ఖురైష్‌లోని వివిధ తెగల మధ్య తీవ్రమైన వ్యతిరేకత మరియు శత్రుత్వం ఉండటం మరొక కారణం, కాబట్టి ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి తెగ ఆయా తెగలపై ప్రాధాన్యతను సంతరించుకోవడం ఆయా మిగిలిన తెగలకు అస్సలు ఇష్టంలేదు. పైగా బను ఉమయ్యా మరియు బను మఖ్జూమ్ తెగలకు ప్రత్యేకించి బను హాషిమ్ తెగపై తీవ్రమైన శత్రుత్వం ఉండేది. అందుకే ఈ రెండు తెగలు మిగిలిన అన్ని తెగల కంటే ఎక్కువగా ఇస్లాంను వ్యతిరేకించడంలో పాల్గొన్నాయి.

తెగ నాయకుల వ్యతిరేకత:-

ఖురైష్‌లలో, ఇస్లాంను అత్యంత ఎక్కువగా వ్యతిరేకించి, ఈ ఉద్యమంలో ఇతరులకు నాయకులుగా పరిగణించబడిన వారందరూ ఒకే రకమైన స్వభావం కల్గిన వారు కాదు. కొందరికి వ్యక్తిగత ఔదార్యం ఉండేది. కావున వారు సాధారణంగా తమ ఔదార్య స్వభావంతోనే వ్యవహరించాలని కోరుకునేవారు, కానీ కొందరు తమ అహంకారం కారణంగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)వారి విధేయతను అంగీకరించలేక పోయారు, మరి కొందరు తమ పూర్వీకుల మతం, కొంతమంది "అనాగరిక మనస్తత్వం గలవారి" చేతుల్లో నాశనం అవుతుండటం చూసి బాధపడ్డారు. అలాంటి వారిలో, అత్యంత ప్రముఖులు ఈ వ్యక్తులు. వారిలో మొదటివాడు ముతయీమ్ ఇబ్న్ 'అద్ది, అతను బనూ నౌఫల్ తెగకు చెందినవాడు మరియు ఖురైష్ నాయకులలో ఒకడు. ముతయీమ్ ఒక కఠోర బహుదేవతారాధకుడు, కానీ అతను తన వ్యవహారాలలో ఔదార్య మార్గాన్ని అత్యంత ఉన్నతంగా అనుసరించేవాడు. కాబట్టి, ముందుకు వెళ్ళినచో, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు వ్యతిరేకంగా ఖురైష్ వారు చేసుకున్న బహిష్కరణ ఒప్పందాన్ని భగ్నం చేయడంలో మరియు తాయిఫ్ యాత్ర నుండి తిరిగి వచ్చినప్పుడు తన ఆశ్రయంలోకి తీసుకోని ప్రవక్త (స)ను మక్కాలోకి తీసుకరావడంలో ముతయీమ్ విశేషమైన ఔదార్యంతో, ధైర్యంతో వ్యవహరించాడని మనం చూస్తాము. రెండవ వ్యక్తి అబుల్-బఖ్తరీ, ఇతను బనూ అసద్ తెగకు చెందినవాడు. అబుల్-బఖ్తరీ కూడా వ్యతిరేకతలో తన ఔదార్యాన్ని ఏమాత్రం వదులుకోలేదు. అతని తర్వాతి స్థానంలో జుబైర్ బిన్ అబూ ఉమయ్యా అనే వ్యక్తి ఉన్నాడు, అతను హజ్రత్ ఉమ్మే సలమా (రజియల్లాహు అన్హా) వారి సోదరుడు మరియు వ్యతిరేకత ఉన్నప్పటికీ, అతను సాధారణంగా ఔదార్యం పక్షాన నిలిచాడు.

రెండవ రకం ప్రజలలో, వారి వ్యతిరేకత కూడా కొంత దుష్ట స్వభావాన్ని సంతరించుకుంది. వారిలో, ఈ వ్యక్తులు ప్రముఖులు. వారిలో మొదటివాడు ఉత్బా బిన్ రబియా, అతను బనూ అబ్ద్ షమ్స్ తెగకు చెందినవాడు మరియు చాలా ధనవంతుడు, పలుకుబడి కలవాడు. బదర్ యుద్ధం సందర్భంగా, ఉత్బా తన ఎర్రని ఒంటెపై స్వారీ చేస్తూ ఇస్లామీయ సైన్యం ముందుకి వచ్చినప్పుడు, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అతన్ని చూసి, "ఈ సమూహంలో ఎవరైనా శ్రేష్ఠులు ఉన్నారంటే, అది ఈ ఎర్ర ఒంటెపై స్వారీ చేసేవారే" అని అన్నారు. ఉత్బా సోదరుడైన షైబా కూడా అతని ప్రభావంలోనే ఉండేవాడు. వారిద్దరూ బదర్ యుద్ధంలో హజ్రత్ హంజా (రజియల్లాహు అన్హు) మరియు హజ్రత్ అలీ (రజియల్లాహు అన్హు) చేతిలో హతమయ్యారు. రెండవ వ్యక్తి వలీద్ బిన్ ముగీరా, హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ యొక్క తండ్రి మరియు ఖురైష్ తెగ నాయకుడు. ఖురైష్ ప్రజలు అతన్ని తమ తండ్రిగా కూడా భావించేవారు. ప్రవక్త (స) ప్రస్తానం చేసిన మూడు నెలల తర్వాత, వలీద్ ప్రమాదవశాత్తు ఒక బాణం దెబ్బకు మరణించాడు. మూడవ వ్యక్తి ఆస్ బిన్ వాయిల్-సహ్మీ. అతను హజ్రత్ అమర్ బిన్ ఆస్ యొక్క తండ్రి. అతను కూడా చాలా ధనవంతుడు మరియు పలుకుబడి కలవాడు. ఆస్ హిజ్రత్ రెండవ నెలలో, కాలు వాపుతో బాధపడుతూ మక్కాలో మరణించాడు.

మూడవ సమూహం యొక్క పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను వ్యతిరేకించడంలో పూర్తిగా గుడ్డిగా ఉన్నవారు వీరే. చట్టబద్ధమైన మరియు చట్టవిరుద్ధమైన అన్ని మార్గంలోనూ ఇస్లాంను, దాని స్థాపకుడిని భూమిపై నుండి తుడిచిపెట్టడానికి, ముస్లింలను తమ పాదాల కింద నలిపివేయడానికి ప్రయత్నించేవారు. ఈ ప్రజలు ఖురైష్ తెగలో అత్యంత శక్తివంతులు మరియు అత్యధిక సంఖ్యలో ఉన్నవారు. వారిలో ఈ క్రింది వ్యక్తులు ముఖ్యంగా ప్రముఖులు. మొదటివాడు అమర్ బిన్ హిష్షామ్, ఇతను బనూ మఖ్జూమ్ తెగకు చెందినవాడు. **(13వ పేజీలో చదవగలరు)**

EDITOR : SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
e-mail:
akhbaarbadarteluguqdn@gmail.com
www.akhbarbadr.in

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817

Weekly BADAR Qadian బదర్
Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA
తెలుగు వార పత్రిక

POSTAL REG NO GDP-38/2026 -2028. Vol. 11. Thursday, 22-29 OCT 2026, Issue No : 43-44

ACT.MANAGER
ATHAR AHMAD SHAMIM
Mobile. : +91 98156 39670
e-mail
managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.600/- (Per Issue: 12/-) (WEIGHT: 20-50, grms / issue)

సీరతుల్ మహ్దీ
(అలైహిస్సలాతు వస్సలాం):-

రచన: హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ ఎం.ఏ (రజి).

(51)బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం: మా తల్లిగారు ఇలా తెలిపారు: మీ నాయనమ్మ ఐమా హోషియార్‌పూర్ జిల్లాలో నివసించేవారు. మా చిన్నతనంలో మేము మా అమ్మతో కలిసి చాలాసార్లు ఐమా ఇంటికి వెళ్ళేవారమని హజ్రత్ సాహిబ్ చెప్పేవారు. అక్కడ హజ్రత్ సాహిబ్ తన చిన్నతనంలో పిచ్చుకలను పట్టేవారని, కత్తి దొరకనప్పుడు తలకు తగిలించే కొక్కెంతో వాటిని వధించేవారు. మా తల్లిగారు ఇలా తెలిపారు: ఒకసారి ఐమా నుండి కొంతమంది వృద్ధ మహిళలు వచ్చారు. వారు మాటల్లో "మా ఊరిలో సింధీ, పిచ్చుకలను పట్టేవారు" అని అన్నారు. వారు ఎవరిని సింధీ అని అంటున్నారో నాకు అర్థం కాలేదు. చివరికి, వారు హజ్రత్ సాహిబ్‌ను ఉద్దేశిస్తున్నారని తెలిసింది. మా తల్లిగారు మరల ఇలా తెలిపారు: మొక్కు తీర్చుకున్నందుకు ప్రతిఫలంగా, కొందరు, ముఖ్యంగా స్త్రీలు, తమ పిల్లలకు సింధీ అని ముద్దుపేరు పెట్టడం ఒక ఆచారం. అందువల్ల, ఈ కారణంగా, వారి చిన్నతనంలో వారి అమ్మ మరియు మరికొందరు స్త్రీలు వారిని ఆ పేరుతో పిలిచి ఉండవచ్చును. ఈ భవదీయుడు తెల్పునదేమనగా, సింధీ అనే పదం బహుశా దస్వంధి లేదా దస్బంధీ నుండి రూపాంతరం చెంది ఉండవచ్చు. ఈ పదాన్ని మొక్కుబడి ఫలితంగా ఏదైనా వస్తువును పదిసార్లు ముడివేసే బిడ్డను సూచించడానికి ఉపయోగిస్తారు, మరియు కొన్నిసార్లు మొక్కుబడి ఏమీ లేకపోయినా, కానీ ప్రేమతో స్త్రీలు తమ పిల్లలలో ఒకరికి ఈ ఆచారాన్ని పాటించి, అతడిని సింధీ అని పిలవడం ప్రారంభించేవారు.

(ఈ కథనంలో హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) తన బాల్యంలో కొన్నిసార్లు వేటాడిన పిచ్చుకను రెల్లు కర్రతో వధించేవారని చెప్పిన విషయానికి సంబంధించి, ఇక్కడ రెల్లు అంటే పూర్తి గుండ్రని రెల్లు కాదు, కోసిన రెల్లు ముక్క అని గమనించాలి. అది కొన్నిసార్లు ఎంత పదునుగా ఉంటుందంటే, ఒక సాధారణ కత్తి పదును కూడా దానితో పోటీపడలేదు. ఈ క్రమంలోనే ఈ భవదీయుడు తెల్పునదేమనగా, నేను కూడ స్వయంగా నా బాల్యంలో చాలాసార్లు రెల్లు కర్రతో నా చేతులను గాయపరుచుకునే దురదృష్టాన్ని పొందాను, మరియు పిచ్చుక వంటి జంతువు చర్మం ఎంత మృదువుగా ఉంటుందంటే, అది తేలికపాటి స్పర్శకే తెగిపోతుంది.

ఈ కథనంలో గమనించదగిన రెండవ విషయం 'సింధీ' అనే పదానికి సంబంధించింది. అంటే, ఈ పదానికి అర్థం ఏమిటి?, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గురించి మా తల్లిగారి ఎదుట ఈ పదాన్ని ఉపయోగించిన మహిళలు ఎవరు?. కాబట్టి నేను ఈ కథనాన్ని వివరించిన మహిళల గురించి మా తల్లిగారిని అడిగాను. వారు ఎవరో నాకు తెలియదని ఆమె చెప్పారు. వారు వచ్చారని మాత్రమే నాకు తెలుసు. బయటి నుండి ఖాదియాన్‌కు. మరియు ఇది ఆ జిల్లా. ఆమె హోషియార్‌పూర్ నుండి వస్తున్నట్లు నాకు చెప్పేది. అది తప్ప, ఆమె గురించి నాకు వేరే ఏమీ తెలియదు. సింధీ అనే పదం గురించి, ఈ భవదీయుడు తెల్పునదేమనగా, నేను ఈ పదంపై మరింత పరిశోధన చేశాను. ఈ పదం హిందీ మూలం కలది మరియు దీని అర్థం "తగిన సమయం" లేదా "శాంతి" లేదా "జంట". కాబట్టి ఈ సంప్రదాయం సరైనదైతే, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గురించి బాల్యంలో ఈ పదాన్ని అప్పుడప్పుడు ఉపయోగించడంలో, సరైన సమయంలో వచ్చే వ్యక్తి ఈయనే అని లేదా దేవుని నుండి శాంతి మరియు సామరస్యం యొక్క సందేశాన్ని తీసుకువచ్చే వ్యక్తి ఈయనే అని దేవుడు ఇచ్చిన సూచనగా ఇది కనిపిస్తుంది. ("యజఉల్-హర్బ్" హదీసును చూడండి) లేదా ఈ వ్యక్తి ప్రజలను దేవునితో ఏకం చేస్తాడని. లేదా ఆయనే ఒక జంటగా, అంటే కవలగా జన్మిస్తాడని (హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఒక జంటగా జన్మిస్తాడని కూడా ప్రచించబడింది). కాబట్టి ఈ సంప్రదాయం సరైనదైతే, వారిని సూచించడం కోసమే ఇది అని నేను భావిస్తున్నాను. మరియు అల్లాహ్‌కే బాగా తెలుసు. మిగిలిందల్లా... హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) పేరు సింధీ అని చెప్పి, ఒక ద్వేషి ఆయనను ఎగతాళి చేస్తాడు. కాబట్టి, ప్రాథమికంగా దీనికి సమాధానం ఇదే. ఒక పేరులో మతానికి లేదా నైతికతకు వ్యతిరేకంగా ఏమీ లేనంత వరకు, ఏ సజ్జనుడు దానిని అభ్యంతరం చెప్పలేడు. గత ప్రవక్తల పేర్లు. అవి కూడా ఏదో ఒక భాషకు చెందిన పదాలే. మరియు కనీసం వాటి అర్థాలు ఏమిటో మనం చెప్పలేము. ఉదాహరణకు, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)కు హిందీ మూలం ఉన్న పేరు వస్తే, అందులో తప్పేముంది? కానీ వాస్తవం ఏమిటంటే, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)కు సింధీ అని పేరు పెట్టారనేది పూర్తిగా నిరాధారమైనది మరియు పూర్తి నింద. మరియు ఏదైనా ప్రత్యర్థి లేదా ద్వేషి వద్ద దీనికి ఏదైనా సాక్ష్యం ఉంటే, అతను ముందుకు వచ్చి దానిని సమర్పించాలి, లేకపోతే అతను ఈ దైవిక హెచ్చరికకు భయపడాలి. ఇది ద్వేషుల కోసం శాపం రూపంలో నిర్దేశించబడింది. వాస్తవం ఏమిటంటే, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) అసలు పేరు మిర్జా గులాం అహ్మద్ అని ప్రపంచం మొత్తానికి తెలుసు. కాబట్టి (1) ఇది (1) వారి తల్లిదండ్రులు వారికి పెట్టిన పేరు. (2) ఈ పేరుతోనే వారి నాన్నగారు వారిని ఎల్లప్పుడూ పిలిచేవారు. (3) స్నేహితులు మరియు శత్రువులు అందరూ ఈ పేరుతోనే వారిని గుర్తుంచుకునేవారు. (4) నేను హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) అని పిలిచాను. నేను సియాల్‌కోట్ సేవకు సంబంధించిన (1864 నుండి 1868 వరకు) కొన్ని అధికారిక పత్రాలను చూశాను. ఇప్పటి వరకు భద్రపరచబడిన వాటిలో కూడా అదే పేరు ప్రస్తావించబడింది. (5) మా తాత గారు ఈ పేరు ఆధారంగా తాను స్థిరపడిన గ్రామాలలో ఒకదానికి అహ్మదాబాద్ అని పేరు పెట్టారు. (6) తాత గారి మరణం తరువాత, ఆ సంఘటన 1876లో అనగా, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) తమను తాము మసీహ్ అని ప్రకటించుటకు పద్నాలుగు సంవత్సరాల ముందు జరిగింది. మా పెదనాన్న హజ్రత్ సాహిబ్ పేరు మీద ఆస్తి బదిలీని ఆస్తి పత్రాలలో నమోదు చేసినప్పుడు. అప్పుడు అందులో గులాం అహ్మద్ అనే పేరు మాత్రమే నమోదు చేయబడింది. (7) ప్రభుత్వం ప్రచురించిన 'పంజాబ్ చీఫ్స్' అనే పుస్తకంలో, అదే పేరు వ్రాయబడింది. (8) అన్ని ఇతర అధికారిక పత్రాలు మరియు దస్తావేజులలో అదే పేరు నమోదు చేయబడింది. (9) ఇతర బంధువులు మరియు మిత్రులు అందరు కూడా ఆ పేరునే ప్రస్తావించారు. (10) హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) స్వయంగా తన లేఖలు, రచనలు మరియు పనులు మొదలైన వాటిలో ఈ పేరును ఎల్లప్పుడూ ఉపయోగించేవారు. (11) ఆంగ్ల న్యాయస్థానాలలో హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) పై దాఖలు చేయబడిన అన్ని కేసులలో, అధికారులు మరియు వ్యతిరేకులు ఇద్దరూ ఈ పేరును ఉపయోగించారు. (12) హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వాగ్దానం చేయడానికి ముందు, అవిశ్వాసులలో మొదటివాడైన మౌల్వి ముహమ్మద్ హుస్సేన్ సాహిబ్ బటాల్వి, బరాహినే అహ్మదీయ్యాపై ఒక సమీక్షను వ్రాసినప్పుడు, అతను కూడా అందులో ఈ పేరును ఉపయోగించాడు. (13) అత్యంత తీవ్ర వ్యతిరేకి, మౌల్వి సనావుల్లా అమృత్సరి, తన వ్యతిరేక రచనలన్నింటిలో ఈ పేరును ఎల్లప్పుడూ ఉపయోగించేవారు. 14) హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) మరణం గురించి కథనాలు రాసిన అనేక హిందూ, సిక్కు, క్రైస్తవ మరియు ముస్లిం వార్తాపత్రికలు కూడా వారిని ఈ పేరుతోనే పేర్కొన్నాయి. ఈ గొప్ప ఆధారాలు ఉన్నప్పటికీ, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) శత్రువులలో కొందరు వారి పేరు గులాం అహ్మద్ కాదని, బదులుగా సింధీ లేదా మరేదైనా అని భావిస్తే, అప్పుడు ఆ అబద్ధాల కోరులపై అల్లాహ్ శాపం కురియడం తప్ప మనకు వేరే మార్గం లేదు. ఈ విషయంలో, కథనాలు నెం. 25, 44, 98, 129, 134, 412 మరియు 438 కూడా చూడదగినవి, ఇవి ఈ చర్చపై మరింత వెలుగునిస్తాయి.)

(తదుపరి సంచికలో)

131 వ జల్సా సాలానా (వార్షిక సభ) ఖాదియాన్

సయ్యద్నా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 131 వ జల్సా సాలానా (వార్షిక సభ) ఖాదియాన్ కొరకు 25, 26,27 డిశంబర్ 2026 (శుక్రవారం, శనివారము, ఆదివారము) తేదీలను ఆమోదించినారు. ఇప్పటి నుండే జమాఅత్ సభ్యులు ఈ పవిత్ర సభలో పాల్గొనుటకు సంకల్పించి సన్నాహాలు ప్రారంభించగలరు. ఈ ఆధ్యాత్మిక సభతో ప్రయోజనము పొందే అనుగ్రహము అల్లాహ్ మనందరికి కలిగించుగాక! ఈ వార్షిక మహాసభ అన్ని విధాలా విజయవంతమగుటకు, దీని ద్వారా సత్యవంతులు మార్గదర్శనము పొందాలని ప్రార్థనలు చేయగలరు. అల్లాహ్ అందరికి ఉత్తమ ప్రతి ఫలములు అందించు గాక! (ఆమీన్) **(నజారత్ ఇస్లాహ్ ఇర్షాద్ దక్షణ భారత దేశపు ఖాదియాన్)**

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz